కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



ఎన్నికల సంఘం ఎల్లప్పుడూ.. మోదీ ప్రభుత్వం చేతిలో 'కీలుబొమ్మే'
జైళ్లల్లో హింసాత్మక ధోరణులపై నిఘా వేయండి
ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు
కేరళ సిఎం నివాసానికి బాంబు బెదిరింపు
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 224 | సోమవారం | 14-07-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## సిపిఐ 4వ రాష్ట్ర మహాసభల
# లోగో ఆవిష్కరణ

- పార్టీ బలోపేతానికి మరింత ప్రచారం చేయాలి
- ఇంటింటికి వెళ్లి లక్ష్యాలను వివరించాలి
- చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని సిపిఐ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ

తరువాయి 2లో






## విలక్షణ నటుడు
# కోట శ్రీనివాసరావు కన్నుమూత

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు శకం ముగిసింది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాస రావు (83) ఆదివారం ఉదయం ఫిలిం నగర్‌లోని ఆయన నివాసంలో కోట కన్నుమూశారు. కోటకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2010 జూన్ 21న రోడ్డు ప్రమాదంలో కోట కుమారుడు కోట ప్రసాద్ చనిపోయారు. 1942 జూన్ 10వ తేదీన కోట శ్రీనివాసరావు కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. 1968లో రుక్మిణీని పెళ్ళి చేసుకున్నారు. సినిమా పరిశ్రమకు రాక ముందు కోట శ్రీనివాసరావు బ్యాంకులో ఉద్యోగం చేశారు. 1978లో 'ప్రాణం ఖరీదు' సినిమాతో కోట సినీ రంగ ప్రవేశం చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా వెండి తెరపై వెలిగిపోయిన కోట శ్రీనివాసరావు సుమారు 750కు పైగా సినిమాల్లో నటించారు. తెలుగు, తమిళ , కన్నడ, హిందీ సినిమాల్లో తనదైన శైలిలో నటనను ప్రదర్శించారు. తెలుగు తెరపై కోట ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో సహ నటుడు, ప్రతి నాయకుడి పాత్రలను పోషించిన కోట హాస్య రసాన్ని కూడా పండించడంలో దిట్ట అని మెప్పించారు. అహ నా పెళ్ళంట, ప్రతి ఘటన ఖైదీ నెంబర్ 786,

తరువాయి 2లో



## కన్నుల పండువగా
# ఉజ్జయిని బోనాలు

- పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రభుత్వం తరపున తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- కట్టుదిట్టమైన పోలీసు భద్రత, భక్తుల ఆనందోత్సాహాల మధ్య జాతర

ప్రజాపక్షం/హైదరాబాద్

చారిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగ కన్నుల పండుగగా జరిగింది. వైభవోపేతంగా మహంకాళి బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరిపారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో తెల్లవారు జాము నుంచే మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి మహంకాళి జాతరకు ప్రజలు తరలివచ్చారు. బోనాల జాతర పురస్కరించుకొని సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. ఉజ్జయిని మహంకాళి దేవాలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ అధికారులు దేవాలయం మొత్తం రంగులు, పువ్వులు, విద్యుత్ దీపాలతో

తరువాయి 2లో



## కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి
# సర్వం సిద్ధం

- నేడు సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో భారీ బహిరంగ సభ

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ప్రారంభానికి సూర్యాపేట జిల్లా మరోసారి వేదిక అవుతోంది. ఉగాది పర్వదినాన రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని హుజూర్‌నగర్ కేంద్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభం చేసిన విషయం అందరికి తెలిసిందే. ఆనాడు తొలిసారిగా సిఎం హోదాలో సూర్యాపేట జిల్లాలో అడుగుపెట్టిన రేవంత్‌రెడ్డి మరోసారి నూతన రేషన్‌కార్డుల పంపిణీకి నేడు (సోమవారం) తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మున్సిపల్ కేంద్రానికి రానున్నారు. ఈ కార్డుల పంపిణీకి అధికారులు ఇప్పటికే సర్వం సిద్ధం చేశారు. సిఎం చేతుల మీదుగా 11 మంది లబ్ధిదారులకు కార్డులను అందించనున్నారు. కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ విజయవంతం చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు గత వారం రోజులుగా వరుస సమీక్ష, సమావేశాలు జరిపారు. సంబంధిత జిల్లా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ

తరువాయి 12లో

# 'భాయ్.. బచ్చా ఆగయా భాయ్'

- గంజాయి వినియోగదారులపై 'ఈగల్ టీమ్' డెకాయ్ ఆపరేషన్
- పోలీసులు పంపిన లొకేషన్‌కు 14 మంది వినియోగదారులు
- అదుపులోకి తీసుకుని, డీ అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

**హైదరాబాద్:** తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ టీమ్ చాలా చురుగ్గా పని చేస్తోంది. ఇప్పటికే పలు డ్రగ్స్ రాకెట్‌లను బయటపెట్టింది. తాజాగా గంజాయి వినియోగదారులని చాలా తెలివిగా పట్టుకుంది ఈ టీమ్. గంజాయి వినియోగదారులను పట్టుకొనేందుకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. ఇటీవల మహారాష్ట్రకు చెందిన సందీప్ అనే గంజాయి సరఫరాదారును ఈగల్ టీమ్ అరెస్ట్ చేసింది. అతని ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్ ద్వారా ఈ డెకాయ్ ఆపరేషన్ చేసింది. గంజాయి వచ్చిందంటూ కస్టమర్లకు పోలీసులు మెసేజ్ పెట్టారు. 'భాయ్ బచ్చా ఆగయా భాయ్' అనే వాట్సాప్ కోడ్‌తో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కోడ్ పంపి గచ్చిబౌలిలోని ఓ ప్రదేశానికి రావాలని ఈగల్ టీమ్ పేర్కొంది. దీంతో రెండు గంటల్లో 14 మంది వినియోగదారులు

తరువాయి 2లో



## దేశవ్యాప్తంగా ఓటరు జాబితా
# సమగ్ర సవరణ

- వచ్చే నెల నుంచి కసరత్తు మొదలు పెట్టేందుకు ఇసి సన్నాహాలు
- చివరిసారిగా 'సవరణ' చేసిన ఓటరు లిస్టులు అందుబాటులోకి తెస్తున్న సిఇఒలు

**న్యూఢిల్లీ :** వచ్చే నెల (ఆగస్టు) నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) సమాయత్తం అవుతోంది. ఇందుకోసం ఎక్కడికక్కడ ఎన్నికల యంత్రాంగాలను క్రియాశీలం చేస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఓటరు జాబితా సమగ్ర సవరణను మొదలుపెట్టేందుకు ఇసి సన్నాహాలు చేస్తోంది. వివిధ రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులు (సిఇఒలు) ఆయా రాష్ట్రాల్లో చివరిసారిగా ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరిగిన తర్వాత ప్రచురితమైన ఓటరు జాబితాలను బయటికి తీస్తున్నారు. వాటిని తమ అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులోకి తెస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 2008లో, ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఓటరు జాబితాల సవరణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ఆయా సంవత్సరాల్లో ప్రచురించిన ఓటరు జాబితాలను ఢిల్లీ సిఇఒ, ఉత్తరాఖండ్ సిఇఒ అధికారిక వెబ్‌సైట్లలో ఇప్పుడు అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది అక్టోబరు నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో చివరిసారిగా 2003లో ఓటరు జాబితా సమగ్ర సవరణ జరిగింది. ఆ ఏడాది ప్రచురితమైన ఓటరు జాబితాలోని సమాచారం ఆధారంగానే ఇప్పుడు బిహార్‌లో ఓటరు

తరువాయి 12లో

## పాలస్తీనా అనుకూల సంస్థపై ఉగ్రముద్ర
# బ్రిటన్‌లో ప్రదర్శనలు

70 మంది అరెస్టు




**లండన్ :** పాలస్తినా అనుకూల సంస్థపై ఉగ్రవాద ముద్ర వేయడాన్ని వ్యతిరేకిస్తూ బ్రిటన్‌లో పలుచోట్ల ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసులు 70 మందిని అరెస్టు చేశారు. లండన్‌లో జరిగిన ప్రదర్శనలో 42 మందిని అరెస్టు చేశారు. మాంఛెస్టర్‌లో 16 మందిని, సౌత్ వేల్స్‌లో 13 మందినీ పోలీసులు నిరసన ప్రదర్శనల సందర్భంగా అరెస్టు చేశారు. పాలస్తినా ప్రజలు తమ హక్కులకోసం స్వదేశంలో పోరాడుతున్నారు. వారికి మద్దతుగా అమెరికా, యూరప్‌లలో కూడా విద్యార్థులతో పాటు పాలస్తినా వలస ప్రజలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది జూన్ 20వ తేదీన లండన్‌లోని

తరువాయి 2లో

# ఉప్పు తెగ బుక్కేస్తున్నారు

- భారతీయులే అధికంగా వినియోగిస్తున్నట్లు ఐసిఎంఆర్ అధ్యయన నివేదిక వెల్లడి
- జీవనశైలి సమస్యలు ప్రతి ఒక్కరిలో పెరుగుతాయని హెచ్చరిక



**న్యూఢిల్లీ :** భారతీయులు చాలా ఎక్కువ ఉప్పు (సోడియం క్లోరైడ్) తింటున్నారని ఐసిఎంఆర్ (భారత వైద్య పరిశోధనా మండలి) అధ్యయన నివేదిక వెల్లడించింది. ఇలా చాలా ఎక్కువగా ఉప్పు తినడంవల్ల నిశ్శబ్ద జీవనశైలి సమస్యలు ప్రతిఒక్కరిలో పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. ఐతే లో సోడియం సాల్ట్ (ఎల్ ఎస్ ఎస్) ఎక్కువమంది వినియోగదారులకు అందుబాటులో లేకపోవడం ఒక సమస్యగా ఉందని కూడా అధ్యయనం వెల్లడించింది. డిమాండ్‌కు తగినవిధంగా సరఫరాలు కూడా ఉండాలని తెలిపింది. సాధారణ ఉప్పు చాలా ఎక్కువగా తినడంవల్ల భరించలేని అధికరక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, గుండెకు రక్తాని సరఫరాచేసే నాళాలలో సమస్యలు, కాలేయ సంబంధ వ్యాధులతోపాటు మధుమేహం, మతిమరపు, ఆలోచనాధోరణిలో సమతుల్యత లోపించడం వంటి అనేక సమస్యలు కూడా జీవనశైలిలో మనకు తెలియకుండానే పెరిగిపోతున్నాయని ఐసిఎంఆర్ నేషనల్ ఎపిడెమియోలొజీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఐఇ) సైంటిస్టుల నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. తొలుత ఈ శాస్త్రవేత్తలు ఆరంభంలో ఒక వర్గంలో ఉప్పును తగ్గించేందుకు అధ్యయనం ప్రారంభించింది. ఆ సమస్య పరిష్కారానికి మార్గాలు ఆలోచించారు. సోడియంను తక్కువ మోతాదులో ఉపయోగించే విషయాలను పరిశీలించారు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఓ) చేసిన సూచన ప్రకారం ప్రతి మనిషీ రోజుకు ఐదు గ్రాముల ఉప్పు మాత్రమే ఆహారంలో తీసుకోవాలి, కానీ పట్టణ ప్రాంతాలలో భారతీయులు ప్రతి రోజూ 9.2 గ్రాముల ఉప్పు తింటున్నారు. చివరకు గ్రామీణ

తరువాయి 12లో

# ముందుకు సాగని ఖరీఫ్ సాగు

- నేటికీ 26 శాతం లోటు వర్షపాతమే
- నెలన్నరగా అంతంత మాత్రమే
- గత సీజన్‌లో ఇప్పటికే 74 శాతం సాగు.. ప్రస్తుతం 35 శాతమే
- వానల కోసం అన్నదాతల ఎదురు చూపులు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

ఈ ఏడాది వానాకాలం ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. గత ఏడాది ఈ పాటికే 74 శాతం సాగు నమోదు అవగా ప్రస్తుతం 35 శాతం సాగు మాత్రమే నమోదు అయింది. నేటికీ సరైన వర్షాలు కురువక రైతులు వరినార్లు పోయడం ఆలస్యం అవుతుండడమే కారణంగా చెబుతున్నారు. ఈ ఏడాది రుతు పవనాలు ముందుగానే ప్రవేశించడంతో వర్షాలు పుష్కలంగానే కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. రోహిణి కార్తెలో ముందస్తుగా మురిపించిన వానలు... ఆ తర్వాత ఆశించినంతగా ఉండకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. తొలకరి వర్షాలకే మురిసిపోయి దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. కానీ ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆశించినంతగా వర్షాలు కురవలేదు. దాదాపు ఆరు జిల్లాల లోనూ సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ నెలారంభం నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో సగటున 25.8 శాతం తక్కువ వర్షం పడింది. జనగామ జిల్లాలో అత్యధికంగా 41శాతం లోటు వర్షపాతం రికార్డయింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఆరు జిల్లాల్లో రెండింటిలోనే సాధారణ వర్షం కురవగా, మిగతా నాలుగు జిల్లాల్లో లోటు వర్షమే పడింది. 20 నుంచి 59 శాతం మేర తక్కువ వర్షం పడితే దానిని లోటుగా, 19 శాతం కన్నా తక్కువ వర్షం కురిస్తే దానిని సాధారణ వర్షపాతంగా, 59 నుంచి 100శాతం కన్నా తక్కువ వర్షం కురిస్తే దానిని తీవ్రమైన

తరువాయి 12లో



## దశాబ్ద కాలంగా క్రీడారంగం
# భ్రష్టు పట్టింది

- ప్రజాప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఏడాది పూర్తి సందర్భంగా 'ప్రజాపక్షం' ప్రత్యేక ఇంటర్వ్యూలో కె.శివసేనారెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడా రంగం భ్రష్టు పట్టిపోయిందని.. ప్రజాపాలనలో క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రం పూర్తిగా మారిందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో యువ క్రీడాకారుల్లో ఉత్సాహం నిండడంతో పాటు అనేక జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు హైదరాబాద్ వేదికగా మార్చామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శివసేనారెడ్డి 'ప్రజాపక్షం'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రశ్న : ఏడాది కాలంలో క్రీడారంగంలోఎలాంటి అభివృద్ధి చేశారు..**

చైర్మన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక విధానం అంటూ లేకుండా, క్రీడాకారులు యువకుల పట్ల పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించింది. యువత డ్రగ్స్‌కు గంజాయికి బానిసలు అవుతుంటే చోద్యం చూసింది. సిఎం రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే తెలంగాణ యువత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు లోను కాకుండా ఎటువంటి చర్యలు చేపడితే బాగుంటుందనే ఆలోచనతో యువకులను వైన్స్‌లు బార్లు వైపు కాకుండా

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అమెరికాపై ప్రతీకార సుంకాలు
### ఇయు కమిషన్ హెచ్చరిక



**పారిస్:** అదనంగా 30 శాతం సుంకాలు విధించిన ట్రంప్‌పై యూరోపియన్ యూనియన్ (ఇయు), మెక్సికోలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఆగస్టు ఒకటో తేదీ నుండీ అమలయ్యేవిధంగా ఈ దేశాలకు ట్రంప్ టారిఫ్ లేఖలు పంపారు. ట్రంప్ తీరు చాలా అన్యాయంగా ఉందని మెక్సికో విమర్శించింది. తమ దేశ సార్వభౌమాధికారంతో రాజీపడేదిలేదని స్పష్టం చేసింది. ఇ యు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ కూడా విమర్శల దాడి చేశారు. అవసరమైతే అమెరికాపై ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అదేసమయంలో అమెరికాతో టారిఫ్‌లపై సంప్రదింపులకు తాము సిద్ధంగా ఉన్నామని కూడా మెక్సికో, ఇయు దేశాల ప్రతినిధులు ప్రకటించారు. కానీ ట్రంప్ కూడా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. ప్రతీకార సుంకాలు గనుక విధిస్తే పరిస్థితులు తీవ్రంగా విషమిస్తాయని, అనూహ్యస్థాయిలో భారీ పన్నులు విధిస్తామని ఆయన ఎదురుహెచ్చరిక చేశారు.

## హ్యూమానిటేరియన్ సిటీకి ఆరు లక్షల మంది..
# రఫాలో ముమ్మరంగా ఐడిఎఫ్ ఏర్పాట్లు

**రఫా:** గాజా కోస్తా తీర ప్రాంతం అల్ మవాసీ నుండి పాలస్తీనా ప్రజలను బలవంతంగా తరలించేందుకు వీలుగా ఉద్ధృతంగా రఫాలో విధ్వంస కార్యక్రమాలను కొనసాగిస్తోంది. సనద్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ చేసిన దర్యాప్తులో ఈ విషయం బహిర్గతమైంది.పాలస్తీనియన్లను సగం ప్రాంతం నుండి పూర్తిగా తరలించేందుకు ట్రంప్ జోక్యంతో నెతన్యాహూ చాలాకాలంగా ప్రణాళిక చేస్తున్నారు. ఇదే ప్రణాళిక రఫాలో కొనసాగుతున్నది. నిర్మాణాల విధ్వంస కార్యక్రమం చాలా చురుగ్గా కొనసాగుతోంది. ఆరులక్షలమందిని దక్షిణ గాజాలో నిర్బంధ కేంద్రాల నుండి తరలించే ప్రణాళిక అమలు చేసేందుకు ఇదంతా జరుగుతోంది.ఈఏడాది జులై నాలుగోతేదీన లభ్యమైన ఉపగ్రహ ఛాయాచిత్రాల సమాచారం ప్రకారం రఫాలో ధ్వంసం చేసిన భవనాల సంఖ్య28,600కు పెరిగింది. గడచిన ఏప్రిల్ నెలలో ఇలా ధ్వంసమైన భవనాలసంఖ్య 15,800మాత్రమేఉండేవి.అంటేఏప్రిల్ నుండిఇప్పటివరకూమూడున్నర నెలల కాలంలో





12,800 భవనాలను శరవేగంగా సామూహికంగా ధ్వంసం చేశారు. గడచిన సోమవారం నాడు ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రాథమికంగా 6,00,000 మందితో హ్యూమానిటేరియన్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అల్ మవాసీ నుండి పాలస్తీనియన్లనురఫాకు తరలించేందుకు ఈ హ్యూమా నిటేరియన్ సిటీని తయారుచేస్తున్నారు.ఒకవేళహమాస్‌తో ఏదైనా 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరిగితే ఈ గడువు సమయంలోఈహ్యూమానిటేరియన్ సిటీని పూర్తి గా సిద్ధంచేస్తారన్నమాట. గాజాలో మొత్తం గా ఉన్న 20 లక్షల మంది పాలస్తీనియన్లను ఈ హ్యూమానిటేరియన్ సిటీకి తరలించే ప్రయత్నం జరుగుతోంది.ఈచర్యలను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.ఈ విధంగా బలవంతంగా ప్రజలను తరలించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని వారు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఐతే ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ మాత్రం, పాలస్తీనా ప్రజల రక్షణ కోసమే హ్యూమానిటేరియన్ సిటీ నిర్మిస్తున్నట్లుబుకాయిస్తున్నారు.

### మంచినీళ్ళు పట్టుకుంటే పదిమందిని చంపేశారు

గాజాలోఇజ్రాయెల్‌సైన్యం మితిమీరిన దురాగతాలకు పాల్పడుతున్నది. మంచినీటి సరఫరా కేంద్రం వద్ద మంచినీరు తాగుతున్నవారిని, మంచినీటిని పీపాలలో నింపుకుంటున్న పాలస్తినా ప్రజలపై ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం దాడులు చేసి పదిమందిని చంపేసింది. మృతదేహాలను నుజ్రెత్ అల్‌అవ్దా ఆసుపత్రికి తరలించారు. ఈవీడియోలను ఆన్‌లైన్‌లో షేర్ చేశారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారు. పొరుగునున్నవారు గాయపడినవారిని గాడిదబండ్లపై ఆసుపత్రికి తరలించారు. రెడ్‌క్రాస్ ఇంటర్నేషనల్ కమిటీ ఈ చర్యలను ఖండించింది.గడచిన ఆరువారాలుగా దక్షిణ గాజాలో అమాయకులైన ప్రజలపై దాడులు సర్వసాధారణంగా మార్చేశారని విమర్శించింది. ఈ విధంగా గాజాలో ఆదివారం 50 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా సివిల్ డిఫెన్స్ ఏజన్సీ తెలిపింది. ముందు రోజు శనివారం చేసిన గగనతల దాడుల్లో 110మంది మరణించారు. రఫాలో ఆహార సరఫరా కేంద్రంవద్ద ఆహారం కోసం ఎదురు చూస్తున్న34మందినిఇజ్రాయెల్‌సైన్యం కాల్చిచంపింది. శనివారంనాడు ఆసుపత్రిలో 132 మందికి చికిత్స చేశామని, వీరిలో 32 మంది మరణించారని రఫా ఆసుపత్రివర్గాలు చెప్పాయి. గడచిన మే నెల 27 నుండి తమ ఆసుపత్రిలో తూటాలవల్ల గాయపడిని 3,400 మందికి చికిత్సలు చేయగా, మరో 250 మంది మరణించారని వర్గాలు తెలిపాయి.

## స్త్రీ హక్కులకోసం కోర్టుకెక్కిన పెలికాట్‌కు ఫ్రాన్స్‌ఉన్నత పౌర పురస్కారం



**పారిస్:** దారుణ అణచివేతకు గురిచేసి లైంగిక దోపిడీకి పాల్పడిన తన భర్తకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిం చి బాహాటంగా హక్కులకోసం పోరాడిన గిసెల్ పెలికాట్ (72)కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. ఈ నెల 14వతేదీ ఫ్రాన్స్ జాతీయ దినోత్సవానికి ముందుగా పురస్కారాలకు అర్హులైన వారి పేర్ల జాబితాలో గిసెల్ పెలికాట్‌ను "నైట్ ఆఫ్ ద లెజియన్ ఆఫ్ ఆనర్" పురస్కారంతోసత్కరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మెరిట్‌ప్రాతిపదికపై జాతికి సేవలు అందించినవారిని ఎంపిక చేసిన 589మందిలో పెలికాట్‌ను కూడా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపిక చేశారు. పెలికాట్ కేసులో న్యాయస్థానం 2024 డిసెంబరు 19వ తేదీన అంతిమతీర్పు ప్రకటించింది. ఈ కేసులో 50మందిని దోషులుగా తేల్చింది. గిసెల్ పెలికాట్ భర్త డొమినిక్ పెలికాట్ తను చేసిన నేరాలను ఇటీవల కోర్టులో అంగీకరించాడు. తన భార్య గిసెల్‌కు మత్తుమందు ఇచ్చి స్పృహలో లేకుండా చేసి తాను అత్యాచారం చేయడమే కాకుండా తన మాస్టర్ బెడ్‌రూమ్‌కు అనేకమంది మగవాళ్ళను ఆహ్వానించి వారికి కూడా భార్యశీలాన్ని తాకట్టుపెట్టానని ఒప్పుకున్నాడు. ఈ విధంగా పది సంవత్సరాలపాటు గిసెల్ పెలికాట్ లైంగిక దోపిడీకి గురైంది. వందలమంది ఆమెను లైంగికంగా చిత్రహింస చేశారు. కానీ గిసెల్ తర్వాత ఏ మాత్రం సిగ్గు పడకుండా తన భర్త తనకు చేసిన అన్యాయాన్ని బాహ్య ప్రపంచానాకి ఎలుగెత్తి చాటింది. వీధుల్లోకి వచ్చి న్యాయంకోసం అర్థించింది. తన హక్కులను రక్షించాలని న్యాయస్థానాన్ని కోరింది. దీంతో గిసెల్ పెలికాట్ ప్రపంచవ్యాప్తంగా హక్కులకోసం పోరాడిన మహిళామణిగా పేరు ప్రఖ్యాతి సాధించారు. ఈ కేసు పరిష్కారమయ్యాక ఫ్రాన్స్ ప్రభుత్వం కూడా ఆమెను దేశ అత్యున్నత పౌర పురస్కారానికి ఎంపిక చేసింది.



## ఎప్స్టీన్ ఫైల్స్‌ను బయట పెట్టకపోతే
# ట్రంప్‌ను ఎవ్వరూ నమ్మరు : ఎలాన్‌మస్క్

**వాషింగ్టన్ :** ఎప్స్టీన్ ఫైల్స్‌ను బయట పెట్టకపోతే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఎవ్వరూ నమ్మే అవకాశం ఉండదని ఆయన పూర్వ సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నారు. దేశంలో మెల్లిగా ట్రంప్‌పట్ల తీవ్ర వ్యతిరేకత ఉద్ధృతం అవుతున్న తరుణంలో ఎలాన్‌మస్క్ తాజాగా ఎప్స్టీన్ ఫైల్స్ ప్రస్తావన చేశారు. ఈ సమస్య ఇంకా పరిష్కారం కాలేదనీ, ఇది మరుగున పడిపోలేదనీ, ఈ సమస్య ఇంకా రాజుకుంటూనే ఉందని మస్క్ అన్నారు. ట్రంప్ మాజీ సహాయకుడు స్టీవ్ బానన్ ఎప్స్టీన్ ఫైల్స్‌లో ఉన్నారని ఆయన ఆరోపించారు. వేలాదిమంది పిల్లలను లైగింకంగా వేధింపులకు గురిచేసిన వీడియోలు ప్రభుత్వం వద్ద ఉంటే మరి ఇంతవరకూ అత్యాచారాలకు పాల్పడినవారు ఎందుకు న్యాయస్థానం ముందు కేసులు ఎదుర్కోవడంలేదని మస్క్ ప్రశ్నించారు. చిన్న పిల్లలను మభ్యపెట్టి వారిని లైంగికంగా వేధించి దుర్వినియోగం చేయడమే కాకుండా వారిని వ్యభిచార వృత్తిలోకి దింపాడన్న నేరారోపణలపై రెండుసార్లు జైలుపాలైన జెఫ్రీ ఎప్స్టీన్ 2019 ఆగస్టులో రెండోసారి జైలుకు వెళ్ళాక జైలులోనే అనుమానాస్పదంగా మరణించాడు. డోనాల్డ్ ట్రంప్ తనకు ప్రియమిత్రుడుని, ఆయన గురించి పూర్తి వివరాలు తనకు తెలుసుననీ ఎప్స్టీన్ తరచు చెప్పుకునేవాడు. ఎప్స్టీన్ జైలులో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పినప్పటికీ, అతడి మరణం ఇప్పటికీ మిస్టరీగా మారింది. ఎప్స్టీన్‌కు, ట్రంప్‌కు మధ్య ప్రపంచానికి తెలియని ఏదో విడదీయరాని అనుబంధం ఉందన సందేహాలు అందరినీ పీడిస్తున్నాయి. ట్రంప్‌తో వ్యవహారం చెడిన తర్వాత ఎలాన్‌మస్క్ 'ద అమెరికన్ పార్టీ' ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. దానిని జూన్‌నెలలోనే రిజిస్టర్ చేసుకున్నట్టు కూడా చెప్పారు. ఇదిలా ఉండగా, అటార్నీ జనరల్ పామ్ బాండీకి, ఎఫ్‌బిఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బాంగినో మధ్య ఎప్స్టీన్ ఫైల్స్‌పై జరుగుతున్న వివాదంలో డోనాల్డ్ ట్రంప్ తన అటార్నీ జనరల్‌ను వెనకేసు కొచ్చారు. "ఆయన ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వహించారు, ఫెంటాస్టిక్ జాబ్ చేశారు, అందువల్ల అందరూ ఆయన వెనక నిలబడి మద్దతు ఇవ్వాలి, అదేవిధంగా కాష్ పటేల్ నాయకత్వంలో ఉన్న ఎఫ్‌బిఐ కూడా ఇక ఎప్స్టీన్ ఫైల్స్‌పై దృష్టి సారించకుండా, 2020 అధ్యక్షె ఎన్నికల్లో ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలకు సంబంధించిన దర్యాప్తుపై పూర్తి దృష్టి కేంద్రీరించాలని ట్రంప్ తన సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. దీంతో ట్రంప్ ఇప్పుడు విమర్శల్లో చిక్కుకున్నారు. సరిగ్గా ఇదే సమయంలో వచ్చే ఏడాది ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ ఎప్స్టీన్ ఫైల్స్ తగాదాలో జోక్యం చేసుకుని రంగంలోకి దిగుతారంటున్నారు.

## ఆసిఫ్ మునీర్‌కు అధ్యక్షపదవి అంటూ విదేశీశక్తుల దుష్ప్రచారం : షరీఫ్, నక్వీ ఖండన

**ఇస్లామాబాద్:**పాకిస్థాన్‌లో ఈ మధ్య బాగా అందరినోళ్ళల్లో నానుతున్న సర్వసేనాధిపతి, చీఫ్ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిఫ్ మునీర్‌కు అధ్యక్ష పదవి కట్టబెడతారన్న వార్తలను ఆ దేశ ప్రధాని షెహబాస్ షరీఫ్ తోసిపుచ్చారు. అసలు మునీర్‌కు దేశాధ్యక్షపదవిపై ఆసక్తీ లేదని షరీఫ్ చెప్పారు. మునీర్–జర్దారీ ఇద్దరు విశ్వసనీయ వాతావరణంలో పాకిస్థాన్‌ను బలిష్ఠంగా తీర్చిదిద్దేందుకు కలిసి పని చేస్తున్నారనీ, అందువల్ల పదవీ మార్పులు జరిగే అవకాశాలు లేవన్నారు.ఆ తర్వాతపాకిస్థాన్ హోం శాఖామంత్రి ఇదే తరహాలో ఎక్స్ వేదికగాఒక ప్రకటన చేస్తూ విదేశీ శత్రుమూకలతో కలిసి కొందరు ఇలాంటి ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇలాంటి వార్తలను ఎవరు ప్రచారం చేస్తున్నారో తనకు బాగా తెలుసునన్నారు. ఐతే ఆ పేరు మాత్రం చెప్పలేదు. అవన్నీ వదంతులేననీ, ఆధార రహితంగా చేసే బూటకపు ప్రచారాలేననీ షరీఫ్ కొట్టిపారేశారు. ఆసిఫ్ అలీ జర్దారీని అధ్యక్ష పదవి నుండి తొలగించి ఆ స్థానంలో మునీర్‌ను కూర్చోబెడతారని ఇటీవల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అలాంటి చర్చలు జరగలేదు, ఆ ఆలోచనలు రాలేదు, అలాంటి ప్రణాళిక లేదు, ఆ ఉద్దేశం లేదన్నారు. సైన్యంతో జర్దారీ చాలా గౌరవప్రదమైన సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. కాగా జనరల్ జియావుల్ హక్ 1977లో కుట్ర ద్వారా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్న వార్షికోత్సవ వేళ సోషల్ మీడియాలో మునీర్‌కు అధ్యక్ష పదవీ బాధ్యతలపై జోరుగా ప్రచారం సాగుతోంది.

## ఉజ్జయిని బోనాలు
(మొదటి పేజీ తరువాయి)

అలంకరించారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. సిఎంకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. సిఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు అందించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్, సిఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని సిఎం రేవంత్ రెడ్డి ప్రార్థించారు.

**తొలిబోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు..** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఘనంగా ప్రారంభమయ్యే సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామునే మహా మంగళ హారతి ఇచ్చారు. అమ్మవారిని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు దర్శించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలునిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బోనాల ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు అనుమతించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర వైభోపేతంగా జరిగింది. దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా 6వరుసలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశా రు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా పోటెత్తుతున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. సాయంత్రం ఫలహారబండ్ల ఊరేగింపు అట్టహాసంగా ఊరేగింపులు జరిపారు. ఆలయ పరిసరాల్లో నగర పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. అమ్మవారిని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మా రావు లు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించారు. మాజీమంత్రి మల్లారెడ్డి, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**బోనాలతో బారులు తీరిన ఆడపడుచులు..**
పెద్ద సంఖ్యలో ఆడపడుచులు అమ్మ వారికి బోనం సమర్పించేందుకు బారులు తీరారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు 6 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివసత్తులకు ప్రత్యేకంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు రీ రోడ్ బాట షోరూం నుంచి ప్రవేశం కల్పించారు. ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా జరిపారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అలరించేందుకు ప్రత్యేక వేదికల ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో కార్యక్రమాలతో ఉర్రతలూగించారు.

**2,500. మంది పోలీసులు బందోబస్తు**
సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో సుమారు 2,500. మంది లాఅండ్ ఆర్డర్, షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ప్రత్యేకంగా 200 సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. దేవాలయానికి భక్తులు వెళ్లేందుకు వివిధ మార్గాలలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. జిహెచ్‌ఎంసి అధికారులు 24 గంటలు పారిశుద్ధ్య నిర్వహించారు. మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశా రు. జలమండలి ద్వారా వాటర్‌బాటిళ్లు, మంచినీటి ప్యాకె ట్లు అందచేశారు. మహంకాళి పోలీస్ స్టేషన్ సమీపంలో డిఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా శిబిరంలో వైద్యులను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్‌లను సిద్ధంగా పెట్టారు.

## ఆగయా భాయ్
(మొదటి పేజీ తరువాయి)

లొకేషన్‌కి వచ్చారు. వాళ్లందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఐటి ఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటల్ టెక్నీషియన్లు ఉన్నారు. ఓ వ్యక్తి గంజాయి కొనేందుకు భార్య, నాలుగేళ్ల కుమారుడితో సహా వచ్చాడు. 14 మందికి నిర్వహించిన యూరిన్ టెస్ట్‌లో డ్రగ్ పాజిటివ్ అని తేలింది. 14 మందిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించారు. నిందితుడు సందీప్ మహారాష్ట్ర నుంచి గంజాయి తెప్పిస్తున్నట్లు గుర్తించారు. 50 గ్రాముల చొప్పున 100 గంజాయి ప్యాకట్లు తెప్పిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఒక్కో ప్యాకెట్‌ని రూ.3 వేలకు సందీప్ విక్రయిస్తున్నాడు. సందీప్ వద్ద 100 మందికి పైగా కస్టమర్లు ఉన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది.

## భ్రష్టు పట్టింది
(మొదటి పేజీ తరువాయి)

మైదానాల వైపు మళ్లించే విధంగా ఆలోచనలు చేసి ఆచరణలకు శ్రీకారం చుట్టాము.స్పోర్ట్స్ సిటీ వైపు అడుగులు వేస్తున్నాము.

**ప్రశ్న: క్రీడాభివృద్ధికి నిధుల కొరత ఏమైనా ఉందా**

**చైర్మన్:** ప్రజాపాలన ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్లో రూ.364 కోట్లు, రెండవ బడ్జెట్లో మరో రూ. 100 కోట్లు పెంచారు. మొత్తం రూ. 464 కోట్లు బడ్జెట్ కేటాయించి క్రీడారంగానికి నూతన ఉత్తేజం కలిగించాము. నిధుల కొరత లేదు.

**ప్రశ్న: ఇప్పటి వరకు ఏఏ క్రీడా పోటీలు నిర్వహించారు**

**చైర్మన్:** క్రీడాకారుల్లో ఉత్సాహం కలిగించడానికి ఏడాది కాలంలోనే అనేక జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు హైదరాబాద్ వేదికగా మార్చము. ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్2024, ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్, 57 సంవత్సరాల అనంతరం హైదరాబాదులో సంతోష్ ట్రోఫీ నిర్వహించి హైదరాబాదులో తెలంగాణలో ఫుట్ బాల్ క్రీడకు పునర్ వైభవం తీసుకొచ్చాము. జాతీయ మహిళా సబ్ జూనియర్ హాకీ చాంపియన్ షిప్ 2024 ఎనిమిది దేశాలు పాల్గొన్న ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్‌కు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ఆతిథ్యం ఇచ్చింది. అదేవిధంగా 49వ సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్ బాల్ ఛాంపియన్షిప్ అండర్ 17 చెస్ పోటీలను నిర్వహణ, 4వ కియో కరాటే ఛాంపియన్షిప్ 20 25, 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ ఛాంపియన్షిప్ హుస్సేన్ సాగర్ వద్ద, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఎలైట్ నేషనల్ ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్షిప్, గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 24వ జూనియర్ వుషూ ఛాంపియన్ షిప్ బ్రహ్మాండంగా నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా మొన్న జరిగిన మిస్ వరల్డ్ అందాల పోటీల సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి అందరి ప్రశంసలు అందుకోవడం జరిగింది.

**ప్రశ్న:ముఖ్యంగా గ్రామీణ ప్రాంతా యువకు–లకు ఎలాంటి ఉత్సాహాన్ని కల్పిస్తున్నారు.**

**చైర్మన్:** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి బలం చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సిఎం కప్ 2024 నిర్వహించాము. అందులో పాల్గొన్న వివిధ గ్రామీణ క్రీడాకారుల సమాచారాన్ని నిక్షిప్తం చేశాము.. 33 జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సిఎం కప్ టార్చ్ రిలే యువ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపింది. అదే స్ఫూర్తితో సిఎం కప్ 2025 ఆగస్టు నెలలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాము.

**ప్రశ్న: రాష్ట్రంలో క్రీడా స్టేడియాల పరిస్థితి ఎలా ఉంది..కొత్త స్టేడియాలు కడతారా..**

**చైర్మన్:**2002 జాతీయ క్రీడల సందర్భంగా హైదరాబాద్ నగరంలో నిర్మించిన వివిధ అంతర్జాతీయ స్టేడియాలను మరో 20 ఏళ్లకు సరిపడే విధంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో అథ్లెటిక్ స్టేడియంలో రూ.14 కోట్లు ఇండోర్ స్టేడియం లో రూ. 11 కోట్లతో వివిధ ఆధునీకరణ పనులు చేపట్టామని, త్వరలో నగరంలోని అన్ని స్టేడియాల్లో వివిధ ఆధునీకరణ పనులు చేపడుతాము. వివిధ నియోజకవర్గాల్లో స్టేడియాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, రాబోయే మూడు సంవత్సరాల్లో జిల్లాలలో స్టేడియాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు క్రీడ మైదానాలు నిర్మించడమే కాకుండా వాటిని నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము.

**ప్రశ్న:భవిష్యత్తుల్లో క్రీడాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.**

**చైర్మన్:** హకీంపేట,అదిలాబాద్, కరీంనగర్‌లో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో సీట్లకు తీవ్రమైన పోటీ ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ప్రతి లోకసభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయాలనిఆలోచన ఉంది. అదేవిధంగా నూతన క్రీడా విధానం 2025 ప్రకారం రాష్ట్రంలో యంగ్ ఇండి యా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోరట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. స్పోర్ట్స్‌స్కూల్‌లను యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ క్రీడలకు విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా చర్యలు తీసుకోబోతున్నాం.

## బ్రిటన్‌లో ప్రదర్శనలు
(మొదటి పేజీ తరువాయి)

రాయల్ ఎయిర్‌ఫోర్స్ స్థావరంలోకి కొంతమంది ప్రవేశించి వైమానిక దళ విమానాలపై ఎర్రరంగుపూసి వాటిని ధ్వంసం చేశారన్న ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో పాలస్తినా అనుకూలవాదులే ఈ చర్యకు పాల్పడ్డారని నిర్ధారించారు. పాలస్తినా అనుకూల గ్రూపును ఉగ్రవాద సంస్థగా గుర్తించి ఉత్తర్వుచేశారు. దానిని నిషేధించారు.కోర్టు కూడా ఈ కేసు విచారణ సందర్భంగా ఇచ్చిన ఒక తీర్పులో ఈ గ్రూపునకు మద్దతు ఇచ్చినా, సభ్యత్వం తీసుకున్నాగానీ 14 సంవత్సరాలు జైలుశిక్షకు గురవుతారని తెలిపింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ, పాలస్తినా అనుకూల ప్రదర్శనలను నిషేధించినందుకు నిరసనగా లండన్‌లో తాజా గా ప్రదర్శన జరిగింది. లండన్‌లో గడచిన వారం రోజులుగా పాలస్తినా అనుకూల గ్రూపును సమర్థిస్తూ ప్రదర్శనలు జరుగుతున్నా యి. ఇంతకుముందుకూడా 29 మంది ప్రదర్శకులను లండన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. పాలస్తినా నుండి ఇజ్రాయెల్ వైదొలగాలనీ, సామూహిక హత్యాకాండను ఆపేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు.

## లోగో ఆవిష్కరణ
(మొదటి పేజీ తరువాయి)

మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఆదివారం సిపిఐ హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ. నర్సింహా, కలవేణి శంకర్, శ్రామిక మహిళా ఫోరం జాతీయ నాయకురాలు ప్రేమ్ పావని, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఈ. ఉమామహేష్ ,సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్ రెడ్డి, జె.లక్ష్మీ , డిహెచ్‌పిఎస్ అధ్యక్షులు ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనీల్ కుమార్, ఎఐటియుసి సీనియర్ నేత రత్నాకర్ రావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చాడవెంకటరెడ్డి మాట్లాడుతూ మహాసభలను జయప్రదం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. మేడ్చల్ జిల్లాలో పార్టీ వేలాది ఎకరాల్లో లక్షలాది గుడిసెలు వేసి పేదలకు భూములు పంచిన చరిత్ర సిపిఐది అన్నారు. ప్రజల కోసం నిత్యం పని చేసే పార్టీ సిపిఐ అని విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రానున్న రోజులో మహాసభల అనంతరం ప్రభుత్వ భూములను పేదలకు పంచడానికి ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చ కిషన్, స్వామి,హరినాథ్,కృష్ణ,శ్రీనివాస్, సత్య ప్రసాద్, జిల్లా నాయకులు ,ప్రమీల, మహాలక్ష్మి , గిరిజ, యాదయ్య, బాబు, జంగయ్య, బాపూరాజు, అజీజ్,పరమేశ్వర్, ఐలయ్య, రమేష్, వెంకటేష్,మనోహర చారీ తదితరులు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు కన్నుమూత
(మొదటి పేజీ తరువాయి)

బొబ్బిలి రాజా, ఇడియట్ , సంతోషం, యమలీల, యముడికి మొగుడు, బొమ్మరిల్లు, జంబలకిడి పంబ, అతడు, ఆర్‌జీవి సర్కార్ వంటి సినిమాల్లో నటించిన కోట తన నటనకు గాను పలు సినిమాలకు నంది అవార్డు అందుకున్నారు. ప్రతి ఘటన, గాయం, తీర్పు, లిటిల్ సోల్జర్స్, గణేష్, చిన్న, పెళ్ళైన కొత్తలో, ఆ నలుగురు, పృథ్వీ నారాయణ వంటి చిత్రాలలో నటనకు తొమ్మిది సార్లు నంది పురస్కారం అందుకున్నారు. 2012లో వచ్చిన వందే జగద్గురుమ్ సినిమాకు సైమా అవార్డు అందుకున్నారు. సూపర్ స్టార్ క్రిష్ణ, చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ నుంచి మొదలుకొని వరుణ్ సందేశ్, సాయి ధరమ్ తేజ్ వరకు కోట శ్రీనివాసరావు నాలుగు తరాల నటీనటులతో కలిసి నటించారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులమీదుగా కోట శ్రీనివాస రావు పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

**ఎమ్మెల్యేగా...**బ్యాంకులో ఉద్యోగిగా ఉన్న కోట శ్రీనివాసరావు రంగస్థలంలో నాటకాలు వేస్తూ వెండితెరపై వెలిగిపోయారు. తెరపై ఫుల్ బిజీగా ఉన్న సమయంలోనే కోట శ్రీనివాసరావు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1999–2004 వరకు తూర్పు విజయవాడ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా సేవలందించారు. భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు పని చేశారు. సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ప్రముఖ నటుడు కోట శ్రీనివాస రావు అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్ లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది. ఇందులో అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు చేశారు.

**'కోట'కు సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు సంతాపాలు...** తెలుగు చలనచిత్ర నటుడు కోట శ్రీనివాస రావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. చలన చిత్ర పరిశ్రమకు ఆయన లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. కోట శ్రీనివాస్‌రావు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పోషించిన విభిన్న పాత్రలతో తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**విభిన్నమైన పాత్రలతో ఆలరించిన మహా నటుడు కోట శ్రీనివాస రావు : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**
విభిన్నమైన పాత్రలతో వైవిధ్యభరిత నటనతో సినిమా అభిమానులను అలరించిన ప్రముఖ నటులు పద్మశ్రీ కోట శ్రీనివాస రావు మరణం విచారకరమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 4 దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన కళా సేవ, ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విజయవాడ ఎంఎల్‌ఎ కోట శ్రీనివాసరావు ప్రజాసేవలోనూ తనదైన ముద్రను వేశారన్నారు. కోట శ్రీనివాసరావు మరణం పట్ల నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రగాఢ సంతాపం ప్రకటించారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కోట శ్రీనివాసరావు మృతిపట్ల పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోట శ్రీనివాస్ రావు మరణం బాధాకరమని వ్యవసాయ, రైతు కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు. విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు.

**వైవిధ్యమైన పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు : కూనంనేని సాంబశివరావు**
ప్రముఖ విలక్షణ నటుడు, మాజీ ఎంఎల్‌ఎ కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. కోటా శ్రీనివాసరావు చిత్ర పరిశ్రమలో అనేక వైవిద్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించారన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని కూనంనేనిసాంబశివరావు పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**కళామతల్లికి అంకితమైన కోటశ్రీనివాస రావు : డాక్టర్ కె.నారాయణ**
ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. . కళామతల్లికి అంకితమమై సేవలందించిన విలక్షణమైన వ్యక్తి కోట శ్రీనివాస రావు మరణం కళారంగానికి తీరని లోటు అన్నారు. ఆయన సహజ నటనను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని నారాయణ పేర్కొన్నారు. కోట శ్రీనివాస రావు మరణం పట్ల నారాయణ ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు

**కోట శ్రీనివాసరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**
ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కోట శ్రీనివాసరావు మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని , వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**సినీరంగం ఓగొప్ప నటున్ని కోల్పోయింది : కెసిఆర్**
ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంతాపం ప్రకటించారు. విభిన్న పాత్రలను పోషించి, ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్న విలక్షణ వెండితెర నటుడు కోటా శ్రీనివాసరావు అని కెసిఆర్ కొనియడారు. ఆయన మరణంతో సినీమా రంగం ఓ గొప్ప నటున్ని కోల్పోయిందని కెసిఆర్ విచారం వ్యక్తం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో రానున్న రెండు రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ :

రాష్ట్రంలో రాగల రెండురోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఆయా జిల్లాలకు అలెర్ట్ జారీ చేశామన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్క తేలికపాటి నుంచి మోస్తరు కురుస్తాయన్నారు. గంటకు 30 నుంచి 40 బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు.

# ప్రజా సమస్యలు గాలికి

### కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బిజెపి ప్రభుత్వం

### భూపాలపల్లి జిల్లా సిపిఐ 5వ మహాసభలను ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలిందని, దేశంలో బిజెపి ప్రభుత్వం పేద వర్గాలకు న్యాయం చేయకుండా కార్పొరేట్ శక్తులకు, ఆదాని అంబానీలకు కొమ్ముకాసే విధానాలు అవలంబిస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రేగొండలో ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 5వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహా సభల సందర్భంగా శ్రీనివాసరావు అరుణ పతాకాన్ని ఎగురవేసి మహా సభలను ప్రారంభించారు. అనంతరం ఇటీవలే మరణించిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి సంతాపాన్ని తెలిపారు. ప్రతినిధుల సభకు కొరిమి సుగుణ, సొత్కు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ జిల్లా నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహా సభల సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చే 12 సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశానని అన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీదని, స్వతంత్ర ఉద్యమంలో బిజెపి ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యమని స్వతంత్ర ఉద్యమంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎక్కడుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశంలో బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ కంపెనీలకు బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో సిపిఐ మద్దతు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే గద్దె దించే శక్తి కమ్యూనిస్టులకే ఉందని ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాల అవలంబిస్తే బిఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. పాలపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని జిల్లా అభివృద్ధికి తవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి పాటుపడే విధంగా ఉద్యమాలు రూపొందించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని కోరారు. పార్టీతోపాటు ప్రజాసంఘాలను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ళ శాంతి కుమార్ మాతంగి రామచందర్, కుడుదుల వెంకటేష్, పైళ్ల క్రాంతి కుమార్, పెరుమాండ్ల రాజయ్య, జి.సుధాకర్ రెడ్డి, గుంటి చంద్రమౌళి, మండల కార్యదర్శి పెంట రవి,నూకల భూలక్ష్మి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### నేడు బహిరంగ సభ, ర్యాలీ

సిపిఐ జిల్లా 5వ మహాసభల్లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నిర్వహించే ర్యాలీ, భారీ బహిరంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావులు హాజరు కానున్నారని తెలిపారు. కావున జిల్లాలోని పార్టీ శ్రేణులు ప్రజా సంఘాలు ఏఐటీయూసీ నాయకులు, మేధావులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని రాజ్ కుమార్ విజ్ఞప్తి చేసారు.

## ఎప్పటికైనా శాంతి, సామరస్యతలే గెలుస్తాయి



మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎప్పటికైనా సమాజంలో శాంతి, సామరస్యతే గెలుస్తాయని, 'లాంగ్ లీవ్ గాంధీ' అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. 'గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల' సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో 'మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు స్వదేశీ మేళ'లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలకు మంత్రి సీతక్క పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడ అభినందనీయమన్నారు. 1500 గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి, వారి త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని దేశానికి, సమాజానికి గుర్తు చేస్తున్నారన్నారు. గాంధీ బాటలోనే అందరూ నడిచి నియంతలను, దుర్మార్గులను తరిమి కొట్టామని చెప్పారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్తున్నామని సీతక్క చెప్పారు.

## మహిళా సంఘాలకు.... సకాలంలో వడ్డీ లేని రుణాల చెల్లింపు



### ఈనెల 18 వరకూ నియోజకవర్గాల వారీగా చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రూ.344 కోట్ల వడ్డీ నిధులను ఈనెల 18లోపు అన్ని మహిళా సంఘాల ఖాతాలలో జమ చేయనున్నారు. వడ్డీ రాయితీ చెక్కులతో పాటు ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులను పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం మహిళలకు ఆర్థిక భద్రతను కల్పించే దిశగా మరో కీలక అడుగుగా నిలవనుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కాగా 2019 నుంచి 2023 సంవత్సర మధ్యకాలంలో రూ.3,075 కోట్లకు పైగా వడ్డీ రాయితీలు బకాయిలుగా ఉన్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశనలో, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో పథకం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. బ్యాంకుల ద్వారా మహిళలు తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత రూ.518. 69 కోట్లు మహిళా సంఘాలకు వడ్డీల రూపంలో ప్రభుత్వం చెల్లించగా, ప్రస్తుతం తాజాగా మరో రూ.344.35 కోట్లను విడుదల చేసింది. దీంతో మహిళా సంఘాలకు మొత్తం రూ.862.04 కోట్లు విడుదల చేసింది. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా అన్ని నియోజకవర్గాల్లో బ్యాం కుల ద్వారా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు చెక్కుల రూపంలో వడ్డీలను ప్రభుత్వం చెల్లించనుంది. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సకాలంలో నిధులు జమవుతుండటంతో మహిళా సంఘాల్లో విశ్వాసం, ఉత్సాహం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వ చిత్తశుద్ధికి ప్రతీక అని సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఏటా రూ.25 వేల కోట్లకు తగ్గకుండా రుణాలను మహిళా సంఘాలకు సమకూర్చుతున్నామని చెప్పారు. మహిళల సంఘాలకు వడ్డీల భారం లేకుండా, వారి తరఫున ప్రభుత్వమే వడ్డీలను చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రజల చైతన్యంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

### మేధావుల సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్యం లాంటి మౌలిక రంగాలు నాశనమయ్యాయని, ప్రజల రాజకీయ చైతన్యంతో, రాజకీయ పార్టీల స్వభావంలో మార్పుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడి సమగ్రాభివృద్ధి జరుగుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. అప్పుల ఊబిలో తెలంగాణ ప్రభుత్వం కారణాలు పరిష్కారాలు అనే అంశంపై హనుమకొండ జిల్లా కేంద్రం హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి నాయకత్వం వహించిన కెసిఆర్ మేధావుల సూచనలను పట్టించుకున్న పాపాన పోలేదని, కెసిఆర్ ఎవరి మాట వినలేదని, నేటి పాలకులు మేధావుల సూచనలను విన్నప్పటి వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఆర్థిక శాస్త్రంలో విశ్లేషణలు, సూచనలు ఉంటాయని, రాజకీయ శాస్త్రంలో, రాజకీయాల్లో పరిష్కారాలుంటాయని అన్నారు. విలువలు, ప్రజల అభివృద్ధి లేని రంగాల్లో అభివృద్ధి జరగడం వల్ల సమగ్ర అభివృద్ధి జరగడం లేదని, గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్య, వ్యవసాయ, ఉపాధి రంగాలు కుదేలయ్యాయని, ఆరోగ్యశ్రీ వల్ల ప్రభుత్వ ఆసుపత్రులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల ప్రభుత్వ విద్య నాశనమయిందని అన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ అన్ని రకాలుగా ఆగమైన వర్గాలకు న్యాయం జరిగే కొరకు ఏర్పడిన తెలంగాణలో దొరల పాలనలో మరింత ఆగమైందని, మానవాభివృద్ధితో కూడిన ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచించి అమలుపరచాలని, ఆర్థిక రంగాన్ని బాగుపరచే నూతన అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో మేధావులను, ఆర్థిక నిపుణులను, ఉద్యమకారులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడడానికి ప్రజల నుండి వారి విలువైన సూచనలను తీసుకోవడానికి రాష్ట్రమంతా సదస్సులను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్లు డి నర్సింహారెడ్డి, ఆర్ వి రమణమూర్తి, సదానందం, ఫోరమ్ ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్ మోహన్ రావు లు మాట్లాడుతూ అప్పులు చేయని దేశం ఉండదని, అభివృద్ధి నమూనాలో అప్పులు సహజమని, వారసత్వంగా వచ్చిన అప్పుల నమూనాలో భాగంగానే కొత్తగా ఏర్పడిన తెలంగాణలో నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ఆగమైందని అన్నారు. ఆర్థిక సహాయం అవసరం లేని పెద్ద రైతులకు పంట సహాయం చేయడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ అభివృద్ధిని, ఉన్నత విద్య అభివృద్ధిని పట్టించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ సదస్సు అతిథులకు వీరమల్ల బాబురావు స్వాగతం పలుకగా మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, సుశీల, చాపర్తి కుమార్ గాడ్గే, డాక్టర్ ప్రవీణ్ కుమార్, బుసిగొండ ఓంకార్, వల్లాల జగన్ గౌడ్, సంఘాని మల్లేశ్వర్, కొంగ వీరాస్వామి, మేకల కేదారి యాదవ్, నలిగింటి చంద్రమౌళి, లంకా పాపిరెడ్డి, బొమ్మినేని పాపిరెడ్డి, పల్లపు సమ్మయ్య, న్యాయవాదులు విలాసాగరం సురేందర్ గౌడ్, ఎగ్గడి సుందర్ రామ్, జన్ను పద్మ, బండి మొగిలి, జె జె స్వామి, వివిధ సంఘాల నాయకులు పెండ్లి అశోక్ బాబు, మంద వీరస్వామి, పరిశరాములు, తిరుపతి, బట్టి శ్యామ్ యాదవ్, దిడ్డి ధనలక్ష్మి , సద్గుణ, సురేఖ, స్వరూప, గోధుమల కుమారస్వామి, కొంగర జగన్, సాంబలక్ష్మి , సూరం నిరంజన్, కూరపాటి భార్గవి, సద్గుణ, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి 'కాక్‌టెయిల్స్' కలెక్షన్ వాచ్‌లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టైటాన్ రాగ నేతృత్వంలో మార్కెట్‌లోకి 'కాక్‌టెయిల్స్' కలెక్షన్ సరికొత్త లేడీస్ వాచ్‌లను ఆదివారం విడుదల చేసింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో టైటాన్ రాగ, మల్టీ బ్రాండ్ రిటైల్‌నేషనల్ సేల్స్ హెడ్ రాహుల్ పాండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి మహిళలు తమదైన ముద్ర వేయడానికి ఈ వాచ్‌లను విడుదల చేశామని తెలిపారు. రాగ భాగస్వామి అయిన కమల్ వాచ్ కంపెనీ డైరెక్టర్ రాజేందర్ తోట్ల ప్రత్యేకంగా రూపొందించిన స్టేట్‌మెంట్ వాచ్‌ల ప్రత్యేక ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో థీమ్ ఇన్ఫ్లుయెన్సర్లు లక్ష్మి రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం

### సీనియర్ కాంగ్రెస్ నేత మురళి గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బిసిలకు రిజ్వేషన్‌లు అమలు చేసేందుకు కట్టుబడి ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుర్రం మురళి గౌడ్ అన్నారు. ప్రత్యేక ఆర్డినేన్స్ తీసుకొచ్చి, స్థానిక సంస్థలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు కేబినెట్ నిర్ణయించినందున మురళి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో బాణసంచా కల్చి హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మురళి గౌడ్ మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్న సిఎం రేవంత్ రెడ్డి, కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు రిజర్వేషన్‌లు కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తుందని విమర్శించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా కులగణనను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరు శాతం సామాజిక న్యాయం అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి రమేష్, వినోద్, మహ్మద్ గౌస్, మహ్మద్ ఖాదర్, వెంకట్, చంద్రమౌళి పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోని వెజిటేబుల్ మార్కెట్ హమాలీ యూనియన్ (ఎఐటియూసి) ఆధ్వర్యంలో నిర్వహించిన మహంకాళి బోనాల ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మ, హమాలీ యూనియన్ నాయకులు..

## బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రాణాలు



### విందు ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ బంజారాహిల్స్‌లోని తన అధికారిక నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండ సురేఖ, వాకిటి శ్రీధర్, జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎంపిలు రఘునందన్ రావు, అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు కె.కేశవ్‌రావు, వి.హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు మహ్మ ద్ హజరుద్దీన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ సందర్భంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులను కలిశారు. మంత్రి మాతృమూర్తిని కలిసి, బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

# 'క్యూన్యూస్' కార్యాలయంపై ఎమ్మెల్సీ కవిత అనుచరుల దాడి

### గాల్లోకి గన్‌మెన్ ఐదు రౌండ్ల కాల్పులు

### మల్లన్న చేతికి స్వల్ప గాయాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు చెందిన మేడ్చల్ జిల్లా మేడిపల్లిలోని క్యూన్యూస్ కార్యాలయంపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కార్యాలయంలోని ఫర్నీచర్, కంప్యూటర్లను ధ్వంసం చేసారు. ఈ దాడిలో తీన్మార్ మల్లన్న చేతికి స్వల్ప గాయాలు కాగా ఆయననను రక్షించే క్రమంలో దాడికి పాల్పడిన వారిని అదుపు చేసేందుకు ఆయన గన్‌మెన్‌లు గాల్లో ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై ఆమె చేస్తున్న బిసి ఉద్యమాన్ని మల్లన్న తప్పు పడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసారన్న ఆగ్రహంతో బిఆర్ఎస్ కార్యకర్తలు, జాగృతి సంస్థకు చెందిన ఆమె అనుచరులు ఈ దాడికి పాల్పడ్డారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేల్చిచెప్పారు. క్యూన్యూస్ కార్యాలయంలో మల్లన్న ఉన్న సమయంలో ఒక్కసారిగా ఎమ్మెల్సీ కవితకు బేషరతుగా మల్లన్న క్షమాపణ చెప్పాలంటూ కార్యాలయంపై పెద్ద సంఖ్యలో చొచ్చుకొని వచ్చి ఆమె అనుచరులు ఫర్నీచరును ధ్వంసం చేస్తూ అక్కడి సిబ్బందిపైనా దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో వారిని క్యూన్యూస్ సిబ్బంది సైతం అడ్డుకోవటంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో బయటకు వచ్చిన మల్లన్న చేతికి స్వల్ప గాయాలయ్యాయి. మల్లన్న గన్‌మెన్‌లు దాడికి వచ్చిన వారిని వెళ్లి పొమ్మని ఎంత నచ్చచెప్పినా వినకుండా దాడులను తీవ్రతరం చేస్తుండటం, పరిస్థితి అదుపు తప్పుతుండటంతో చేసేది లేక గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో దాడికి వచ్చిన జాగృతి కార్యకర్త సాయికి బుల్లెట్ గాయాలవటంతో అతడిని రామ్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని దాడికి పాల్పడిన వారిలో కొందరిని అదుపులో తీసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని మల్కాజిగిరి డిసిపి పద్మజ తెలిపారు. అనంతరం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఘటన జరిగిన క్యూన్యూస్ కార్యాలయాన్ని స్వయంగా పరిశీలించి మీడియాతో



మాట్లాడుతూ గన్‌మెన్‌ల వల్ల కానీ, గాల్లోకి కాల్పులు జరపటం వల్ల కానీ ఎవరికీ గాయాలు కలుగలేదని, ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో కార్యాలయ అద్దాలు పగిలిపోవటం, కొందరికి గాజు పెంకులు గుచ్చుకొని రక్తపు గాయాలయ్యాయని, దాడి చేసిన వారిని జాగృతి కార్యకర్తలను అదుపులోకి తీసుకొని సిసి ఫుటేజి దృశ్యాల ఆధారంగా విచారణ జరుపుతామని తెలిపారు.

**హత్యాయత్నం చేసేందుకు వస్తారా, తేల్చుకొందాం అన్న మల్లన్న**

దాడి సంఘటనపై తీన్మార్ మల్లన్న జాగృతి కార్యకర్తలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు.. కవిత ఫ్రస్టేషన్‌తోనే మాపై హతమార్చటానికే గూండాలను పంపించిందని ఆరోపించారు. ఇలాంటి దాడులతో భయపడేది లేదని, ఇక తాడో పేడో తేల్చుకుంటామన్నారు.

### కవితకు మల్లన్న క్షమాపణ చెప్పాలి

మధుసూదనా చారి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ శాసనమండలి ప్రధాన ప్రతిపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడటం మన సంస్కృతి అని, వ్యక్తిగత దూషణలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు రాజకీయాల్లో చోటు లేదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న వెంటనే కవితకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### కవితపై తీన్మార్ వ్యాఖ్యలు గర్హనీయం

**మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం: టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని, అదే సమయంలో మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని, చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్‌మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి బిల్లు, రిజర్వేషన్లు అన్ని కాంగ్రెస్ కృషి ఫలితమేనని, బిసి రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ది పొందాలని చూడడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు.

### ఎమ్మెల్సీ మల్లన్నపై కవిత ఫిర్యాదు



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని, జాగృతి జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత కార్యకర్తలపైన కాల్పులకు పాల్పడిన మల్లన్న గన్‌మెన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న మాట్లాడిన తీరు పట్ల తమ కార్యకర్తలకు కోసం వచ్చి నిరసన వ్యక్తం చేశారని, ఇంత మాత్రానికే కాల్పులు చేసి చంపేస్తారా? అని ప్రశ్నించారు. ఒక ఆడబిడ్డ ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారని, ఇక తాను ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, కించపర్చేలా చేసిన వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకునేలా 'కమిటీ ఆన్ ఎథిక్స్'కు రెఫర్ చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర ఐజి (ఎల్ అండ్‌ఆర్) రమణకుమార్‌ను డిజిపి కార్యాలయంలో కలిసి కవిత ఫిర్యాదు చేశారు.

# సాహితీ విహారి

# ఎర్రజెండా కవి ఏటుకూరి



ఎస్‌వి సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, పొ.శ్రీ.
తెలుగు విశ్వవిద్యాలయం

'ఎర్రజెండేరా తమ్ముడ
ఎర్రజెండేరా మనది
ఎర్రజెండేరా తమ్ముడ !
ఎర్రజెండేరా
'ఎర్రజెండరా త్యాగాల కందరా'.....
'ఎర్రబాటరా ఇదే ఎర్రపాటరా
శ్రమవీరుల రక్తంతో ఎరుపెక్కిన బాటరా'

అభ్యుదయ సాహిత్యోద్యమంలోకి, ప్రజానాట్యమండలి సాంస్కృతికోద్యమంలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తున్న మా తరాన్ని అపారంగా ప్రభావితం చేసిన ఉద్యమ గీతాలవి. ఈ పాటలు రచించిన ఉద్యమకవి ఏటుకూరి ప్రసాద్. ఎర్రజెండా నీడలో ఎర్రపాటలు పాడుతూ, ఎర్ర బాటపై నడుస్తున్న ఉద్యమబాటసారి ఆయన. కేవలం కవి మాత్రమే కాదు.. ఆధునిక తెలుగు సాహిత్యంలో నిర్విరామ కృషిని కొనసాగిస్తున్న మౌనకృషీవలుడు కూడా. పరిచయమైన ప్రతి వ్యక్తినీ ప్రభావితం చేసే స్నేహశీలి. ఎంతో మంది యువ పరిశోధకులకు అప్రకటిత మార్గదర్శకుడు. తమ ఇంటి గ్రంథాలయం నుండి విలువైన, అరుదైన గ్రంథాలను పరిశోధకులకు ఇవ్వడమే కాక, తగిన సూచనలు, సలహాలనిస్తూ ఉత్సాహపరిచే సౌజన్యశీలి ప్రసాద్. 1970వ దశకంలో హైదరాబాద్ నగరంలో ఒకవైపు 'యువభారతి' నెల నెలా కార్యక్రమాలతో యువ సాహితీవేత్తల్ని సంప్రదాయ సాహిత్యం వైపు ఆకర్షిస్తూ వుండేది. మరోవైపు విప్లవ సాహిత్య ఉధృతి యువతరంపై బలమైన ప్రభావం వేస్తూ ఉండేది. అలాంటి పూర్వరంగంలో అభ్యుదయ సాహిత్యోద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇటువైపున రచయితల్ని ఆకర్షించి నిలపడం, ముందుకు నడిపించడం కత్తిమీద సాము. ఈ బాధ్యత నిర్వహించిన రథసారథులు రాంభట్ల, తుమ్మల, గజ్జల మల్లారెడ్డిలు కాగా అందులో ప్రసాద్ పాత్ర విశిష్టమైనది. అభ్యుదయ సాహిత్యోద్యమ విస్తృతికి ఉపయోగపడింది. జాతీయ స్థాయిలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఏర్పడిన 1936వ సంవత్సరం జులై 19న గుంటూరులోని అరండల్‌పేటలో వజ్రమ్మ, కోటయ్య దంపతులకు పుట్టిన రెండవ సంతానం ఆయన. గుంటూరులోని మాజేటి గురవయ్య హైస్కూల్‌లో ప్రసాద్ ప్రాథమిక విద్య పూర్తయింది. దేశభక్త కుటుంబంలో పుట్టడం, ఇంట్లో కాంగ్రెస్ రాజకీయ సమావేశాలు జరగడంతో బాల్యం నుండే ఆయనకు రాజకీయాల పట్ల అవగాహన ఏర్పడసాగింది. పెదనాన్న సీతారామయ్య ప్రభావం, వారి కుమారులు బలరామమూర్తి, కృష్ణమూర్తిల సాహచర్యం ప్రసాద్‌ని కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షించాయి. 1951లో గుంటూరులోని హిందూ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరగానే అఖిల భారత విద్యార్థి సమాఖ్య సభ్యులయ్యారు. అదే సంవత్సరం గుంటూరులో జరిగిన శాంతి సంఘం మహాసభలకు శ్రీశ్రీ మొదలైన సాహితీవేత్తలెందరో హాజరయ్యారు. విద్యార్థి సమాఖ్య పక్షాన శ్రీశ్రీకి ప్రసాద్ వలంటీర్‌గా వ్యవహరించారు. శ్రీశ్రీ పాటలు విని ఉత్తేజితులయ్యారు. తరువాతి కాలంలో హిందూ కాలేజీ తెలుగు అసోసియేషన్ కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. 'గుంటూరు వాణి' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేరి, ఆ పత్రికకు కొన్ని వ్యాసాలు రాశారు. వట్టికొండ విశాలాక్షి నడిపిన 'ప్రజావాణి' పత్రిక ఇయర్స్‌కు ప్రసాద్ కవితలు రాశారు. 1955లో ఆయన హిందూ కాలేజీలోనే బి.ఎ. కోర్సులో చేరారు. అప్పటి ఆంగ్ల అధ్యాపకులు అమరేంద్ర (చతుర్వేదుల నరసింహశాస్త్రి) ప్రతిరోజూ క్లాసు ముగిసే లోపు శ్రీశ్రీ కవితలు వినిపించేవారు. అమరేంద్ర ప్రోద్బలంతోనే ప్రసాద్ 1955లో అరసం సభ్యత్వం స్వీకరించారు. 1957లోనే విశాఖలో తమ సీనియర్లయిన కె. సత్యమూర్తి, సహవిద్యార్థులైన వకుళాభరణం రామకృష్ణ, ఆర్‌వి‌ఆర్‌లతో కలిసి 'ప్రగతి' అనే రాత పత్రికను వెలువరించారు. రాజకీయ తరగతులకు హాజరయ్యారు. 1958లో ఉదయపూర్‌లో జరిగిన అఖిలభారత విద్యార్థి సమాఖ్య జాతీయ మహాసభలకు ఆంధ్ర రాష్ట్ర ప్రతినిధుల నాయకుడిగా హాజరయ్యారు. సభా నిర్వహణలో అధ్యక్ష వర్గ సభ్యులుగా క్రియాశీలంగా పాల్గొన్నారు. సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

1960లో బి.ఎ.ఆనర్స్ పూర్తిచేసిన ప్రసాద్ గుంటూరు ఎ.సి. కళాశాలలో తెలుగు ట్యూటర్‌గా పనిచేస్తూనే ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ వారి 'యువజన' పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించి తర్వాత పార్టీ నిర్ణయం మేరకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. తాపీ ధర్మారావు వంటి సాహితీ ప్రముఖుల సాహచర్యం లభించింది. పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తూనే 1961వ సంవత్సరంలో హైదరాబాద్ పాత నగరంలోని 'అగర్‌వాల్ శిక్షా సమితి' వారి మల్టీపర్పస్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా చేరారు. 1970లో జూనియర్ లెక్చరర్‌గానూ, 1980లో డిగ్రీ అధ్యాపకులుగాను పదోన్నతిని పొందిన ప్రసాద్ 1994 జులై 31న ఎస్‌డిఎస్‌డిగ్రీ పిజి కళాశాలలో రీడర్‌గా పదవీ విరమణ పొందారు. 1970–73 మధ్య కా లంలో అరసం పునర్నిర్మాణ ప్రయత్నాల్లో ప్రసాద్ చురు గ్గా పాల్గొన్నారు. హిమాయత్‌నగర్‌లోని 'ఇస్కస్' కార్యాలయం మేడమీద ప్రతి ఆదివారం సాయంత్రం సాహితీ సమావేశాలు, సాహిత్య తరగతులు జరిగేవి. వీటి ద్వారా పలువురు యువ రచయితలు ఉద్యమానికి సన్నిహితులయ్యారు. హైదరాబాద్ నగర అభ్యుదయ రచయితల సం ఘ నిర్మాణంలోను, రాష్ట్ర 'అరసం' పునర్నిర్మాణంలోను ప్రముఖమైన పాత్రను నిర్వహించిన ప్రసాద్, 1973లో గుంటూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్. 'అరసం' రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1979లో కాకినాడలో జరిగిన రాష్ట్ర 'అరసం' మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, దాదాపు దశాబ్దకాలానికిపైగా సంస్థ విస్తృతికి విరామమెరుగక కృషి చేశారు. ఎందరో యువ కవు లు, రచయితలు అభ్యుదయ సాహిత్యోద్యమానికి సన్నిహితం కావడానికి ఏటుకూరి ప్రసాద్ చేసిన కృషి ఫలితంగా ఉద్యమం కొత్త రక్తాన్ని నింపుకుని, పురోగమిస్తున్నది. 1982 డిసెంబర్‌లో జయపూర్ (రాజస్థాన్)లోనూ, 1986 ఏప్రిల్‌లో లక్నో (ఉత్తరప్రదేశ్)లోనూ జరిగిన 'అఖిల భారత అభ్యుదయ రచయితల సమాఖ్య' జాతీయ మహాసభల్లో డా॥ ఏటుకూరి ప్రసాద్ సమాఖ్య జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 'తాపీ ధర్మారావు జీవితం రచనలు' అన్న అంశంపై ప్రామాణికమైన పరిశోధన చేసిన ప్రసాద్‌కి 1983లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. విషయ సేకరణలోనూ, విశ్లేషణలోనూ ఈ గ్రంథం నేటికీ పరిశోధకులకు ఒక దారి దీపంలా తోడ్పడుతున్నది. 2023 సెప్టెంబర్‌లో పున:ముద్రణ చేయబడింది. 1980–92 మధ్య కాలంలో 'అభ్యుదయ' మాస పత్రికకు సంపాదక బాధ్యతలు వహించిన ప్రసాద్ నవల, వాడుక భాష, విమర్శ, కవిత్వంపై విశేష సంచికలు వెలువరించారు. మక్సిం గోర్కీ, రోణంకి అప్పలస్వామిలపై ప్రత్యేక సంచికలు తెచ్చారు. 'అరసం' స్వర్ణోత్సవాల సందర్భంగా 'అభ్యుదయ' 50 ఏళ్ళ పత్రాల ప్రత్యేక సంచిక ప్రసాద్ పట్టుదలకు, నిబద్ధతకూ కొలమానంగా రూపొందింది. 1983లో శ్రీశ్రీ మరణానంతరం శ్రీశ్రీ స్మారక సంస్థను నెలకొల్పి, అరసం సహకారంతో ప్రసాద్ 'మాచిరాజు దేవీప్రసాద్ పారడీలు', 'సాహిత్యాభ్యుదయ ం', 'కొంపెల్ల జనార్ధనరావు జీవితంసాహిత్యం', 'శిష్ట్లా ఉమా మహేశ్వరరావు కవిత్వం సమాలోచన', 'తుమ్మల వెంకట్రామయ్య జీవితం సాహిత్యం', వై. విజయకుమార్ 'సాహిత్యం వాస్తవికత' మొదలైన అరుదైన గ్రంథాలను వెలువరించారు. ప్రసాద్ రూపొందించిన 'పొయిట్రీ వర్క్‌షాప్' అన్న గ్రంథం కేవలం భారతీయ సాహిత్యంలోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే ఒక అరుదైన రికార్డు. 1862–1962 (వంద సంవత్సరాల) మధ్యకాలంలో పు ట్టిన వందమందికి పైగా కవులు స్వదస్తూరితో రాసిన కవితలను సేకరించి, వెలువరించిన గొప్ప గ్రంథమిది. జాషు వా దస్తూరితో కవితను సేకరించడానికి ప్రసాద్ పడిన శ్రమ నాకు ప్రత్యక్షంగా తెలుసు. గురజాడ మొదలుకొని యాకూబ్‌దాకా సాహిత్య రంగంలో నిరంతర కృషిని కొనసాగిస్తున్న మొన్న, నిన్న, నేటితరం కవుల కవితలను సేకరించడంలో ప్రసాద్ ఆబ్జెక్టివిటీని ప్రదర్శించారు. సిద్ధాంత విభేదాలతో, భిన్నాభిప్రాయాలతో ప్రమేయం లేకుండా ఈ గ్రంథ రూపకల్పనను ఒక యజ్ఞంలా భావించి పూర్తిచేశారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కి ఎక్కవలసిన ఈ గ్రంథానికి లభించాల్సినంత గుర్తింపు లభించలేదనే చెప్పాలి. 2022 అక్టోబర్‌లో పున:ముద్రణ చేయబడింది. ప్రసాద్ నిర్విరామకృషికి గుర్తింపుగా 'విజయలక్ష్మి స్మారక పురస్కారం', 'తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం', 'అమరజీవి పులుపుల శివయ్య సాహితీ సత్కా రం', 'తుమ్మల సాహితీ పురస్కారం', 'తాపీ ధర్మారావు సాహితీ పురస్కారం', 'శ్రీశ్రీ సాహితీ పురస్కారం', 'విశాలాంధ్ర ప్రచురణాలయం వారి సత్కారం' మొదలైన ఎన్నో పురస్కారాలు, సన్మాన సత్కారాలు లభించాయి. 1960 దశకం చివరి నాటికి తెలుగు సాహిత్యరంగంలో 'వచన కవిత' విజృంభించి, గేయ కవిత్వం నిరాదరణకు గురవుతున్న రోజుల్లో సుబ్బారావు పాణిగ్రాహి, శివసాగర్, గద్దర్ తప్ప, తక్కిన కవులందరూ వచనాన్నే ఆశ్రయించిన **పూర్వరంగంలో 1968లోనే..**

**'ఎర్రజెండేరా తమ్ముడ ఎర్రజెండేరామనది**
**ఎర్రజెండేరా తమ్ముడ ! ఎర్రజెండేరా'**

అన్న పల్లవితో ప్రసాద్ రాసిన పాట దాదాపు అన్ని వామపక్ష రాజకీయ పార్టీలకు, ట్రేడ్ యూనియన్‌లకు, వ్యవసాయ కార్మిక సంఘాలకు, యువజన విద్యార్థి సంఘాలకు ప్రార్థనా గీతమయ్యింది. 1968 నుండి 1972 వరకు ఈ కవి రాసిన పాటల సంపుటిని ''ఎర్రజెండా'' పేరుతో ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య 1972లో ప్రచురించింది. ఈ పాటల సంపుటికి 'సంజాయిషీ' పేరుతో సుప్రసిద్ధ విమర్శకులు రాంభట్ల కృష్ణమూర్తి రాసిన విపులమైన పీఠిక ఆనాటి సాహిత్య వాతావరణానికి కావలసిన సైద్ధాంతిక దిక్సూచిలా నిలిచింది. తెలుగుపీఠికా సాహిత్యంలో అదొక విశిష్టమైన రచన. ఆ తరువాత 1975లో 'ఎర్రబాట', 1976లో 'పోరాటం' గీతికా సంపుటులు వెలువడి, వీరి పాటలు విశేష జనాదరణ పొందాయి. 2021 ఏప్రిల్‌లో 'జనం నుంచి... జనంలోకి' పాటల పుస్తకం వెలువరించారు. గత ఆరు దశాబ్దాలుగా తెలుగు నాట సంభవించిన పరిణామాలకూ, పెల్లుబికిన ప్రజాపోరాటాలకూ ఈ పాటలు అద్దం పడుతున్నాయి. పోరాటం ఈ పాటలకు పల్లవి. ఎర్రజెండా ఈ గీతాలకు ఊపిరి. వర్గ రహిత, వర్ణరహిత సమసమాజ నిర్మాణం ఈ పాటల లక్ష్యం. ఇందులో పీడిత తాడిత ప్రజల అనుభవాలు, ఆగ్రహాలు ఉన్నాయి. ఉద్యమ చైతన్యం అంతర్లయగా ఉన్నది. ప్రసాద్ రచించిన 'ఆరనిజ్వాల', 'శివాలయ్య' నృత్యరూపకాలను ఆం.ప్ర.ప్రజానాట్యమండలివారు అనేక వేదికలపై ప్రదర్శించారు.

కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, ఉత్తమ గ్రంథాలకు సంపాదకులుగా బహుముఖీయమైన కృషిని కొనసాగిస్తున్న ప్రసాద్ 'విశాలాంధ్ర ప్రచురణాలయం' సంపాదకులుగా అనేక అరుదైన, విలువైన గ్రంథాల ముద్రణకు, పునర్ముద్రణకు కృషి చేశారు. రాష్ట్ర విభజనానంతరం ఏర్పడిన నవచేతన ప్రచురణాలయం సంపాదకులుగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 89 సంవత్సరాలు పూర్తి చేసుకుంటూ 90వ జన్మదినోత్సవాన్ని జరుపుకోబోతున్న ప్రసాద్ ఈ వయసులోనూ సాహిత్య సృజన పరిశోధన రంగాల్లో విరామ మెరుగక పరిశ్రమిస్తూనే ఉన్నారు. ఇదివరకే శిష్ట్లా ఉమామహేశ్వర రావు జీవితాన్ని, సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రసాద్ గారు యామిజాల ఆనంద్ సహకారంతో 'శిష్ట్లా ఉమామహేశ్వర రావు సర్వలభ్య సంపుటి'ని ఇటీవల ప్రచురించారు. అలాగే 'కొంపెల్ల జనార్ధన రావు సర్వలభ్య సంపుటి'ని రూపొందించే పనిలో ఉన్నారు. తమ ఉద్యమ సహచరులు, సమకాలికులుకందిమల్ల ప్రతాపరెడ్డి ఎంతో శ్రమకోర్చి రూపొందించిన 'రాలిన రత్నాలు' గ్రంథ చిత్తుప్రతిని అక్షరాక్షరం చదివి అక్షర దోషాలను సరి చేశారు. తను ప్రోత్సహించి, వెన్ను తట్టిన అరసం కార్యకర్త, కావ్యకర్త వేల్పుల నారాయణ కథల సంపుటి 'వెలుగుల వెనుక' గ్రంథాన్ని నిండు హృదయంతో ఆహ్వానించారు. విశాలాంధ్ర ప్రచురణాలయం, నవచేతన ప్రచురణాలయం ప్రచురించిన వందలాది గ్రంథాలకు అట్ట వెనుక విశ్లేషణ, పరిచయాలను రాశారు. ఇంకా రాస్తూనే ఉన్న డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ ఒక నిర్విరామ కర్మయోగి.


**(జులై 19న ఏటుకూరి ప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా)**



## చదవాల్సిన పుస్తకం

# ఏటుకూరి... అలుపెరుగని సాహితీ బాటసారి

ఒక అద్వితీయ సంఘర్షణ... ఒక బలీయమైన నిరసన... ఒక విశిష్టమైన దార్శనికత.. ఒక లోతైన అధ్యయనం... ఒక అలుపెరుగని పోరాటం ఏక రూపాన్ని దాల్చుకుంటే, అది ఏటుకూరి ప్రసాద్‌గా ఆవిష్కృతమవుతుంది. కమ్యూనిజం సిద్ధాంతాలు... నైతిక విలువలు... ప్రగతిశీల సాహిత్య సృష్టి... మొక్కవోని పరిశోధనా స్ఫూర్తి కలిస్తే ఏటుకూరి మాటవుతుంది. తాడితులు, పీడితుల వేదనకు స్పందనగా మారి ఏటుకూరి పాటవుతుంది. పదాలు కూడా కత్తులు.. బాకులు.. ఈటెలు.. పలుగులుగా ఎలా మారుయో, చదువరుల మెదళ్ల నుంచి అవి ఎలా దూసుకెళతాయో తెలియాలంటే, ఏటుకూరి రచనలు చదివి తీరాలి. ఆయన పాటల్లో ఆవేశాలు కట్టలు తెంచుకుంటాయి. ఒకవైపు సాహితీ సేద్యం చేస్తూనే, మరోవైపు విస్తారమైన పరిశోధన చేస్తున్న ఘనాపాటి ఏటుకూరి. వెలుగు చూడని ఎంతో మంది అభ్యుదయ తెలుగు కవుల రచనలు, వారి సాహిత్య విలువలు తెలుసుకోవడానికి ఏటుకూరి 'పొయిట్రి వర్క్‌షాప్' అధ్యయనం చేయాలి. ఒక కవి స్వయంగా పరిశోధకుడిగా మారితే ఎన్ని అద్భుతాలు జరుగుతాయో ఏటుకూరి జీవన ప్రస్థానం, చేస్తున్న సాహితీ సాగు చెప్పకనే చెపున్నది. ఆయన పరిశోధనా గ్రంథం 'తాపీ ధర్మారావు జీవితమూ–రచనలు' కేవలం పిహెచ్‌డి పట్టా కోసం చేసిన మొక్కుబడి రచన కాదు. లోతైన విశ్లేషణ. అతనితర సాధ్యమైన పరిశోధన. ఈ రెండు పుస్తకాలు చాలు.. ఏటుకూరి సాహితీ కృషీవలుడిగా, పరిశోధకుడిగా అధిరోహించిన ఉన్నత శికరాలను తెలుసుకోవడానికి. యామిజాల ఆనంద్‌తో కలిసి



ఆయన చేసిన అపూర్వ అన్వేషణ ఫలితమే 'పొయిట్రి వర్క్‌షాప్'. ఇందులో ఎంతో మంది ప్రముఖ కవుల రచనలు ఉన్నాయి. గొప్ప సాహితీ సృజన చేసినప్పటికీ, తగినంత గుర్తింపు రాని వారి కవితలు కూడా ఉన్నాయి. కవితలతో పాటు, వారి సొంత దస్తూరీని సేకరించి మరీ ముద్రించడం కేవలం తెలుగులోనేకాదు.. మరే ఇతర భాషల్లోనూ జరగని ఓ మహా అద్భుతం. యువ సాహితీవేత్తలకు, ఔత్సాహికులకేకాదు.. కాకలుతీరిన కలం యోధులకు కూడా ఇది రిసోర్స్ మెటీరియల్. అందుకే ఇది ముమ్మాటికీ 'గిన్నిస్' పుస్తకంలో చోటు సంపాదించాల్సిన పుస్తకం. నిజానికి, ఆయా రచయితలు రాసిన కవితలను వారి చేతిరాతలో ముద్రించాలనుకోవడం ఒక సాహసం. వాటి సేకరణ ఒక మహాయజ్ఞం. వీరిలో చాలా మంది కాలం చేసి ఎన్నో ఏళ్లు గడిచిపోయింది. కొందరి కుటుంబాలు ఎక్కడికి తరలివెళ్లాయో? ఎక్కడ స్థిరపడ్డాయో కూడా ఎవరికీ తెలియదు. వారు ఎక్కడ ఉన్నారో కనుక్కోవడం ఎంత కష్టమో ఊహించలేం. కవులు కాగితంపై రాసుకున్న కవితలను సేకరించాలన్న ఆలోచన పూర్వాపరాలను ప్రస్తావిస్తూ, 'కవి ఒక ఘటనకు తన స్పందన ఏ వర్గానికి వెళ్లాలో నిర్ణయించుకుంటాడు. ఆ వర్గ ఆలోచనలనూ, తానందించేదాన్ని స్వీకరించగల, శక్తి యుక్తులనూ, వారి సమాజిక అవగాహననూ, వారి సాంస్కృతిక స్థాయిని అంచనా వేసుకుంటాడు. తన రచనను రూపొందిస్తాడు. ఈ ప్రాసెస్‌లో కవిత అనేక మార్పులకూ, చేర్పులకూ, పాఠాంతరాలకూ గురవుతుంది. కొందరి కవుల విషయంలో ఇదంతా మనసులో జరిగితే, మరికొందరి విషయంలో కాగితం మీద జరుగుతుంది' అంటారు ఏటుకూరి. చాలా కవితల్లో కొట్టివేతలు, సరిచేయడాలను చూస్తే ఆ కవి అంతరంగాల్లో కొనసాగిన ఘర్షణ అర్థమవుతుంది. కేవలం కవితను లేదా రచనను ఎవరైనా సేకరించగలరేమో.. కానీ, దాని వెనుక కవి ఎంతగా మథన పడ్డాడో పాఠకులకు తెలియచేలానుకోవడం ఏటుకూరి విలక్షణమైన ఆలోచనా శైలికి అద్దం పడుతుంది. ఈ 'పొయిట్రి వర్క్‌షాప్' పుస్తకంలో గుజరాడ (పూర్ణమ్మ), గిడుగు రామమూర్తి (నేనెవరు), ఆదిభట్ల నారాయణ దాసు (ఈనాటి చదువు) ఉన్నాయి. వీళ్లేకాదు.. చెళ్లపిల్ల వేంకటశాస్త్రి, కొప్పరపు సోదర కవులు, ఉమర్ అలీషా, త్రిపురనేని రామస్వామి చౌదరి, రాయప్రోలు సుబ్బారావు, కవికొండల వేంకటరావు వంటి ఎంతో మంది దస్తూరీని ఇందులో అందించారు. వీటి సేకరణకు ఎంతగా తిరిగారో... ఎంత కష్టపడ్డారో! గుడిపాటి వెంకట చలం (చలం), పింగళి లక్ష్మీకాంతం, అడవి బాపిరాజు, దువ్వూరి రామిరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, సుద్దార హన్మంతు, తెన్నేటి



సూరి, పుట్టపర్తి నారాయణాచార్యులు, కాళోజీ నారాయణ రావు, త్రిపురనేని మహారథి, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, కుందుర్తి ఆంజనేయులు.. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందల మంది కవుల చేతిరాతను మన కళ్లముందు ఉంచారు. ఈ కవితల్లోని ప్రతి అక్షరం ఏటుకూరి, యామిజాల శ్రమకు, విధి పట్ల ఉన్న అంకిత భావానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ పుస్తకం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎంతటి వ్యాసమైనా చిన్నదే. అయినా... ఈ 'తెలుగు రచయితల చేతిరాతల కవితా సంకలం' పుస్తకాన్ని చూస్తే కలిగే ఆనందాన్ని కొలిచే సాధనం ఎక్కడ ఉంటుంది?. 'తాపీ ధర్మారావు జీవితమూ–రచనలు' పేరుకు తగ్గట్టే మొత్తంగా 'తాతాజీ' గురించి సమగ్ర సమచారాన్ని అందిస్తుంది. తాపీ రచనలు అనే అంశం డాక్టరేట్ కోసం పరిశోధనకు తీసుకున్న తర్వాతగానీ, ఇందులోని లోతు తెలియలేదని పరిచయ వాక్యంలో పేర్కొన్నారు రచయిత ఏటుకూరి. తాపీ ధర్మారావు హేతువాది... పత్రికా సంపాదకుడు.. వ్యావహారిక భాషావాది... సినీ రచయిత... కావ్య వ్యాఖ్యాత... సాహితీ విమర్శకుడు... పరిశోధకుడు. సూటిగా చెప్పాలంటే, తాపీ స్పృశించని సాహిత్య పార్శ్వం లేదు. ఆయన తన విశిష్టతను నిరూపించుకోని రంగం లేదు. ఆయనపై పరిశోధన కాబట్టి, రచయితకు అన్ని రంగాలనూ ప్రస్తావించక తప్పలేదు. 'ఆయా రంగాల పూర్వాపరాల నేపథ్యంలో తాపీ స్థానాన్ని అంచనా వేయడానికి చాలా వివరాల ప్రస్తావన తప్పనిసరైంది. ముఖ్యంగా రావేలుగల వాడ రార పొలిగాడ అనే ప్రకరణంలో సామాజిక మానవ శాస్త్రాలనూ, సిద్ధాంతాలనూ, వీరి రచనల మూలతత్వాల విశదీకరణకు అన్వయించే ప్రయత్నం జరిగింది' అంటారు ఏటుకూరి. ఈ పుస్తకం తాపీ రచనల విశిష్టతనేకాదు.. ప్రత్యేకతలను కూడా వివరిస్తుంది. తెలుగు సాహితీ రంగంలో తాపీకి ఎందుకు అంత ఉన్న ఉన్నత స్థానం లభించిందనే ప్రశ్నకు ఈ పుస్తకమే సమాధానం. తాపీని ఆవిష్కరించిన ఏటుకూరి ధన్యజీవి.

### పుస్తకం పేరు

| పొయిట్రి వర్క్‌షాప్ (తెలుగు రచయితల చేతిరాతల కవితా సంకలం) | తాపీ ధర్మారావు జీవితమూ రచనలు |
|---|---|
| వెల: రూ. 500 | వెల: రూ. 350 |

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్‌ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).



## ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై రచనలకు ఆహ్వానం

ప్రజాయుద్ధం నౌక గద్దర్ అమరత్వంపై, ఆయన సాహిత్య సాంస్కృతిక విశిష్టత, కృషిని చెప్తూ వచ్చిన పాటలను ,కవిత్వం, వ్యాసాలను గద్దర్ ఫౌండేషన్ ఆహ్వానిస్తున్నది. నేటి సమాజానికి ఆయన చేసిన సాహిత్య, సాంస్కృతిక కృషిని, పోరాట చరిత్రను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా, కవులు, రచయితలు, ప్రజా కళాకారులు మేధావుల నుంచి ఆయన సాహిత్యం వ్యాసాలు, పాటలను ఆహ్వానిస్తున్నట్టు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జివి సూర్య కిరణ్ తెలిపారు. గద్దర్ సాహిత్యాన్ని, ఆయన సామాజిక ఉద్యమ చరిత్రను ప్రజలకు అందించే ప్రయత్నంగా, తమకు అందిన రచనలన్నింటినీ ప్రచురించి ఒక పుస్తక రూపంలో తీసుకురావాలని గద్దర్ ఫౌండేషన్ తలపెట్టింది. పాటలు, కవితలు ఇంతకుముందు ఎక్కడైనా ప్రచురితమైనా, కాకపోయినా పంపించాల్సిందిగా కోరింది. దీనితోపాటు యూట్యూబ్ చానల్‌లో ఉన్న పాటలను రచయితల అనుమతితో ప్రచురించాలని నిర్ణయించింది. కాబట్టి రచయితలంతా తమ పాటలను పంపించాలని కోరింది. రచనలు, పాటలను పంపించాల్సిన వారు.. వాట్సాప్ నెంబర్ +917396065999, +919000744418కు గానీ, Email: info@gaddarfoundation.org కు గాని పంపించాలి. ప్లాట్ నెంబర్ : 26, ఇంటి నెంబర్ : 23/126/ 1/A, BESIDE NALL POCHAMMA TEMPLE BHOODEVI NAGAR COLONY, SECUNDERABAD: 500 015 అనే చిరునా మాకు పోస్టులో కూడా పంపవచ్చు. రచనలు పంపే వారు తమ అడ్రస్, ఫోన్ నెంబర్‌తో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో కూడా పంపించాల్సి ఉంటుంది.

**ఈ వారం కవితలు**

## జ్వాలలు రగిలించు

పారిపోకు, సమాజం చీకటి కమ్మినా,
నీ చుట్టూ అన్యాయం కత్తులు తిప్పినా,
భయం నీ గుండెను బంధించినా,
నీ రక్తంలో విప్లవ జ్వాల రగిలించు!
కన్నీటి సముద్రం నీ కళ్లలో నిండినా,
చీకటి గొలుసులను తెంచుకో,

అణచివేత గోడలను కూల్చివేయ్,
నీ గళంలో గర్జన ఉద్భవించనీ,
విప్లవ గీతం ప్రతి హృదయంలో మార్మోగనీ!
ఎదురు తిరుగు, ఎదిరించు, ఎగసిపడు,
సమాజం సౌరభం నీ చేతుల్లో పూయనీ,
నీ పిడికిలిలో ధైర్యం, నీ నడకలో విజయం,

విప్లవం నీ ఊపిరిలో జనించనీ!
నీ ఆత్మలో స్వాతంత్ర్య గీతం పాడనీ,
అసత్య గోడలను కాల్చి బూడిద చేయనీ,
ప్రతి అడుగులో న్యాయ దీపం వెలిగించు,

**రాము కోలా**
**9849001201**



## మఖ్దూం భవన్... మఖ్దూం భవన్..

మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూంభవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

ప్రకృతి ఒడిలో వసంతకాలం
హరిత అందమై మురిసినట్లు
మబ్బులు కమ్మిన ఆకాశం
అరుణబింబమై వెలిగినట్లు
వెలుగుతున్నది మన మఖ్దూం భవన్
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

అమరవీరుల సమర చరితవు
సమరయోధుల రగల్ జెండవు
కార్మిక శ్రేణుల కంటిపాపవు
పోరాట రచనకు కేంద్ర బిందువు
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్ రెడ్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

మార్క్స్ లెనిన్ సిద్ధాంతాన్ని
గుండె గుండెకు పంచుతుంటవు
సోషలిజం సాధించాలంటూ
విశ్వాసాన్ని పెంచుతుంటవు
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్




సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

బానిస బతుకుల చెరవిడిపించిన
సాయుధ పోరాట యోధుల చరితవు
ఉద్యమాల కీర్తి పతాకవు
ప్రతిధ్వనించే ప్రజాగొంతుకవు
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూంభవన్

దోపిడి శక్తుల కూల్చాలంటూ
చైతన్యాన్ని రగిలిస్తుంటవు
మనిషి మనిషిగా బతకాలంటే
సమ సమాజం రావాలంటవు
సరికొత్త కాంతులతో మఖ్దూం భవన్
పిడికిలి ఎత్తింది మఖ్దూం భవన్
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

**కెవి.ఎల్. 9490952649**

## చిట్టి చీమలు

పుట్ట పొట్టలో కుప్పలు కుప్పలు
చిన్ని పొట్టకు నిరంతర తిప్పలు
పుట్టలో చేరు తెప్పలు తెప్పలు!

శ్రమ విభజన సాంకేతిక నిపుణులు
శ్రమ సౌందర్య సాధన ప్రవీణులు
శ్రమ జీవన విధాన శైలి ప్రాణులు!


సంఘ జీవికి జీవన బాటలు
సహకార జీవన నవ పథాలు
సామ్యవాద జీవన సంకేతాలు!

క్రమశిక్షణ కాలానుగత సారిణి
కూడబెట్టు ముందు చూపు ధోరణి
కరువు క్షుదాభేధల నివారిణి!

పుట్ట కట్టి పాములకు ఇచ్చు
పుట్టలో కోటలు రాజులు మెచ్చు
చిన్ని ప్రాణులపై గౌరవం హెచ్చు!

పుట్ట లో వేలు పెడితే కుట్టి పెట్టు
పెద్ద పాము నైనా మట్టు పెట్టు
చిట్టి చీమలు మనసును కట్టి పెట్టు!

**పట్లోళ్ళ బక్కారెడ్డి**
**9705315250**



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిహార్‌లో న్యాయవాది కాల్చివేత

**పాట్నా:** బిహార్‌లో కాల్పుల మోత మోగుతున్నది. తాజాగా ఒక న్యాయవాదిని దుండగులు కాల్చి చంపారు. దీంతో గత 24 గంటల్లో కాల్పుల్లో నలుగురు మరణించడం కలకలం రేపింది. పాట్నాలోని సుల్తాన్‌పూర్ ప్రాంతంలో నివసిస్తున్న 58 ఏళ్ల జితేంద్ర కుమార్ మహతో న్యాయవాది. ఆదివారం యథావిధిగా టీ తాగేందుకు రోజూ వెళ్లే షాపు వద్దకు అతడు వెళ్లాడు. టీ తాగిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన జితేంద్ర కుమార్‌ను హాస్పిటల్‌కు తరలించగా అతడు మరణించాడు. కాల్పులు జరిగిన ప్రాంతం నుంచి మూడు బుల్లెట్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాలింపు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గత రెండేళ్లుగా న్యాయవాది వృత్తిలో చురుగ్గా లేడని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న బిహార్‌లో గత 24 గంటల్లో కాల్పుల సంఘటనల్లో నలుగురు మరణించడం కలకలం రేపింది.

## 15న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీ


### వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం ఖరారు



**న్యూఢిల్లీ :** రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు పార్టీలు సమాయత్తమవుతున్నాయి. పలు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అస్త్రశస్త్రాలనుసిద్ధం చేసుకుంటున్నాయి. అందులో భాగంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఈనెల 15న పార్టీ అగ్ర నాయకులతో సమావేశం కానున్నారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు. ఈ సమావేశంలో బిహార్‌లో ఇసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక అంశాలను లేవనెత్తాలని ప్రతిపక్షాలు యోచిస్తుండటంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తీవ్ర గందరగోళంగా మారే అవకాశం ఉంది. పార్లమెంటరీ వ్యూహ బృంద సమావేశంలో రాజ్యసభ, లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఉభయ సభల్లోని డిప్యూటీ నాయకులు, పార్టీ చీఫ్ విప్‌లు, విప్‌లు పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సోనియా గాంధీ అధ్యక్షత వహించే ఈ సమావేశం 10 జనపథ్‌లోని తన నివాసంలో జరగనుంది. వ్యూహాత్మక బృందంలో భాగమైన కొంతమంది సీనియర్ నాయకులు కూడా పాల్గొననున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ కంటే వారం రోజులు ఎక్కువగా కొనసాగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎన్నికల కమిషన్ (ఇసి) నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సమస్యలను కాంగ్రెస్ లేవనెత్తే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టులో ఎస్ఐఆర్‌ను సవాలు చేయడంలో అనేక ప్రతిపక్ష పార్టీలతో కలిసి కాంగ్రెస్ కూడా సంతకం చేసింది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది అభిషేక్ సింఘ్వి ఈ కేసును వాదిస్తున్నారు. ఎస్ఐఆర్ రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రంలోని సుమారు రెండు కోట్ల మంది ఓటర్ల ఓటు హక్కును తొలగించడమే లక్ష్యంగా ఉందని ఆరోపిస్తూ, దానిని రద్దు చేయాలని కాంగ్రెస్ కోరుతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో లోపాలు, నష్టాలు ఏమిటని, అణు యుద్ధాన్ని నివారించడానికి భారత్‌–పాకిస్థాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనల తరువాత శత్రుత్వాలు నిలిపివేయడానికి దారితీసిన పరిస్థితులపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నుండి సమాధానాలు కోరే అవకాశం ఉంది. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ పై చర్చ జరగాలని ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఏప్రిల్ 22న కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన ఊచకోతకు ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ప్రాంతాలలోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయడం తెలిసిందే. ఆర్థిక స్థితి, ధరలు, నిరుద్యోగంతో పాటు, భారతదేశంపై అమెరికా సుంకాల అంశాన్ని కూడా చర్చల సమయంలో లేవనెత్తే అవకాశం ఉంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను తొలగించాలని తీర్మానం ప్రవేశపెట్టే నోటీసు కూడా రాజ్యసభ చైర్మన్ ముందు పెండింగ్‌లో ఉన్నందున ఆయనపై అభిశంసన అంశం కూడా సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది. జస్టిస్ యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు మతపరమైనవని, అలాంటివి పదవిలో ఉన్న వ్యక్తి నుండి ఊహించనివని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్లమెంటులో పార్టీ లేవనెత్తాలనుకుంటున్న అంశాలపై వ్యూహం ఖరారు అయిన తర్వాత, వర్షాకాల సమావేశాలకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతుందని వర్గాలు తెలిపాయి. అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ ప్రవేశాన్ని సులభతరం చేయడంతో సహా కీలక చట్టాలను తీసుకురావాలనే ప్రభుత్వ ప్రణాళికల మధ్య సెషన్ ఎక్కువ కాలం కొనసాగుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

## ఎన్నికల సంఘం ఎల్లప్పుడూ...
# మోదీ ప్రభుత్వం చేతిలో 'కీలుబొమ్మే'

### రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆరోపణ



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం (ఇసి) ఎల్లప్పుడూ నరేంద్రమోదీ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగానే ఉందని, బీహార్‌లో ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్రసవరణ(ఎస్ఐఆర్)ఎన్నికల జాబితా మెజారిటీవర్గం అధికారంలో ఉండేలా చూసుకోవడానికి ఉద్దేశించిన 'రాజ్యాంగ విరుద్ధమైన చర్య' అని ప్రముఖసీనియర్‌న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ఆరోపించారు. ఆయన ఆదివారం 'పిటిఐ'కిఇచ్చినఇంటర్వ్యూలోఈవిషయంపై మాట్లాడారు. ప్రతీ ఎన్నికల కమిషనర్ తన ప్రభుత్వంతో ఉన్న పొత్తులో భాగంగా ఆయనకు ముందు అదే హోదాలో ఉన్న కమిషనర్‌ను అధిగమిస్తుంటారని కపిల్ సిబల్ ఆరోపించారు. బిహార్‌లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల జాబితాను ఆయన విమర్శిస్తూ పౌరసత్వ సమస్యలను నిర్ణయించే అధికార పరిధి ఎన్నికల కమిషన్ (ఇసి)కి లేదని మాజీ న్యాయశాఖ మంత్రి కూడా అయిన కపిల్ సిబల్‌స్పష్టంచేశారు.22సంవత్సరాల తర్వాత సవరణ జరుగుతున్నదని, ఎన్నికల సంఘం అనర్హుల ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తున్నదని, చట్టప్రకారం ఓటువేయడానికి అర్హులైన వారిని చేరుస్తుందనిఇసిఎప్పటినుండోవాదిస్తుందని అన్నారు. ఎస్ఐఆర్ విషయమై ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల దాడి గురించి ప్రశ్నించగా కపిల్ సిబల్ సమాధానమిస్తూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచిచాలాకాలంగాప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా మారిందన్నది వాస్తవమన్నారు. ఎన్నికల కమిషన్ ప్రవర్తన ఎంత తక్కువగా ఉంటే అంత మంచిదన్నారు. 'వాస్తవానికి ప్రతీ ఎన్నికల కమిషనర్ ఈ ప్రభుత్వానికి అనుగుణంగా ఉండటంలో మునుపటి వారిని అధిగమిస్తారు అని సిబల్ చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల జాబితా గురించి ఆయన మాట్లాడుతూ 'ఇది నా ప్రకారం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన ప్రక్రియను ముందుకు తీసుకెళుతున్నారు.పౌరసత్వ సమస్యలను పరిష్కరించే అధికారం కమిషన్‌కు లేదు. అదికూడా బ్లాక్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఓ)కు లేదు' అని సిబల్ స్పష్టం చేశారు. 'వారు (బిజెపి) ఎన్నికల్లో ఎలాగైనా గెలవగలరని నేను చెబుతూనే ఉన్నాను. వాస్తవానికి ప్రత్యేక సమగ్ర సవరణ యొక్క మొత్తం ప్రత్యేక ప్రక్రియ మెజారిటీ అన్ని వేళలా మెజారిటీ ప్రభుత్వాలను నిర్ధారించే ప్రక్రియగా మారుతోంది' అని కపిల్ సిబల్ చెప్పారు. 'పేద ప్రజలను, అణగారిన వర్గాలను, ఆదివాసీలను తొలగించడం ద్వారా మెజార్టీపార్టీఎల్లప్పుడూగెలుస్తుందనిమీరు భరోసా ఇస్తున్నారు. కాబట్టి ఇది మరొక మార్గంగా ఎంచుకోవడం ఆందోళనకర విషయం' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను తాను ఎల్లప్పుడూ ఆశించనని, ఎందుకంటే ఆ సంస్థ ఎల్లప్పుడూ వారి నుంచి ఆశించిన స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబించలేదని అన్నారు. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుపై స్పందించడానికి రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ నిరాకరించారు. ఎందుకంటే తాను న్యాయవాదిని అని ఆయన ఎత్తి చూపారు. కోర్టు చెప్పినదానిని ఎన్నికల సంఘం పరిగణనలోనికితీసుకుంటుందనితాను ఆశిస్తున్నానని, తద్వారా ఈ వివాదాన్ని ముందుకు తీసుకెళ్ల కూడదని తానుఆకాంక్షిస్తున్నాననిచెప్పారు. ఈ విషయంలో మహారాష్ట్ర అంశం చాలా ముఖ్యమైనదని, ఎందుకంటే బిజెపి గెలిచిన స్థానాలలో మాత్రమే ఓటర్లు ఎలా భారీగా పెరిగారో ఎన్నికల సంఘం ఇప్పటికీ వివరించలేకపోయిందని మహారాష్ట్రలో ఇటీవలి ఎన్నికల్లో గెలుపు అంశాన్ని ప్రత్యేకంగా ఆయన ప్రస్తావించారు.

# బిహార్ ఓటర్ల జాబితాలో విదేశీయులు

### భారీ సంఖ్యలో బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు ఉన్నట్లు అధికారులు వెల్లడి

**న్యూఢిల్లీ :**బిహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ భారత ఎన్నికల సంఘం 'ఓటరు జాబితా సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)ను చేపట్టడం దేశవ్యాప్తంగా దుమారం రేపింది. విపక్షాల ఆందోళనలను తోసిపుచ్చుతూ బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'ఓటర్ జాబితా సమగ్ర సవరణ' ప్రక్రియలో కీలక విషయాలు తెలుస్తున్నాయి. బిహార్‌లో ఇంటింటినీ తనిఖీ చేస్తున్న ఇసి సిబ్బందికి భారీగా బంగ్లాదేశీయులు,నేపాలీలు,మయన్మార్ పౌరులు కనిపించారు. వారి వద్దఆధార్,రేషన్‌కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా ఉన్నాయి. అంతేకాదు వారిలో చాలా మంది ఓటర్ లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి భావిస్తోంది. అందుకే ఆగస్టు తర్వాత వారిని విచారించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపింది. సెప్టెంబర్‌లో విడుదల చేసే తుది ఓటర్ జాబితాలో విదేశీయుల పేర్లు ఉండవని స్పష్టం చేసింది. ప్రతిపక్షాలకు వచ్చే ఓట్లను తొలగించడానికే కేంద్రప్రభుత్వం కనుసన్నల్లో ఇసి ఈ ప్రక్రియ చేపట్టిందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆధార్ కార్డును పౌరసత్వ గుర్తింపుగా పరిగణించకపోతే పేదలు, వృద్ధులు ఇప్పటికిప్పుడు కుల, నివాస, జనన ధ్రువపత్రాలు ఎలా తీసుకురాగలరని ప్రశ్నించాయి. పిటిషన్లను విచారించిన సుప్రీం ఓటర్ జాబితా సమగ్ర సవరణ రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసింది. అయితే ఎస్ఐఆర్ కోసం ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఇసికి సూచించింది. ఈ క్రమంలో ఎన్నికల అధికారులు బిహార్‌లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ చేపట్టారు. ఇంటింటి తనిఖీల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తులు భారీగా బిహార్‌లో ఉన్నారని గుర్తించారు. వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయా లేదా అన్నది వెల్లడించలేదు. బిహార్‌లో ప్రస్తుతం 77 వేలమంది బూత్ లెవల్ ఆఫీసర్లు, ప్రభుత్వ సిబ్బంది, రాజకీయపార్టీల కార్యకర్తలు ఎస్ఐఆర్‌లో పాల్గొంటున్నారు. 7.8 కోట్ల మంది ఓటర్లను వీరు తనిఖీ చేయనున్నారు.

## జైళ్లల్లో హింసాత్మక ధోరణులపై నిఘా వేయండి

### రాష్ట్రాలకు హోంశాఖ హెచ్చరిక, మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ :** జైళ్ళల్లో హింసాత్మక,ఉగ్రవాద,ప్రమాదకర ధోరణులు, సంబంధిత ఆలోచనలు పెరుగుతున్నాయని, ఇది రోజురోజుకూ ఒక కీలక సవాలుగా మారుతోందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ పేర్కొంది. జైలు వాతావరణంలో ఒకరివల్ల మరొకరు ప్రభావితులయ్యే ధోరణులను తనిఖీలు చేయాలని కోరుతూ కేంద్ర హోంమంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రమాదకర,హింసాత్మక లేదా రకకరాల ఆలోచనలున్న ఖైదీలను గుర్తించేందుకు, అంచనావేసేందుకు తగిన ప్రామాణికతలతో కొన్ని పద్ధతులు అభివృద్ధి చేయాలని కోరింది. వారి స్నేహాలు, సంఘాలు, సిద్ధాంతాలను కొలమానాలుగా తీసుకుని ప్రవర్తనలు అంచనావేయాలని కోరింది. ఈ కొలమానంవల్ల ఖైదీల ప్రవర్తనను అంచనావేసేందుకు తర్వాత అందరికీ ఉపయోగపడుతుందని తెలిపింది. వ్యక్తిగతంగా సమస్యాత్మకంగా ఉండేవారిని ఎప్పటికప్పుడు నిర్ణీత విరామాలతో తనిఖీచేసి మార్పులు తెచ్చేందుకు ఏర్పాటు చేయాలని కోరింది. జాతీయ భద్రతకు నష్టం కలగకుండా వారికి పునరావాసం ఉండాలని, శాంతి భద్రతలను కాపాడేవిధంగా వీరందరినీ తీర్చిదిద్దాలని కోరింది. జైళ్ళల్లో ఖైదీలను మార్చి విజయవంతంగా సమాజంలో తిరిగి కలిసిపోయేవిధంగా సమస్యలను పరిష్కరించడం చాలా ముఖ్యమైన విషయమని పేర్కొంది. జైళ్ళల్లో అందరూ సన్నిహితంగా మెలగడంవల్ల ఒంటరితనంతో ఉన్నవారు సులభంగా హింసాత్మక వైఖరులకు,సంఘ వ్యతిరేక ప్రవర్తనకు సులభంగా ఆకర్షితులవుతారని తెలిపింది. కొన్ని సందర్భాలలో జైలు సిబ్బందిపైన, తోటి ఖైదీలమీద కూడా దాడులు చేసేవిధంగా తయారవుతారని, వారి ధోరణి మారిపోకుండా అదుపుచేసి, శాంతిసాధనకు, జైళ్ళల్లో అంతర్గత భద్రతకు భరోసా ఇచ్చేవిధంగా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తీసుకోవాల్సిన వివిధ రకాల చర్యలను కూడా ఆ మార్గదర్శకాల్లో పొందుపరచింది. జైళ్ళ తమ తమ పరిధులలో ఈ సమస్యలను సమన్వయపూర్వకంగా ఎదుర్కోవాలని కోరింది. జైళ్ళల్లో ఉన్న ఖైదీల ధోరణులను ఎప్పటికప్పుడు కనిపెట్టి ఉండాలని, వారి ఆలోచనలు, ఉద్దేశాలు, వైఖరులలో మార్పులను గమనించాలని, వివిధ రకాలకు చెందిన దోషులు, నిందితులు వచ్చే జైళ్ళల్లో చాలా ఎక్కువ ప్రమాదం తెచ్చిపెట్టేవారు కూడా ఉంటారని, అలాంటివారిని పసిగట్టి వేరుచేయాలని, ఎప్పటికప్పుడు నిఘా చాలా అవసరమని తెలియజేసింది. హింసాత్మక ధోరణులతో వ్యవహరించే ఖైదీలను ఆ పరిస్థితి నుండి వెనక్కు తీసుకువచ్చేందుకు తగిన శిక్షణా చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాల్లో తెలియజేసింది.జైళ్ళల్లో ఈ హింసాత్మక, ఆవేదనాత్మక ఆలోచనా ధోరణులవల్ల ఖైదీలు విసుగెత్తిపోయి ఉంటారని, ఇలాంటి ఆలోచనాధోరణులున్నవారు సన్నిహితంగా మెలగడంవల్ల సమస్యలు పెరుగుతాయని, ఇలాంటి గ్రూపులను గమనించి వారిని వేరు చేయాలని, ఒకవేళ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదాలు ఉంటాయని, పోనుపోనుఇదిపెద్ద సవాలుగా మారుతుందని హోంశాఖ మార్గదర్శకాల్లో హెచ్చరించింది. ''ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల నేపథ్యంలో జైళ్ళల్లో కీలకమైన సవాళ్ళు పెరుగుతున్నాయి, ఒకరివల్ల మరొకరు ప్రభావితులు కావడంవల్ల అనేక నేరపూరిత కార్యకలాపాలు పెరుగుతున్నట్లు తరుచుగా ప్రభుత్వాల దృష్టిలోకి వస్తున్నాయి. అందువల్ల ఈ విధమైన ధోరణులనుఅరికట్టేందుకుతక్షణనిఘా అవసరం ఉంది, సున్నితమైన వ్యక్తులు జైలు వాతావరణంలో తీవ్ర హింసాత్మకంగా ప్రవర్తించేవారి నుండి ప్రభావితమై నేర్చుకుంటున్నారు. వీళ్ళందరినీ ఈ ధోరణుల నుండి దూరం చేసి శాంతి భద్రతలను కాపాడేవిషయంలో వారినే కీలకపాత్ర వహించేవిధంగా తయారు చేయాలి'' కేంద్ర హోంమంత్రిత్వశాఖ మార్గదర్శకత్వాల్లో తెలిపింది.


## ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు

### ఎన్నికల వేళ నితీశ్ కుమార్ యువతను ఆకట్టుకునే కీలక హామీ



**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువతను ఆకట్టుకునే కీలక హామీని ప్రకటించారు. 2030 నాటికి యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అక్టోబర్‌–నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఎన్నికల తేదీలను ఎలక్షన్ కమిషన్ ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం తమ ప్రభుత్వం సాధించిన లక్ష్యాలను నితీష్ కుమార్ ప్రకటించారు. 2020–25 సంవత్సరానికి 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం పూర్తి కావడానికి అతి చేరువలో ఉన్నామన్నారు. ఇంతవరకూ 10 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, మరో 39 లక్షల మంది ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధి పొందారని చెప్పారు. 2030 కల్లా కోటి ఉద్యోగాల కల్పనకు పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేటురంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు సంబంధించి ఉపాధి విస్తరణ ప్లానింగ్ అమలు కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పనా జర్నీలో భాగంగా 2005, 2020 మధ్య 8 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. బిహార్ యువతకు ఉద్యోగాల కల్పన, సాధికారత కల్పించానికి తమ ప్రభుత్వం చిరకాలంగా కట్టుబడి ఉందని తెలిపారు. స్కిల్ డవలప్‌మెంట్‌కు మరింత ఊతమిచ్చేలా సాత్ నిశ్చయ్ ఇనీషియేటివ్ కింద జననాయక్ కర్పూరి ఠాకూర్ స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్నట్టు నితీష్ కుమార్ ప్రకటించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, ఇండస్ట్రీ రెలివెంట్ శిక్షణకు ఒక వేదికగా ఈ యూనివర్శిటీ ఉంటుందని చెప్పారు. అంతకు ముందు 300 అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులను నితీష్ ప్రకటించారు. బిహార్ నుంచి వలస వెళ్లి ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, ఢిల్లీలో ఉంటున్న వారి కోసం, ముఖ్యంగా పండుగ సీజన్లలో వీరి ప్రయాణాలకు వెసులుబాటు కల్పించేలా ఈ అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన బస్సుల్లో 75 ఎసి బస్సులు కూడా ఉన్నాయి. ఇందు కోసం జూన్ 24న రూ.105.82 కోట్ల బడ్జెట్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపారు. అదనంగా మరో 150 ఎసి బస్సులను పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) మోడల్‌లో ప్రవేశపెట్టనున్నామని నితీష్ చెప్పారు. పండుగ సీజన్లలో బిహార్ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వరాష్ట్రానికి చేరుకునేందుకు అదనపు ప్రత్యేక రైళ్లను నడపాలని కేంద్రాన్ని తమ ప్రభుత్వం కోరుతుందని తెలిపారు.

## కేరళ సిఎం నివాసానికి బాంబు బెదిరింపు



**తిరువనంతపురం:**కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీస్ స్టేషన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఇమెయిల్ పంపారు. క్లిఫ్‌హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ–మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఇమెయిల్‌గా తేల్చారు. 'బాంబు బెదిరింపు తర్వాత ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు' అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సిఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపుల వ్యవహారంతో తాజాగా వచ్చిన ఇ–మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రాజ్యసభకు నలుగురు కొత్త సభ్యులు

### ఉజ్వల్ దేవరావు నికం, హర్ష వర్ధన్ శ్రింగ్లా, డాక్టర్ మీనాక్షి జైన్, సదానందన్ మాస్టర్‌ను నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ :** రాజ్యసభకు నలుగురు సభ్యులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేశారు. వీరిలో ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ దేవ రావు నికం, మాజీ దౌత్యవేత్త హర్ష వర్ధన్ శ్రింగ్లా, చరిత్రకారిణి డాక్టర్ మీనాక్షి జైన్, కేరళ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త సదానందన్ మాస్టర్ ఉన్నారు. నామినేటెడ్ సభ్యులతో కూడిన జాబితాను హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(1)(ఎ)లోని క్లాజ్ (3) కింద రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. సాహిత్యం, సైన్స్, కళలు, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని రాజ్యసభకు నామినేట్ చేసే ప్రత్యేక అధికారం దేశ ప్రథమ పౌరుడికి ఉంటాయి.

#### ఉజ్వల్ నికం

దేశంలోని ప్రముఖ న్యాయవాదులలో ఉజ్వల్ నికం ఒకరు. 26/11 ముంబయి ఉగ్రదాడుల కేసు విచారణ, ఇతర హైప్రొఫైల్ క్రిమినల్ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి తరఫున ముంబయి నార్త్ సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. కాంగ్రెస్ అభ్యర్థి వర్ష గైక్వాడ చేతిలో ఓడిపోయారు.

#### హర్ష్ వర్ధన్ శ్రింగ్లా

భారత మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ వర్ధన్ అమెరికా, బంగ్లాదేశ్, థాయిలాండ్‌లకు రాయబారిగా విధులు నిర్వహించారు. కీలక దౌత్య పదవులు చేపట్టారు. 2023లో భారతదేశ జి20 ప్రెసిడెన్సీకి చీఫ్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు.

#### సదానందన్ మాస్టర్

కేరళకు చెందిన సి. సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. సామాజిక కార్యకర్తగా.. బిజెపి నేతగా కొనసాగుతున్నారు. 1994లో సిపిఐ(ఎం) నేతల దాడిలో ఆయన రెండు కాళ్లు పోగొట్టుకున్నారు. ఈ ఘటన అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన భాజపా తరఫున పోటీ చేశారు.

#### మీనాక్షి జైన్

మీనాక్షి జైన్ ప్రముఖ చరిత్రకారిణిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గానూ విధులు నిర్వర్తించారు. విద్యా రంగంలో ఆమె చేసిన కృషికి గాను 2020లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యురాలిగానూ పని చేశారు.

#### శుభాకాంక్షలు తెలిపిన నరేంద్ర మోదీ

నలుగురు ఎంపిలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ వర్ధన్ శ్రింగ్లా, 26/11 ముంబై ఉగ్రవాద దాడి కేసులోస్పెషల్‌పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్, కేరళ బిజెపి నేత సి సదానందన్ మాస్టర్, చరిత్రకారిణి మీనాక్షి జైన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## డోగ్రా సైన్యం చంపిన 22 మందికి నివాళులు అర్పించకుండా...
# మమ్ములను 'గృహనిర్బంధం' చేశారు

### మోదీ ప్రభుత్వంపై పలువురు జమ్ముకశ్మీర్ నాయకుల ఆగ్రహం


### 'స్పష్టమైన అప్రజాస్వామికం'అని ఖండించిన సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** డోగ్రా సైన్యం 1931 జులై 13న (ఇదే రోజు) చంపగా అమరులైన 22మందికి నివాళులు అర్పించకుండా నిరోధించడానికి తమను గృహ నిర్బంధంలో ఉంచారని జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు పలువురు ఆదివారం ఆరోపించారు. కాగా, జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ చర్యను 'స్పష్టంగా అప్రజాస్వామికం' అని వ్యాఖ్యానించారు. అయితే నాయకులు చేసిన గృహనిర్బంధ వాదనలకు అధికార ధృవీకరణ లేదు. మరణించిన 22మందికి నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 1931, జులై 13నాటి సంఘటనను జలియన్‌వాలాబాగ్ దురంతంతో పోల్చారు. జులై 13మారణహోమం మన జలియన్‌వాలా బాగ్‌మారణకాండ లాంటిది. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రాణాలు అర్పించిన ప్రజలు కశ్మీర్ బ్రిటీష్ పారమౌంట్సీ కింద పరిపాలించబడుతోంది. బ్రిటీష్ పాలనను అన్ని విధాలా వ్యతిరేకించిన నిజమైన హీరోలను నేడు ముస్లింలు కావడం వల్లనే విలన్లుగా చిత్రీకరించడం ఎంత సిగ్గుచేటు అని ఒమర్ అబ్దుల్లా తన 'ఎక్స్'పోస్ట్‌లో ధ్వజమెత్తారు.1919లో పంజాబ్ రాష్ట్రం జలియన్‌వాలా బాగ్‌లో వలస పాలనకు అనుమతించిన రౌలత్ చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోనిజలియన్‌వాలాబాగ్‌లోవందలాది ప్రజలు శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న తరుణంలో బ్రిటీష్ బలగాలు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండానే కాల్పులు జరపడంతో మరణించారని అబ్దుల్లా చెప్పారు. 'ఈరోజు వారి సమాధులనుసందర్శించే అవకాశాన్ని వారు నిరోధించగలమేమో కానీ వారి త్యాగాలను మనం మర్చిపోలేం' అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. 'ఈ స్పష్టమైన అప్రజాస్వామిక చర్యలో భాగంగా ఇళ్లల్లో ఉన్న వారు బయటకు రాకుండా బయట నుంచే తాళాలు వేశారు. శ్రీనగర్‌లో పోలీసులు, కేంద్రబలగాలను మోహరించి జైలర్లు ప్రధాన వంతెనలను దిగ్బంధించారు. అమరుల సమాధులనుసందర్శించకుండానిరోధించి కశ్మీర్ గొంతుకనునొక్కాలనుకున్నారు. ప్రభుత్వం భయపడి ఎలాంటి శాంతిభద్రతలను కోరుకుంటుందో నాకు ఎప్పటికీ అర్థం కావడంలేదు' అని సిఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ప్రతిపక్ష పిడిపి ప్రెసిడెంట్ మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ కశ్మీరీ అమరవీరులనుమనవారుగా అంగీకరించినప్పుడే ఢిల్లీ, కశ్మీరీల మధ్య అపనమ్మకం ముగుస్తుందన్నారు.మహాత్మాగాంధీమొదలుభగత్‌సింగ్ వరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఒకప్పుడు చెప్పిన విధంగానే మీరు మాహీరోలను సొంతంగా అంగీకరించిన రోజు 'దిల్ కీ దూరీ' (హృదయాల దూరం) నిజంగానే ముగిసిపోతుంది' అని ఆమె తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రిమెహ్‌బూబా ముఫ్తీ తన నివాసానికి కూడా తాళం వేసిన ఫొటోలను పోస్ట్ చేశారు. ఇళ్లనుంచి దొంగచాటుగా పారిపోయిన తమ పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ముఫ్తీ చెప్పారు. ఖుర్షీద్ అల్లమ్, జోహైబ్ మీర్, హమీద్ కోహ్‌షీన్, అరిఫ్ లయగ్రూ. సారా నయీమా, తబస్సుమ్, బష్రత్ నసీమ్‌తదితరులనుఇళ్లనుంచి తప్పించుకుని పారిపోయిన వారిని అదుపులోకి తీసుకుని నిర్బంధించబడిననాయకులపేర్లుగావెల్లడించారామె. పీపుల్స్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్ సాజద్ గని కూడా తనను తన నివాసానికి వెళ్లకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. 'ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి అనుమతిలేదు. చాలామంది నిర్బంధించబడ్డారు. కశ్మీర్‌కు ఏది పవిత్రమో పునర్నిచించాలని కేంద్రం చాలా ఆసక్తిగా ఉందని నేను భావిస్తున్నాను.కానీ జులై 13న చేసిన త్యాగాలు అందరికీ పవిత్రమైనవి' అని సాజద్ గని చెప్పారు.శుక్రవారం నుంచి గృహనిర్బంధంలో ఉన్న హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్వైజ్ ఉమర్ ఫరూఖీ మాట్లాడుతూ కశ్మీర్‌లో తన కుమారులు ,కుమార్తెలు చేసిన త్యాగాలు బాధాకరమైన గాథను ఎదుర్కొంటున్నారు అని చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్ దాడుల తర్వాత బ్రహ్మోస్ క్షిపణిపై 15 దేశాల ఆసక్తి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**లక్నో :** ఆపరేషన్ సింధూర్‌లో ఒక ఆయుధంగా తనసత్తాను చాటుకున్న బ్రహ్మోస్ క్షిపణిపై దాదాపు డజనుకుపైగా దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఉత్తర ప్రదేశ్ మాజీముఖ్యమంత్రి చంద్రభాను గుప్తా విగ్రహాన్ని ఆదివారంలక్నోలోనిజాతీయ పిజి కాలేజీలో స్థానిక ఎంపి హోదాలో కేంద్రమంత్రి ఆవిష్కరించారు. చంద్రభానుగుప్తా స్మృత్యర్థం ఒక పోస్టేజీ స్టాంప్‌ను విడుదల చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రభాను గుప్తాస్వాతంత్ర్యపోరాటంలో లక్షలమంది ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారన్నారు.అధికారంఅంటే బాధ్యత, త్యాగం, ప్రజల ప్రయోజనాలు కాపాడటం అనే విషయాన్ని ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా రుజువుచేశారన్నారు.రాజకీయాల్లో వైరుధ్యాలు తప్ప శత్రుత్వాలకు తావులేదన్న సందేశాన్ని కూడా తన పనితీరు ద్వారాచాటి చెప్పారన్నారు. ''కొద్దిరోజుల క్రితం లక్నోలో నేను బ్రహ్మోస్ ఎయిర్‌స్పేస్ ఇంటిగ్రేషన్,టెస్టింగ్ ఫెసిలిటీకి ప్రారంభోత్సవంచేశాను, ఆపరేషన్ సింధూర్ సందర్భంగా దాడుల్లో మీరు తప్పకుండా చూసే ఉంటారు, బ్రహ్మోస్ క్షిపణి అత్యద్భుతమైన పనితీరు ప్రదర్శించింది. బ్రహ్మోస్ సత్తానుచూశాక దాదాపు 14–15 దేశాలు మన క్షిపణిని కొను గోలు చేసేందుకు ఎంతో ఆసక్తి చూపించాయి. ప్రపంచవ్యాప్తంగా దేశాలుభారత్‌బ్రహ్మోస్‌నుకోరుకుంటున్నాయి''అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు



ప్రజాపక్షం/ఆలేరు : పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు, నాయకులకు గుర్తుపెట్టుకొని ప్రాధాన్యత కల్పిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. టిపిసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్ గౌడ్ నూతనంగా నిమితులైన సందర్భంగా ఆదివారం ఆలేరు మండలం మంతపురి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీమ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పట్టిష్టానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తారని, పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని అందుకు నిదర్శనమే పల్లె శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అనంతరం పల్లె శ్రీనివాస్ గౌడ్ ను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పార్టీ శ్రేణులు గజమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆడెం సంజీవరెడ్డి, ఎల్లముల సంజీవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఐనాల చైతన్య, జాలపు వనజారాణి పాల్గొన్నారు.

## నారాయణ రావుకు నివాళులు




ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మునుగోడు మాజీ ఎంఎల్ఏ, దేవరకొండ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతలలో ఒకరైన అమరజీవి కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీకి నారాయణరావు చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు జ్యోతిబస్, నగేష్, శాఖ కార్యదర్శులు మైనోద్దిన్, మల్లయ్య, శ్రీను, వెంకటయ్య, గోపి, నాయకులు గెల్వయ్య, బ్రహ్మచారి, పాండు, బక్కయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో హోంగార్డు మృతి



ప్రజాపక్షం/నందికొండ: విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కిషన్ (43)ఆదివారం గుండె పోటుతో మరణించారు.విధి నిర్వహణ లో భాగంగా ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన కిషన్ మార్గమధ్యంలో హఠాత్తుగా చాతీ లో నొప్పి రావటంతో చికిత్స నిమిత్తం తానే స్వయంగా స్థానిక ప్రభుత్వ ఏరియా కమల నెహ్రూ ఆసుపత్రి కి వెళ్లగా ఆసుపత్రి లో కొద్ది సేపటికే మృతి చెందాడు. కిషన్ 18 సంవత్సరాలుగా స్థానిక పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు అతని స్వస్థలం రంగుళ్ళ అతను తన భార్య ముగ్గురు పిల్లలతో కలిసి నాగార్జున సాగర్ లో నివాసం ఉంటున్నాడు.హోంగార్డు విధి నిర్వహణలో హఠాత్తుగా గుండెపోటుతో మరణించటంతో స్థానిక సీఐ శ్రీను నాయక్ ఎస్ఐ ముత్తయ్యలు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు అడ్డంకిగా మారిన అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్ నాయక్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గోపినాయక్, కొండ లింగయ్య, బాప్యలు కోరారు. ఆదివారం స్థానికంగా వారు మాట్లాడుతూ అడక్వాషి పదోన్నతులు అడ్డుకోవడానికేనని చెప్పారు. ఖాళీగా ఏర్పడిన ప్రతి పోస్టులను జనరల్ కేటగిరి కింద మారుతాయని అటువంటి పోస్టుల్లో పదోన్నతులు ఇచ్చేటప్పుడు రోస్టర కమ్ మెరిట్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినట్లు తెఇపారు. సీఎం దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు మక్లానాయక్, సైదులు, వడ్డె రాజు, సైదయ్య, జమ్లానాయక్, బద్దునాయక్, శంకర్ నాయక్, నెహ్రూనాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు జగదీష్‌రెడ్డికి సంబంధంలేదు

## జానయ్యకు రాజకీయ భిక్ష పెట్టింది జగదీష్‌రెడ్డినే



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: వట్టె జానయ్యకు రాజకీయ భిక్షపెట్టింది మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డినేనని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వట్టె జానయ్య యాదవ్‌కు ప్రాణహాని ఉందని, ఇద్దరు గన్‌మెన్‌లను పెట్టిన జగదీశ్వర్‌రెడ్డి మీద అవాక్కులు, చవాక్కులు పేల్చితే ఊరుకునేది లేదన్నారు. బడుగుల లింగయ్యయాదవ్‌ను రాజ్యసభకు పంపించిన వ్యక్తి జగదీష్‌రెడ్డి అన్నారు. జానయ్యను ఏ స్థాయి నుండి ఏ స్థాయికి ఎదిగాడో అందరికి తెలుసునని, బిసిలకు ఏ విధంగా రిజర్వేషన్లు కల్పించాలో జగదీష్‌రెడ్డికి తెలుసునని, మీ స్వార్థం కోసం బిసిలు అనే పదాన్ని వాడుకోవడం సరైన పద్దతి కాదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి దాత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అందరికి అవకాశాలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఆకుల లవకుశ, బత్తుల రమేష్, దొంగరి యుగందర్, రహీం, వల్దాస్ ఉపేందర్, ఎస్‌కె రఫీ, సైదులు, మోహన్, వెంకన్న, మురళి, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడితే వదిలిపెట్టే ప్రసక్తే లేదు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పేకాట ఆడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హుజూర్‌నగర్ సీఐ జి.చరమంద రాజు హెచ్చరించారు. ఆదివారం హుజూర్‌నగర్ లోని సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు మాట్లాడుతూ హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని గత ఆరు నెలల్లో 19 కేసులు పేకాట రాయుళ్ళపై నమోదు చేయడం జరిగిందని, అందులో హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ లో 3,గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 7,నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో 3,మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో 3,పాలకవీడు పోలీస్‌స్టేషన్లో 3 కలిపి మొత్తం 19 కేసులకు సంబంధించి 137 మందిని అరెస్టు చేసి వారిని బైండోవర్ చేయడం జరిగిందని తెలియజేశారు. ఆయా కేసులలో మొత్తం నగదు 1,36,750 రూపాయలను,45 బైక్‌లను,67 సెల్ ఫోన్స్‌ను స్వాధీనపర్చుకొని కోర్టుకు అప్పగించడం జరిగిందన్నారు.

## పెరిక కుల ఆత్మగౌరవ భవనం పూర్తి బాధ్యత ప్రతీ ఒక్కరిదీ

ప్రజాపక్షం/సూర్యాపేట: పెరిక కులస్తులంతా ఎక్కడ ఉన్న కలిసికట్టుగా ముందుకు సాగుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో పెరిక ఆత్మగౌరవ భవన నిర్మాణం పూర్తిచేసి మన ఐక్యతను చాటాలని తెలంగాణ రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులు మద్దా లింగయ్య అన్నారు. పెరిక సంఘం సూర్యాపేట పట్టణ నూతన కార్యవర్గ గౌరవధ్యక్షులుగా భందు వీరయ్య, అధ్యక్షులుగా పత్తిపాక వేణుధర్, సహాయ అధ్యక్షులుగా యర్రంశెట్టి రామలింగయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమిశెట్టి లింగయ్య, సంయుక్త కార్యదర్శిగా నట్టె కిరణ్, ప్రచార కార్యదర్శిగా దేవరగట్ల సతీష్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రతిభ బి ఫార్మసి కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, అంగిరేకుల నాగార్జున, ప్రతిభ బిఫార్మసి కళాశాల చైర్మన్ డాక్టర్ మిన్న శివరామకృష్ణ లు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పెరిక కులస్తుల ఆత్మగౌరవ భవనానికి భూమిని సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కులస్తులు గటిక విజయ్‌కుమార్, బాల్తూ శ్రీనివాస్, సుంకరి అనంద్, డాక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, సుందరి విజయ్‌భాస్కర్, సుంకరి అంజయ్య, వనపర్తి లక్ష్మినారాయణ, బంధు శ్రీధర్, సముద్రాల రాంబాబు, బొలిశెట్టి కృష్ణయ్య, కోట మల్లిఖార్జున్, వలిశెట్టి సత్యనారాయణ, ముత్తినేని శ్యాంసుందర్, వీరరాఘవులు, కందుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



# సన్నబియ్యం పంపిణీకి చక్కటి స్పందన



### నూతన రేషన్ కార్డుల జారితో రూ.1,151 అదనపు ఖర్చు

### పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ డి ఎస్ చౌహాన్

ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి: సన్న బియ్యం పంపిణీకి ప్రజల నుండి చక్కని స్పందన వస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ అన్నారు. అదే క్రమంలో నేడు( సోమవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరి లో నూతన రేషన్ కార్డులను పంపిణీ ప్రారంభించేందుకు నేడు సిఎం రేవంత్ రెడ్డి రానున్నడంతో ఆదివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 5,61,343 కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 27, 83,346 మంది కొత్త సభ్యులకు లబ్ధి చేకూర నుందని దీనికి గాను ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.1,151 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని తెలిపారు. రేషన్ కార్డు రాలేదని ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ లాల్ నందా మాట్లాడుతూ... జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పెద్ద ఎత్తున చేపడుతున్న ఈ మహా యజ్ఞానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నట్లు చెప్పారు. బయోమెట్రిక్ విధానం ద్వారా బియ్యం పంపిణీ పారదర్శకంగా అమలు పరుస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నర్సింహా, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమాఖ్య వ్యవస్థ విచ్ఛిన్నానికి మోదీ ప్రభుత్వం కుట్ర

### 15న జరిగే సిపిఐ నల్గొండ జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయండి : వలమల్ల ఆంజనేయులు




ప్రజాపక్షం/దేవరకొండ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నల్గొండ జిల్లా 23వ మహాసభ ఈనెల 15న కామ్రేడ్ మందడి నర్సింహారెడ్డి ప్రాంగణం సాయిరమ్య ఫంక్షన్ హాల్ ముదిగొండ రోడ్డు దేవరకొండలో నిర్వహించనున్న సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ దేవరకొండ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో జరిగిన పట్టణ శాఖ కార్యదర్శులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా రాజ్యాంగం కల్పించిన రాష్ట్ర, కేంద్ర సంబంధాలకు నెలవుగా వున్న సమాఖ్య వ్యవస్థ విచ్చిన్నానికి మోడీ ప్రభుత్వం పూనుకున్నదని రాష్ట్ర జాబితాలోని అధికారాలైన విద్య, విద్యుత్, వ్యవసాయం లాంటి అన్ని అంశాలను కేంద్రం లాగేసుకోవడంతో పాటు జిఎస్టి లాంటి కేంద్రీకృత పన్ను విధానం ద్వారా రాష్ట్రాలను ఆర్థికంగా కూడా బలహీనపరుస్తుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందని, నల్గొండ జిల్లాకు శాశ్వత కరువు నివారణలో భాగంగా చేపట్టిన ఎస్ఎల్‌బిసి సొరంగ నిర్మాణం, డిండి ఎత్తిపోతల పథకం, బి వెల్లెంల ఎత్తిపోతల, పిల్లాయిపల్లి ధర్మారెడ్డి ఫీడర్ ఛానల్స్, మైనర్ ఇరిగేషన్ పథకాలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వీటిని ప్రస్తుత ప్రభుత్వం త్వరగా పూర్తి చేయుటకు అధిక నిధులు కేటాయించి పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని ఈ మహాసభలో రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈసమావేశం పట్టణ సహాయ కార్యదర్శి జూలూరి జ్యోతిబస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు జూలూరి వెంకట్రాములు, శాఖ కార్యదర్శులు నగేష్, మైనోద్దిన్, శ్రీను, మల్లయ్య, బుచ్చయ్య, వెంకటయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

## బిసిలను సంఘటితం చేయాలి

ప్రజాపక్షం/జోగులాంగ గద్వాల ప్రతినిధి: రాష్ట్రంలోని బీసీలందరిని సంఘటితం చేస్తామని రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన బిసి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధిక బీసీ జనాభా ఉన్న రాజకీయ అవకాశాలు లేక వెనకబడి పోతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్ తేవడం అభినందనీయమని, కేంద్రంలో బిల్లు పాస్ కోసం ప్రధానిని కలిసి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో బీసీ సోదరులు ఐక్యమత్యంగా ముందుకు సాగి రానున్న స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజ్యాధికారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి బీసీ పౌరుడు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అక్కల రమా సాయిబాబా, బీసీ నాయకులు హజరయ్యారు.

## బునాదిగాని కాలువకు సాగునీటి విడుదల



ప్రజాపక్షం/బీబీనగర్ : భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాలువ మరమ్మత్తుల కారణంగా నిలిపివేసిన బునాదిగాని కాలువకు సాగునీటిని రైతులకు కోరిక మేరకు విడుదల చేశామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, జిల్లా నాయకులు పోట్రోల్ శ్యామ్ గౌడ్, ఇరిగేషన్ డిఈ లావణ్య కలిసి సాగునీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలుత కాలువ మరమ్మత్తుల కారణంగా నిలిపివేసిన సాగునీటిని రైతుల కోరిక మేరకు విడుదల చేశామని వర్షాకాలం పంటతో రైతులు సాగు చేసుకునే అవకాశం కల్పించారు. రైతులు ఏలాంటి ఆందోళనకు గురికాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, మాజీ యంపిటిసి బసవయ్య, వెంకటేశ్వర్లు, మహేందర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు

### మాజీ ఎంపి సుభాషిణి ఆలీ

ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి : భారత రాజ్యాంగం పై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి నమ్మకం లేదని అందకనే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ అన్నారు. ఆవాజ్ రాష్ట్ర3 వ మహాసభల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మక్కా మసీదు నుండి ర్యాలీ ప్రారంభించి పట్టణ పుర నిధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తేరు మైదానంలో అతికూర్ రెహమాన్ సభాధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని అందుకే, రాజ్యాంగం స్థానంలో మను స్మృతి అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఏఏ ఎన్ఆర్ సీ చట్టం వల్ల మైనార్టీ హక్కులకు భంగం కలిగిందన్నారు. సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం, ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరగాలని ఆ దిశగా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సరిత మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లు పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉందని, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించిన సంక్షేమ పథకాలు అమలుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ బహిరంగ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఎండి జబ్బార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, న్యాయవాది మధుసూదన్ బాబు, అఖిలపక్ష నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు తాహేర్, మాజీ కౌన్సిలర్ ఇషాక్ ఇక్బాల్ పాషా సుంకర ప్రభాకర్ , కుర్వ పల్లయ్య, గంజిపేట రాజు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



### పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు నగదు ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి బహుమతి

ప్రజాపక్షం/మర్రిగూడ: ప్రభుత్వ విద్యను కాపాడడానికి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి పేద విద్యార్థిని విద్యార్థులకు ఆసరాగా ఉండడానికి తాను నగదు బహుమతిని అందిస్తున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో 2024/2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థినికి రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.10వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థినికి రూ. 7500ల నగదు బహుమతిని అందించి, శాలువాతో సన్మానించి మెమెంటో అందించారు. నగదు బహుమతిని స్వయంగా అందజేయడానికి కేజీబీవీకి వెళ్లిన రాజగోపాల్ రెడ్డి కి సిబ్బంది,విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.కేజీబీవీ అంతా కలియతిరిగి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండడం సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు లేవని సిబ్బంది విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు వెంటనే తన సొంత నిధులతో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఫ్లోర్ పై నాలుగు రూములు నిర్మించి ఇస్తానని బాత్రూమ్స్ కూడా సరిపడా వెంటనే నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చి... తక్షణమే తన వ్యక్తిగత ఇంజనీర్ కు ఫోన్ చేసి రేపటినుండే నిర్మాణ పనులు మొదలుకావాలని ఆదేశించారు.తమ సమస్యను విని వెంటనే పరిష్కరిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వడానికి పోటీపడ్డారు విద్యార్థినులు.

## 42 శాతం బిసి రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:42శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం(బిసిఐఎఫ్)నల్లగొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీసీ ఇంటలెక్చువల్స్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బిసిఐఎఫ్ రాష్ట్ర చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో42 శాతం రిజర్వేషన్లకై కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, న్యాయపరమైన చిక్కులు ఎదురవ్వకుండా వెంటనే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలే కాకుండా విద్య, ఉద్యోగాలలో కూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు నకిరేకంటి కాశయ్య గౌడ్, దొమ్మాటి అంజయ్య ప్రజాపతి, చామల చంద్రశేఖర్, ఆమంచి అంజయ్య, కంచనపల్లి షణ్ముఖాచారి, సిరసవాడ చంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : పేదోడి సోంతింటి కల కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం మండలంలోని 26 గ్రామాలలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్నందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెలే వీరేశం తెలిపారు. కాంగ్రెస్ హయంలోనే పేదలకు సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేసి ఇళ్లు లేని నిరుపేదల కోసం ఇల్లు కట్టించి పేదోడిని ఇంటి యాజమాని చేయడం చాలా సంతోషకరమని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# టెండర్ ప్రక్రియలో అధికారులు గోల్‌మాల్?

### రాగి ప్రతిమల టెండర్‌లో అవకతవకలు

### ప్రకటనలో కొన్ని వివరాలు ప్రచురించిన వైనం

### సెలవు రోజు టెండర్ నిర్వహించిన అధికారులు మైక్, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయని అధికారులు

### చర్యలపై ఇఒ అనుమతి కోసం వెయిటింగ్



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో టెండర్ల ప్రక్రియలో అధికారులు జిమ్మిక్కులు ప్రదర్శించారు. టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చా యి. గత నెల 30న ఓ దిన పత్రికలో ప్రచురితమైన టెండర్ ప్రకటనలో భక్తులకు సందేహాలు ఉన్నాయి. వారాంతపు సెలవు బుధవారం రోజని కనీసం ఫోన్లు లిఫ్ట్ చేయని అధికారులు ఏకంగా టెండర్ నిర్వహించడం ఎవరి ప్రయోజనం కోసమని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల తీరుపై సందేహాలు**

కొండకింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తులకు అందివ్వనున్న వ్రతాల్లో దేవస్థానం 12 గ్రాముల స్వామి రాగి ప్రతిమలు (రాగి విగ్రహం) అందజేసేందుకు రూ. 800 టికెట్టు రూ. 200 కలిపి రూ. 1,000లకు పెంచనున్నారు. వ్రత టికెట్టు పొందిన భక్తులకు ప్రతిమలు ఇచ్చేందుకు ఈవో నిర్ణయించారు. వీటి కోసం టెండర్ నిర్వహించేందుకు భక్తులకు పూర్తి స్థాయిలో సమాచారం అందకపోయే సరికి అవకతవకలు జరిగినట్లు అధికారులు పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ నిబంధనలకు భిన్నంగా తేదీ, సమయం, ప్రదేశం ప్రకటించకుండానే వారాంతపు సెలవు రోజు వేలం పాట ప్రక్రియను పూర్తి చేశారు. దీనిపై స్థానిక భక్తుల్లో అధికారులు అవినీతికి పాల్పడినట్లు సందేహాలు బలపడుతున్నాయి.

**ఎందుకు ప్రచారం చేయలేదు**

గతంలో టెండర్లు బహిరంగ ప్రకటన విడుదల చేసి, రెండు రోజుల ముందు నుంచే మైక్ లో అనౌన్స్ మెంట్, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం, అధికారుల స్టేటస్ ద్వారానైన ప్రచారం నిర్వహించేవారు. ఆ సాంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చి గతానికి భిన్నంగా అవి ఏవి లేకుండా అధికారులు వ్యవహరించడంతో స్థానికంగా పెద్ద దుమారమే రేగింది.

**రహస్యం ఎందుకో?**

కానీ, ఎలాంటి ఆర్భాటం లేకుండా, ప్రచారం చేపట్టకుండా అధికారులు రహస్యంగా టెండర్ల నిర్వాహించడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు కడిగిన ముత్యం అయితే వారాంతపు సెలవు రోజున ఎందుకు టెండర్ నిర్వహించరో నని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కిడమే కాక అధికారుల సొంత లాభాపేక్షతో దేవస్థానానికి ఆర్థిక నష్టం కలిగే విధంగా టెండర్ల ప్రక్రియలో గోప్యతను పాటించడం పట్ల సందేహాలు బలపడుతున్నాయి.

**అధికారులపై చర్యలకు డిమాండ్**

టెండర్ల ప్రక్రియలో దేవస్థానం అధికారుల కుమ్మక్కు అయినట్లు స్పష్టమవుతోందని స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈవో అనుమతి కోసం ఫైల్ వెయిటింగ్ లో ఉంది. తక్షణమే జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి టెండర్ ప్రక్రియను రద్దు చేసి తప్పుదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## దమ్మపేట ఆర్టీసి బస్టాండ్ పరిరక్షణకు ఆమరణ నిరాహార దీక్ష

దమ్మపేట ఆర్టీసి బస్టాండ్ పరిరక్షణ కమిటీ

**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేటలో బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థులు 14 రోజుల నుంచి రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఏ ఒక్క అధికారికి స్పందన లేదని, బస్టాండ్ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం అని ప్రభుత్వ యంత్రాంగం, ఆర్టీసి యాజమాన్యం 48 గంటలలో స్పందించకుంటే జులై 15 మంగళవారం ఉదయం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటాం అని బస్టాండ్ పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు.
14 రోజుల నుంచి రిలే నిరాహార దీక్ష చేస్తున్న అధికారులకు ఎందుకు స్పందన లేదు ..? బస్టాండ్‌లో నిర్మించే పెట్రోల్ బంక్‌ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, ప్రజలకు అనుకూలంగా బస్టాండ్‌ని అభివృద్ధి చేయాలి, మా ప్రాణం పోయినా సరే వెనక్కి తగ్గేదే లేదు అన్నారు.

## గుంపెళ్ళగూడెంలో ఘనంగా బోనాలు




**ప్రజాపక్షం/కారేపల్లి :** బోనాలు తెలంగాణలో ముఖ్యమైన హిందూ పండుగ, సాధారణంగా జూలై, ఆగస్టులలో ప్రతి ఆదివారం ఉత్సవాలు జరుగుతాయి. గ్రామాలలో వ్యాధులు, విపత్తుల నుండి రక్షించినందుకు బోనాలు అమ్మవారికి సమర్పిస్తారు. మండల పరిధిలోని గుంపెళ్ళగూడెంలో ఆదివారం బోనాలు అమ్మవారికి ఘనంగా సమర్పించారు. మహిళలు కొత్త మట్టి కుండలలో "బోనం"(పాలు, బెల్లంతో వండిన బియ్యం)అనే ప్రత్యేక వంటకాన్ని తయారుచేసి, వాటిని వేప ఆకులు, పుసుపు, సింధూరంతో అలంకరించి, దేవతకు నైవేద్యం పెట్టారు. ఉత్సాహ భరితమైన ఊరేగింపులు, సాంప్రదాయ నృత్యాలు, డిజె పాటలతో దేవతకు ఆహారం, గాజులు, చీరలను నైవేద్యంగా అందజేశారు. బోనాలు ప్రజలను ఒకచోట చేర్చి, సామాజిక సామరస్యాన్ని, వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని గ్రామ పెద్దలు చెబుతున్నారు.



## శేషజీవితం సుఖంగా గడపాలి

ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ :** చిన్ననాటి స్నేహితుడు మల్లెల వీరనారాయణ శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని ఎంఎల్ఎ, సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. కెటిపిఎస్ కర్మాగారంలో 35 సంవత్సరాల పాటుగా సేవలను అందించిన మల్లెల వీరనారాయణ పదవీ విరమణ, షష్టిపూర్తి వేడుకలు పాల్వంచలో ఆదివారం ఘనంగా జరిగాయి. హాజరైన కూనంనేని వీరనారాయణ దంపతులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలు మునిగితేలి పదవీ విరమణ పొందడం వయస్సుకు సరైందే అయినా ఇన్నాళ్లపాటు నిత్యం పనిగంటల సమయానికి చకచకా రెడీ అయ్యి వెళ్లే అలవాటు ఉండటం వల్ల ఇంటి వద్ద కాలు ఆగే పరిస్థితి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఎస్‌కే. లాల్‌పాషా, పలు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సుజాతనగర్ సిపిఐ మండల కార్యదర్శిగా కోమరి హనుమంతరావు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** సుజాతనగర్ 4వ మండల మహాసభ సుజాతనగర్ మండలములోని సీతంపేట బంజారలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సుజాతనగర్ మండల కార్యదర్శిగా కోమరి హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా లావుడియా గోపి, తాళ్లూరు ధర్మారావు, కోశాధికారిగా మూడు గణేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా 24 మంది, మండల కౌన్సిల్ సభ్యులుగా 92 మంది ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పజెప్పినందుకు ధన్యవాదములు తెలిపారు. నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ సిపిఐ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.




## తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు

**ప్రజాపక్షం/భద్రాచలం :** తపాలాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు స్థానిక శాసనసభ్యుడు డా.తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం గుప్తా కన్వెన్షన్ హాల్లో జరిగిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్ ఐ 5వ ద్వైవార్షిక మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నవారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలో అర్హత కలిగిన వారికి అందించే విధంగా కృషిచేస్తామని చెప్పారు. అనంతం విశిష్ట అతిథిగా విచ్చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వి వీరభద్ర స్వామి మాట్లాడుతూ తపాలా శాఖలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉద్యోగులు తమ ఆలోచనా విధానాలను మార్చుకుని తపాలాశాఖ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సిరాజుద్దీన్ రాంకుమార్, మోహన్‌రెడ్డి, పమ్మి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రమేష్ నాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో బైక్ డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం..అతివేగంతో ర్యాపిడో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఖమ్మంరూరల్ మండలంలోని చింతపల్లిలోని ఖమ్మం—వరంగల్ జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...తిరుమలాయపాలెం మండలం, చంద్రుతండాకు చెందిన బానోత్ వీరకుమార్, ర్యాపిడో డ్రైవింగ్ కోసం ఖమ్మం నగరానికి వెళ్లాడు. అది ముగిసిన అనంతరం బైక్‌పై ఇంటికి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న AP39U0007 నెంబర్ గల లారీ డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. భార్య అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ ముష్కరాజు తెలిపారు.

## ఆటో డ్రైవర్లకు రూ.12,000లు ఆర్థిక సహాయం వెంటనే అందించాలి

**ప్రజాపక్షం/కరకగూడెం :** గత ఎన్నికలలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు రూ. 12000లు ఆర్థిక సహాయం ఇస్తానని ప్రకటించి అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఇవ్వకపోవడం వలన ఆటో డ్రైవర్ల బతుకులు చితికిపోతున్నాయని కరకగూడెం ఆటో యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్థిక సాయం విడుదల చేయకపోవడం వలన ఆటో డ్రైవర్ల జీవనం అస్తవ్యస్తం అయి కుటుంబం గడవటం కష్టతరంగా మారిందని వెంటనే ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న రూ. 12 వేలు చెల్లించాలని కరకగూడెం ఆటో యూనియన్ అధ్యక్షులు కొమరం సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిట్టా సౌందర్యరావు, సాధనపల్లి లక్ష్మీ నారాయణ, గుడ్ల రంజిత్‌కుమార్, సాయి చరణ్, కాట సాంబశివరావు, తోట మధు, కొమరం స్వామి, భుక్యా కుమార్, ముత్యాల మధు, మహ్మద్ దావుద్, నిట్టా సంతోష్, తోట శివ, కడాలి అనిల్‌కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### 3.54లక్షల కుటుంబాలకు

# నేడు రేషన్ కార్డుల పంపిణీ

పదేళ్లలో ఒక్క కార్డు కూడా ఇవ్వకుండా కాలయాపన చేసిన బిఆర్ఎస్

జోడెడ్లలా అభివృద్ధి, సంక్షేమం

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 3.54లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల పంపిణీ సోమవారం సిఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలో ఆదివారం పర్యటించారు. మండలంలోని సుర్దేపల్లి నుంచి బోదులబండ వరకు తాగునీటి పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కోనాయిగూడెంలో సిసి రోడ్లుకు, మంగాపురంతండాలో బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గత పాలకులు పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడ ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా నడిపిస్తుందని అన్నారు. ఎన్నికల ముందు చెప్పినవాటిని అమలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. నాలుగు విడతలలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు.
ప్రభుత్వం ఏర్పడిన తరువాత అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. అనాటి ప్రభుత్వం 'వరి వేస్తే ఉరి' అంటే ఇందిరమ్మ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేసిందని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో మంచి వర్షాలు పడ్డాయన్నారు. కృష్ణా జలాలు కూడ త్వరలోనే వస్తాయని పేర్కొన్నారు. ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా సిఎం ప్రకటించిన సంకల్పాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు తాగునీటి ప్రాజెక్టులను వేగంగా అమలు చేస్తుందని అన్నారు.
మండలం లో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, అంజిని, రావెళ్ల కృష్ణారావు, బోయిన వేణు, బచ్చలకూరి నాగరాజు, గుండా బ్రహ్మం, యడవల్లి నాగరాజు, రాయపూడి నవీన్, పెంటమళ్ల పుల్లమ్మ, బొందయ్య, కొమ్మినేని పుష్పావతి, పాకనాటి కన్నారెడ్డి, కడియాల నరేష్. గరిడేపల్లి రామారావు, కొమ్మినేని విజయ్బాబు, కొచ్చేర్ల శ్రీనివాస రావు, సూరపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## నూరు ఏండ్ల చరిత్ర సిపిఐ

ప్రజా శ్రేయస్సే పరమావధి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం పట్టణంలోని 18వ వార్డు నందు ఆదివారం శాఖ మహాసభను నిర్వహించారు. వార్డు మాజీ కౌన్సిలర్ చారి అధ్యక్షతలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గెద్దాడ నగేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ, శ్రామిక, కర్షక వర్గానికి సిపిఐ జెండా ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తీర్చడంలో ముందు ఉంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడుతూ శ్రామికవర్గానికి ఎల్లవేళలా తోడ్పడుతున్నారని అన్నారు. కార్మిక సమస్యలు తీర్చడంలో ఎన్నో పోరాటాలు చేసిన పార్టీ సిపిఐ అని అన్నారు. అనునిత్యం ప్రజల మధ్యనే ఉండి ప్రజా సమస్యలను తీర్చడంలో ముందుండే మంచి నాయకత్వాన్ని కలిగిన పార్టీ అని గుర్తుచేశారు. నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీకి పేరు ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన శాఖ కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా ఉమ్మాల శంకర్ సహాయ కార్యదర్శులుగా చాంద్ సతీష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మైలారం బాలరాజులతో పాటుగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ కౌన్సిలర్ మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, పోలిశెట్టి రమేష్, సారంగపాణి, శేఖర్, సదానందం, శ్రీను, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిల్వర్ మెడల్ సాధించిన మల్లెమడుగు పాఠశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని మల్లెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అనిత, నవ్యశ్రీ రాష్ట్రస్థాయి పుట్‌బాల్ జూనియర్ చాంపియన్‌సిప్‌లో సిల్వర్ మెడల్‌ను సాధించారు. వీరు ఖమ్మం ఉమ్మడి జిల్లా టీం నుంచి ఎంపికై జూలై 9, 12 వరకు మంచిర్యాల జిల్లా, రామకృష్ణాపురం ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో పాల్గొని ప్రతిభను చూపించారు. విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి శైలజ, ప్రధానోపాధ్యాయిని జి.కృష్ణవేణి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షుడు అలివేలు, 59,60 డివిజన్ల కార్పొరేటర్లు లలితరాణి, నిరంజన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు విడుదల

ఎమ్మెల్యే జారే





**ప్రజాపక్షం/ములకలపల్లి :** మండల పరిధిలోని పూసుగూడెం సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ పంపుల ద్వారా దిగువ ప్రాంతాలైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులకు వ్యవసాయ అవసరాల కోసం సాగునీటిని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ విడుదలచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కష్టాన్ని ప్రభుత్వం అర్థం చేసుకుంటూ ప్రతి ఎకరం పండాలని ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి అవసరాలను తీర్చేందుకు తక్షణమే చర్యలు తీసుకుని దిగువకు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారే**

మండల పరిధిలోని పూసుగూడెం పంపు హౌస్‌ల నుండి దిగువకు ఎంఎల్ఏ జారే ఆదినారాయణ సాగునీరు విడుదల చేశారు. అనంతరం మండల కేంద్రంలో దీప దూప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ హైదరాబాద్‌లో రేపటి నుండి 16వ తారీకు వరకు నిర్వహించే పంచకుండాత్మక చండీ కుబేర పాశుపతయాగ ఆహ్వాన పత్రికను ఎంఎల్ఏకి అందజేశారు. అనంతరం రాజుపేట కాలనీలో నంద్యాల వారి పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.
దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామంలో చుట్టూరి సీతారాములు రేకుల ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంతో కాలిపోగా ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## ఏకగ్రీవంగా సిపిఐ పట్టణ కమిటీ ఎన్నిక

కార్యదర్శిగా అడుసుమిల్లి సాయిబాబా

సహాయ కార్యదర్శిగా ఉప్పుశెట్టి రాహుల్



**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ పార్టీ పాల్వంచ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. స్థానిక లారీ అసోసియేషన్ హాల్‌లో 19వ పట్టణ మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలు, అంశాలపై చర్చించారు. డిమాండ్‌ల సాధన కోసం తీర్మానాలు చేశారు. కార్యదర్శి, సహాయ కార్యదర్శులతో పాటు 21 మందితో కార్యవర్గం, 91మందితో కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ పాల్వంచ పట్టణంలోని సిపిఐ విస్తరణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. శాఖ సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ కాలనీల్లోని సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదల దరి చేరేవేసేందుకు తమవంతు పాత్ర పోషిస్తామని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారితో మమేకమై ముందుకు సాగుతామని చెప్పారు

## త్వరలో పెన్షనర్ల బకాయిలు చెల్లింపు

మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం :** మార్చి 2024 నుండి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన చెల్లింపుల ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024 నుండి ఉద్యోగ విరమణ చేస్తున్న పెన్షనర్ల బకాయిలపై ఆదివారం ఎసిజిపిఎటి జిల్లా కమిటీ మంత్రికి విజ్ఞాపనను అందజేశారు. దీనిపై స్పందించిన తుమ్మల ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యని, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతాక్రమంలో పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా యూనిట్ అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ నేతృత్వంలో వీరభద్రరావు, మేరి ఏసుపాదం, రహీముద్దీన్, నారాయణ, ప్రసాదరావు, నాగరాజు, నాగప్రసాద్, హమీద్, భాస్కరా చారి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిఎం దృష్టికి జర్నలిస్ట్‌ల ఇళ్లస్థలాల సమస్య

వాస్తవాలను ప్రజలకు అందించాలి

విలువలు పాటించి వృత్తి గౌరవాన్ని పెంచుకోవాలి

టియుడబ్ల్యుజె(ఐజెయు) నగర మహాసభలో మంత్రి తుమ్మల




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం నగర మహాసభ ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నగర అధ్యక్షుడు మైసా పాపారావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించకుండా చేసే బాధ్యత జర్నలిస్టులకుందన్నారు. తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో జర్నలిస్ట్‌లతో తనకెంతో అనుబంధం ఉందన్నారు. కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సిఎంను కలిసి వివరాలు తెలియజేసి సమస్య పరిష్కరిస్తానన్నారు.

**ప్రభుత్వ బీమా పథకంలో జర్నలిస్టులను చేర్చండి : రాంనారాయణ**

ప్రభుత్వ బీమా పథకంలో జర్నిలిస్టులను చేర్చాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ కోరారు. నగర మహాసభలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుకు ఖమ్మం ఇళ్లస్థలాల జిఓకు సంబంధం లేదన్నారు. హెల్త్‌కార్డులు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అక్రిడేషన్లు త్వరితగతిన ఇవ్వాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నియంత్రించాలని కోరారు. ఈ మహాసభలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, టియూడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సామినేని మురారి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకుడు సర్వనేని వెంకట్రావ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, కోశాధికారి శివానంద, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి కనకం సైదులు, సినియర్ జర్నలిస్టు నలజాల వెంకట్రావ్, కెమెరామెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలస్యం అప్పారావు, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కమతం శ్రీనివాస్, డెస్క్ జర్నలిస్టు అధ్యక్షుడు కొమ్మినేని ప్రసాదరావు, సినియర్ జర్నలిస్టులు భూపాల్, మహేందర్, మొహినుద్దిన్, నామా పురుషోత్తం, పసుపులేటి సత్యనారాయణ, పర్సా వెంకటేశ్వర రావు, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.
తొలుత రాష్ట్ర గీతాన్ని ఆలపించి మహాసభను ప్రారంభించగా, కనకం సైదులు సంతాప తీర్మానం ప్రవేశపెట్టి అమరులైన జర్నలిస్టులకు నివాళులర్పించారు. నగర కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్ అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

**సమస్యలపై తుమ్మలకు వినతులు..**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు ఈ మహాసభలో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వనం వెకంటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల నిమిత్తం గత ప్రభుత్వం కేటాయించిన భూమిని స్థంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీకి అప్పగించాలని, అదేవిధంగా హైదరాబాద్ నిమ్స్ అసుపత్రిలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా మీడియా పిఆర్‌ఓ, లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

**ఖమ్మం నగర కమిటీ ఎన్నిక..**

టియుడబ్ల్యుజె (ఐజెయు) ఖమ్మం నగర కమిటీని ఈ మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకుపల్లి శ్రీనివాసరావు (సూర్య), ప్రధానకార్యదర్శిగా నంచర్ల జనార్థనాచారి (నవభూమి), కోశాధికారిగా ఏలూరు వేణుగోపాల్ (న్యూస్ భూమ్) ఎన్నికయ్యారు.

**ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక..**

టియుడబ్ల్యుజె (ఐజెయు) అనుబంధ ఖమ్మం ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని ఈ మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నామా పురుషోత్తం (మనం), ప్రధాన కార్యదర్శిగా శీలం శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ), కోశాధికారిగా కళ్యాణ్ చక్రవర్తి (ముద్ర) ఎన్నికయ్యారు.

**ఎలక్ట్రానిక్ మీడియా నగరకమిటీ ఎన్నిక..**

ఎలక్ట్రానిక్ మీడియా నగరకమిటీని ఈ మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండ్ల రాంబాబు (10 టివి), ప్రధానకార్యదర్శిగా కారుమంచి శ్రీనివాస్ (సాక్షిటివి), కోశాధికారిగా వందనపు ఉమేష్ (స్టూడియో ఎన్) ఎన్నికైయ్యారు.




## రోటరీ క్లబ్ కొత్తగూడెం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అధ్యక్షుడిగా రవికుమార్

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో 40వ నూతన కార్యవర్గం స్థానిక ఐఎంఎ హాల్ నందు ఆదివారం నాడు ప్రమాణ స్వీకారోత్సవము ఘనంగా నిర్వహించడం జరిగింది. 40వ నూతన అధ్యక్షుడిగా జక్కుల రవికుమార్ ప్రమాణస్వీకారం చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ తాళ్ళ రాజశేఖర్ రెడ్డి, సంజీ వరావు పాల్గొని రోటరీ కబ్ నూతన అధ్యక్షులు సభ్యుల తో ప్రమాణ స్వీకార చేయించారు. కొత్తూరు సంజీవరావు మాట్లాడుతూ, రోటరీ క్లబ్ సేవలు అభినందనయం అని కొనియాడారు. అసిస్టెంట్ గవర్నర్ మహాలక్ష్మి కొత్త సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి క్లబ్‌లోకి ఆహ్వానించినారు. కొత్తగూడెం రోటరీ క్లబ్ అగ్రస్థానంలో ఉందని రోటరీ లింబ్ సెంటర్ ద్వారా కృత్రిమ పాదాలు అందించడము ద్వారా సమాజానికి సేవ చేస్తున్నారని అదేవిధంగా రాబోయే కాలంలో కొత్త ప్రాజెక్టులను తీసుకు వచ్చి ప్రజలకు మరింత సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతన సెక్రటరీ శ్రీరామనేని చలపతిరావు, పిడిజి అబ్రహం, క్లబ్ ట్రైనర్ ఆనంద్ కుమార్ అడ్వైజర్ అంకం పాపయ్య, సిరిమల్ల సత్యనారాయణ, డాక్టర్ ప్రసన్నకుమార్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు సుజాత, దుర్గారాణి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నర్సంపేట పట్టణ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ నర్సంపేట :** కాంగ్రెస్ పార్టీ నర్సంపేట పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నిక చేశారు. పట్టణ అధ్యక్షుడిగా బత్తిని రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గాబొబ్బల రమణ రెడ్డి, మాదాసి రవి, పంబి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులుగా కొర్ర శోభన్ బాబు, దేవండ్ల రాంబాబు, వేముల సారంగం గౌడ్, కొంపెల్లి విజయేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి బైరి మురళి, కార్యదర్శులుగా మోటం రవి, నాంపెల్లి వెంకటేశ్వర్లు, చిప్ప నాగ, గిరగాని రమేష్, పిన్నింటి కిరణ్ కుమార్ రెడ్డి, కోశాదికారిగా లోడే రాజు, కార్యవర్గ సభ్యులుగా బూస నర్సింహ రాములు, నిమ్మనబోయిన శ్రీనివాస్, తాళ్లపెల్లి శ్రీ నివాస్ గౌడ్, గంధం తిరుమలేష్, జన్ను మురళి, పసునూరి రాజు, బైరగోని రాజ్‌కుమార్, ఖాసిమ్, దూపాటి కుమారస్వామి, ముత్తు రాథోడ్, సిరంశెట్టి రాజు, దూసం కర్ణాకర్, ప్రచార కార్యదర్శులుగా కొయ్యాడి సంపత్, బిట్ల మనోహర్, సోషల్ మీడియాఇన్‌చార్జ్‌గా వరంగంటి విక్రమ్‌సాయిలను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

# బోరు మోటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీవాసుల సౌకర్యార్థం కోసంలో రూ.3 లక్షల వ్యయంతో కొత్తగా ఏర్పాటు బోరు మోటారును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీలో ఉన్న సమస్యను తీ ర్చడానికి మూడు లక్షల వ్యయంతో బోరు మోటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 30 వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంట నే పరిష్కరిస్తామని ఈ సందర్భంగాఎమ్మెల్యేతెలిపారు.

# సిఎంను కలిసిన రాష్ట్ర బిసి కమిషన్ మెంబర్ బాల లక్ష్మి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** సిఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర బిసి కమిషన్ మెంబర్ బాల లక్ష్మి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర బిసి కమిషన్ మెంబర్ బాల లక్ష్మి సిఎం నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

# గ్రామపంచాయతీ ఉద్యోగుల జెఎసి కమిటీ ఎన్నిక

### జిల్లా అధ్యక్షుడిగా అనుసనూరు రాజా వీరు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల జెఎసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీని ఆదివారం భూపాలపల్లిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రా మ పంచాయతీ ఉద్యోగుల సంఘం జెఎసి జిల్లా అ ధ్యక్షుడిగా అనుసనూరు రాజా వీరు, ఉపాధ్యక్షుడి గా చిట్యాల శశి కుమార్, జాలిగాపు శ్రీకాంత్, ప్ర ధాన కార్యదర్శిగా మూషిక రమేష్, సహాయ కార్యదర్శిలుగా యుగేందర్, ర మేష్, కోశాధికారిగా అంకం సదానందం, సహాయ కోశాధికారి తిరుపతి లను ఎన్నుకున్నారు. అదే విధంగా గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ ముత్తిలిక్, రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగాదోమల శ్రీనివాస్‌లనుఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

# విలక్షణ నటుడు కోట శ్రీనివాస్ రావు మరణం తీరని లోటు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రముఖ సినీ నటులు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమ కు తీరని లోటు అని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు కామిడి సతీష్ రెడ్డి అన్నారు. కోట శ్రీనివాసరావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారని, తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారని ఆయన మరణం తెలుగు సినీ రంగానికి తీరనిలోటు అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని సతీష్ రెడ్డి తెలిపారు.

# నంది అవార్డు అందుకున్న రాగుల సారయ్య, జాజాల బాలయ్య



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** నియోజకవర్గంలోని మద్దూర్ మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన రాగుల సారయ్యకి త్యాగరాయ గానసభ హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ఇండియన్ కల్చర్ నేతృత్వంలో నిర్వహించిన తెలుగు ఇండియన్ కల్చర్ నేతృత్వంలో ప్రతిభ కనబరిచినందుకు నందమూరి తారకరామారావు, పి వి నరసింహారావు జయంతి ఉత్సవాలు 2025 సంవత్సర్భంగా ఒగ్గు కళారంగంలో అందిస్తున్న విశిష్టమైన సేవలకు గుర్తుగా ఇరుముల రవి, బాజాల బాలయ్యలకు నంది అవార్డు, ప్రశంసా పత్రం అందించారు. దైవజ్ఞ శర్మ, కృష్ణ, మోహన్‌రావు, భాస్కర్‌రావులు అవార్డు గ్రహితలు ఇరుముల రవి, బాలయ్యలను శాలువాలతో సత్కరించి అవార్డు అందించారు.


# స్థిరమైన అభివృద్ధి దిశగా జనగామ జిల్లా పురోగమనం




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రాష్ట్రంలో అతిచిన్న, తక్కువ అటవీప్రాంతం కలిగిన జిల్లాల్లో ఒకటైన జనగామ జిల్లా ఉత్తమ నాయకత్వం, సామూహిక శ్రమతో గొప్ప మార్పులకు నాంది చెబుతోంది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శ్రద్ధా భరిత, ధృడమైన నాయకత్వంలో ఈ జిల్లా స్థిరమైన అభివృద్ధి దిశగా క్రమంగా ముందుకు సాగుతోంది. మన జిల్లామన నీరు కార్యకరలో భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా ఇంకుడు గుంతలు నిర్మించడం జరుగుతుంది. ప్రజారోగ్యం, పరిశుభ్రత అనే అంశంపై కూడా ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చిన్న వయసు కలిగిన ఈ జిల్లా ఆచరణలో పెద్ద మార్పుకు నాంది చెబుతోంది. ఎన్ఎస్‌పివిలో ఉత్సాహంగా పాల్గొంటున్న రాష్ట్రాలలో మన రాష్ట్రం దేశంలో రెండవ స్థానం ఉండగా జనగామ జిల్లా రాష్ట్ర స్థాయిలో నాలుగవ స్థానంలో ఉందని ఆదివారం మూడవ స్థానంలోకి వచ్చిందన్నారు. ప్రజలందరు కలిసి ధృడ సంకల్పంతో ముందడుగు వేస్తే ఆగష్టు 21వ తేదీ వరకు ఈ పోటీలలో మొదటి స్థానం సాధించడం అసాధ్యమేమీ కాదు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/చిట్యాల:** భూపాలపల్లి నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు అసలైన లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తున్నామని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం చిట్యాల మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మొత్తం 14 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భూపాలపల్లిలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అప్పం కిషన్, తిరుమలాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గజ్జి రవి, ప్రధాన కార్యదర్శి గోలకొండ మహేష్, ఎలగొండ చిరంజీవి, నాయకులు కొత్తపల్లి రాం చంద్ర మూర్తి, గోపగాని చిన్న వెంకటేశ్వర్లు, బాలుగ నీలేష్, జన్నె ఓదెలు, కొర్రి అశోక్, గద్దల భద్రయ్య, తిరుపతి, రాజు, సాంబయ్య, రాజేశ్వరి, రజిత, కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**ప్రజాపక్షం /వరంగల్ ప్రతినిధి :** యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో యూరియా నిల్వలు, సరఫరా, రైతులకు అందుబాటు వంటి అంశాలపై వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీజన్లో రైతులకు అవసరమైన పరిమాణంలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా యూరియా నిల్వలు డిమాండ్ సరఫరా వివరాలను సమగ్రంగా విశ్లేషించి సమయానికి ఎరువులు అందేలా చూడాలని అధికారులను సూచించారు. అలాగే నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేలా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ అంశం లో వ్యవసాయ శాఖ అధికారులు ముందుండి పని చేయాలన్నారు. రైతులు ఎరువుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా సరిపడా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈపాస్ విధానం ద్వారానే యూరియా సరఫరా చేయాలన్నారు. యూరియా సరఫరా నివేదిక ప్రతిరోజు సమర్పించాలన్నారు. యూరియా సరఫరా సజావుగా జరుగుటకు గ్రామాల వారిగా మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రైతులను రద్దీ తగ్గించుటకు ముందుగానే టోకెన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సంబంధిత అధికారులు తరచుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి ఇన్చార్జ్, జిల్లా ఉద్యానవనాధికారి శ్రీనివాస రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల ఉద్యానవనాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కళాశాలలో ఎస్‌సి సెల్ అర్హత పరీక్ష ప్రశాంతం



**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** రాష్ట్ర ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు కాను ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ విద్యార్థుల ఎంపిక కోసం ఆదివారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఈ పరీక్షకు 440 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, ఈ పరీక్ష ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అర్హత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత భోజన వసతితో పాటు సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని షెడ్యూల్ కులాల సెల్ ప్రాంతీయ అధికారి డాక్టర్ జగన్ వివరించారు. పరీక్షలను పరిశీలించిన వారిలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి బి నిర్మల, కళాశాల పరీక్షలను నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రమాదేవి పాల్గొన్నారు

# బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దు

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** అత్యాశ, అవగాహన లేకపోవడమే సైబర్ నేరాలు పెరుగుతున్నాయని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తత, అవగాహన కలిగిఉండటం అవసరమని ఆదివారం ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు డిజిటల్ అరెస్ట్ అనగానే భయపడవద్దని, నిర్భయంగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే యువత బెట్టింగ్ యాప్ ల జోలికి వెళ్ళవద్దని ఎస్పీ హెచ్చరించారు. అంతేకాకుండా సోషల్ మీడియా ద్వారా వచ్చే లింకులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ మధ్య కాలంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు నకిలీ పీఎం కిసాన్, ఎస్బిఐ, రివార్డ్ అనే ఏపీకే ఫైల్స్ వాట్సాప్ తెలంగాణ, సోషల్ మీడియా ద్వారా పంపిస్తున్నారని, పొరపాటున ఇలాంటి లింక్స్ క్లిక్ చేసి అప్లికేషన్ ఇన్స్టాల్ చేశారంటే మీ ఫోన్ హ్యాక్ అయి వినియోగదారుడి ఫోన్ లో గల ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత వివరాలు చోరికి గురై సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళతాయని, ఆపై బాధితుడి వాట్సాప్ ఖాతాను హైజాక్ చేసి, అదే నకిలీ లింక్ ను అతని ఫోన్ లో ఉన్న కాంటాక్ట్స్ లకు ఆటోమేటిక్ గా పంపిస్తుందనీ, ఈ మోసాల ద్వారా బాధితులు ఆర్థిక నష్టాలు, డేటా చోరికి గురవుతారని, ఇలాంటి నకిలీ ఫైల్స్ మోసాల బారిన పడకుండ ఉండాలంటే ప్రజలు వాట్సాప్ లో లో అనుమానస్పద లింక్ లను క్లిక్ చేయరాదని అన్నారు. ఇలాంటి పీఎం కిసాన్ యోజన, రివార్డ్ పేరుతో లింక్స్ వచ్చినప్పుడు వాటిని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు లేదా ఓటిపిలు ఎవరితోనూ షేర్ చేయకుండా ఉండాలని తెలిపారు. ఈలాంటి సమాచారం ప్రభుత్వ సంస్థలు అడగవని, ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబరు కు కాల్ చేసి రిపోర్ట్ చేయాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.

# అమెరికా స్వప్రయోజనాల కోసమే యుద్ధాలు

### జస్టిస్ చంద్రకుమార్




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అమెరికన్ సామ్రాజ్యవాదుల స్వ ప్రయోజనాల కోసమే కోసమే ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను ప్రేరేపిస్తున్నారని యుద్ధాలతో మానవ సమాజానికి తీవ్ర హానికరమ ని జస్టిస్ చంద్రకుమార్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి జేవి చలపతిరావు, సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డిఎఫ్) ఆధ్వర్యంలో యుద్ధాలు ఎవరికోసం అనే అంశంపై రాష్ట్ర సదస్సు ఆదివారం టిఎస్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి అధ్యక్షతన వరంగల్ పోచం మై దాన్‌లోని అబ్నూస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ ప్రపంచ దే శాలపై పెత్తనం చెలాయించడానికి, దోచుకోవడానికి అమెరికా శక్తి వంచన లేకుండా యుద్ధాలను ప్రోత్సహిస్తున్నదని, ఈ క్రమంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు, వెనుకబడి న దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. ఈ యుద్ధాలు మానవ సమాజంపై తీవ్ర ప్ర భావం చూపించి పర్యావరణం దెబ్బతిని, ఆర్థికంగానే కాకా వేలాదిమంది ప్రాణ నష్టాలతో భవిష్యత్తు లేకుండా చేస్తున్నాయన్నారు. ఇప్పటికే గాజా, ఇరాన్, పాలస్తీనా ఇతర కొన్ని దేశాలు యుద్ధాల వల్ల కోలుకోని విధంగా దెబ్బతిన్నాయన్నారు. అభం శుభం తెలియని పసికూనలు మహిళలు సైతం ప్రాణాలు కో ల్పోయారని, అమెరికా కనీస మానవత్వం లేకుండా విలువలు కోల్పోయి వ్యవహరిస్తున్నదని, అలాంటి అమెరికాకు భారత పాలకులు వత్తాసు పలకడం సిగ్గుచేటని, పాకిస్తాన్ తో సయోధ్య కుదుర్చామని గొప్పలు చెబుతున్న ట్రంప్ ఆచరణలో ఇతర దేశాల మధ్య చిచ్చు ఎందుకు ఆర్పటం లేదన్నారు. అమెరికా ట్రంప్ ఆడేవి అన్ని నాటకాలేనని అంతా తెలిసిన మోదీ ప్రభుత్వం మాత్రం మన స్వప్రయోజనాలను మాని అమెరికా ప్రయోజనాల కోసం కార్పొరేట్ వ్య క్తుల కోసం సాగిలపడడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా అలాంటి పద్ధతులను మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కే విశ్వనాథ్, గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఉమ్మడి జిల్లా నాయకులు నున్న అప్పారావు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఆర్ఎస్‌పికౌడగాని శివాజీ, ఇనాం రాష్ట్ర నాయకులు మహమ్మద్ అబ్దుల్ నబీజుబేర్, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగల రాగసుధ తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్‌క్లబ్‌లో మెగా హెల్త్ క్యాంపు సక్సెస్

### కాజీపేట ఎసిపి పింగళి ప్రశాంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** కాలంతో పోటీపడుతూ, నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తలు సేకరించి సమాజానికి అందించే జర్నలిస్టులు తమ ఆరోగ్యాలపై కూడా శ్రద్ధపెట్టాలని కాజీపేట ఎసిపి పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జర్నలిస్టులు, డాక్టర్లు, పోలీసులు సమాజానికి దిక్సూచి అని చెప్పారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఆదివారం ప్రెస్ క్లబ్ లో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ఎసిపి ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయటం, జర్నలిస్టులకు ఉచిత పరీక్షలు, వైద్యం అందించటం, మందులుసైతం ఉచితంగా ఇవ్వటం అభినందనీయమని అన్నారు. ఏకశిలా హాస్పిటల్స్ చైర్మన్ కుందూరు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులు సేవా భావంతో పనిచేస్తారని, వారిని జర్నలిస్టులు పాజిటివ్ కోణంలో చూడాలని సూచించారు. జర్నలిస్టులకు తాను అన్నివిధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందిని సత్కరించిన గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, వివిధ యూనియన్ల బాధ్యులు సత్కరించారు. వైద్య పరీక్షల కోసం ఇసిజి, టూడీ ఈకో మెషిన్లు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని సమకూర్చిన ఏకశిలా హాస్పిటల్స్ చైర్మన్ కుందూరు కరుణాకర్ రెడ్డికి జర్నలిస్టులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, సుబేదారి ఇన్స్‌పెక్టర్ రంజిత్ లతో పాట్లు డాక్టర్లు, వైద్యసిబ్బందికి శాలువాలతో సత్కరించి, ప్రెస్ క్లబ్ చిత్రంతో కూడిన మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం, కొడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, అల్లం రాజేష్ వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు సంపెట సుధాకర్, పెద్దపెల్లి వరప్రసాద్,పొడిచెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్, ఇసి మెంబర్లు జనగాని ఆంజనేయులు, ఎండి నయీం పాషా, కందుకూరి సంజీవ్, వివిధ సంఘాల నేతలు గాడిపెల్లి మధు, తోట సుధాకర్, కంకణాల సంతోష్, వల్లాల వెంకటరమణ, గడ్డం కేశవమూర్తి, దుంపల పవన్, అచ్యుత రఘునాథ్, చెరుకు వేణుప్రసాద్, నాగరాజు, కట్ట రాజు,టీవీ రాజు, శోభన్, తిరుమల్, బుచ్చిరెడ్డి, సాల్మన్,ఆర్వీ ప్రసాద్, రజాక్ పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకున్న జర్నలిస్టులు

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 9:30 గంటలకు వైద్యులు, జర్నలిస్టులతో కలసి వైద్యశిబిరాన్ని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ప్రారంభించారు. ఉదయం ప్రారంభమైన హెల్త్ క్యాంపు మధ్యాహ్నంవరకు కిటికిటలాడింది. శనివారం రక్త పరీక్షలు చేసుకున్న జర్నలిస్టులతో పాటుగా సాదారణ చెకప్ లకోసం పలువురు జర్నలిస్టులు హాజరయ్యారు. రక్త పరీక్షల రిపోర్ట్‌ల ఆధారంగా ఇసిజి, టూడీ ఈకో పరీక్షలు నిర్వహించారు. వాటి ఆధారంగా కార్డియాలజిస్టులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ కూరపాటి మధు, డాక్టర్ వివేక్, డాక్టర్ లావణ్య, న్యూరో వైద్యులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ శ్రీచరణ్, ఫిజీషియన్లు డాక్టర్ వైద్యం గౌతం, డాక్టర్ మహేష్ లు పాల్గొని వైద్య సేవలందించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న జర్నలిస్టులకు మందులు రాసి, తగు సూచనలు చేశారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా జర్నలిస్టులకు ఉచితంగా మందులు అందజేశారు.

# బిసిల రిజర్వేషన్ల భాధ్యత కాంగ్రెసుదే

### బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి



**ప్రజాపక్షం / నల్లబెల్లి :** ఎన్నికల హామీలు భాగంగా కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ అవకాశాలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రె స్ అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్ర ప్రభుత్వంతో ఆమోదింప చేసుకునే విధంగా బాధ్యత వహించి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. నల్లబెల్లి సుమంగళి ఫంక్షన్ హాల్ లో సామల దేవేంద్ర అధ్యక్షతన జరిగిన బిసి కులాల సమావేశంలో మండల కన్వీనర్ చీకటి ప్రకాష్, కోకన్వీనర్ లు పాండవుల రాంబాబు, మేడిపల్లి రాజులతో కలిసి కుమారస్వామి మాట్లాడుతూ అసెంబ్లీలో చట్టం చేయగానే ఆ చట్టాన్ని వెంటనే గవర్నర్ కి పంపించి తక్షణమే ప్రధానమంత్రి అపాయింట్మెంట్ తీసుకొని రాష్ట్రంలోని అన్ని బిసి సంఘాలను, అఖిలపక్ష పార్టీలను తీసుకొని ఢిల్లీకి వెళ్లి ఈ బిసి రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదింప చేయించుకొనే బాధ్యత తీసుకుంటానని ఆనాడు సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాడు న్నారు. అసెంబ్లీ సాక్షిగా చేసిన ఈ ప్రకటనను పక్కనపెట్టి తెల్లవారే ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహించి చేతులు దులుపుకొని ఎన్ని నెలలు కావస్తున్న బిసి రిజర్వేషన్ల సాధన కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్‌గా ప్రయత్నం చేయలేదన్నారు. తీరా ఇప్పుడు క్యాబినెట్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని ఈ తీర్మానం ప్రకారం గవర్నర్ చే ఆర్డినెన్సును ఇస్తామని చెప్పుతోనే మళ్లీ ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి మోడీకి విన్నవిస్తానని చెబుతున్నాడని, చట్టం చేసిన వెంటనే ప్రధానమంత్రి మోదీ అపాయింట్మెంట్ తీసుకోకపోవడంలో, మోదీ ప్రభుత్వం మీదా ఒత్తిడి పెంచకపోవడానికీ కారణం ఏమిటో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీయే చెప్పాలన్నారు. వర్గ పోరాటలకు కేరాఫ్‌గా ఉన్న కమ్యూనిస్టులు సామాజిక ఉద్యమాలను ఇకనుంచి అయినా నిర్మించి బిసిలకు సకల రంగాలలో వారి వాటా వారికి దక్కేలాగా నాయకత్వం వ హించాలన్నారు. అగ్రవర్ణాల పేదలకు కూడా ఈ డబ్ల్యు ఎస్ రిజర్వేషన్ ద్వారా లబ్ధి జరగాలన్నారు. ఏ డబ్ల్యూ రిజర్వేషన్ల సలహాలు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాజ్యాంగ సవరణ చేసి కులగణన ద్వారా సమగ్రమైన రిజర్వేషన్లు కల్పించుటకు మోదీ ప్రభుత్వం తక్షణమే కులగణన చేపట్టాలన్నారు. బీసీల హక్కుల సాధనకు గ్రామ గ్రామాన బిసి కులాల ఐక్య గ్రామ కమిటీలు నిర్మాణాలు జరగాలన్నారు. గ్రామ కమిటీ కో కన్వీనర్ వైనాల మధు మాట్లాడుతూ బిసి కులాలమంతా ఏకతాటిపైకి వచ్చి మన హక్కులు సాధించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో కొన్కటి వీరమల్లు, నాగెల్లి శ్రీనివాస్, జక్కుల రవి, నరసింహస్వా మి, బండి సదయ్య, పిట్టల రంజిత్, క్యాతం మొగిలి, ఉడుత ప్రభాకర్, క్యాతం శ్రీనివాస్, సద్దాం హు స్సేన్, నన్నేసాహెబ్ , భూస కుమారస్వామి , భూస సదయ్య, గాజు భిక్షపతి, కోల లింగయ్య, మాటూరి హరీష్ , సామాల లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు కోసం మైనర్ బాలుడి కిడ్నాప్

### హనుమకొండ ఎసిపి నరసింహారావు వెల్లడి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** డబ్బు కోసం మైనర్ బాలుని కిడ్నాప్‌కు పాల్పడిన నలుగురు సభ్యుల ముఠాలోని ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు నిందితులను హన్మకొండ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి వీరి చెర నుండి బాలుడిని సురక్షితంగా రక్షించారు. వీరిలో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. వీరి నుండి పోలీసులు ఒక ఆటోను, ఒక కత్తి, రెండు పెట్రోల్ బాటిళ్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో హనుమకొండ ఏనుగుల గడ్డకుకు చెందిన పూరి పద్మ, పూరి రాజు, కొత్తగూడెం జిల్లా కు చెందిన జెట్టి జ్యోతి వారుగా పోలీసులు గుర్తించగా మరో నిండుతుడు శ్రీకాంత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ అరెస్టుకు సంబంధించి హనుమకొండ ఎసిపి నరసింహారావు వివరాలను వెల్లడిస్తూ పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ప్రధాన నిందితురాలైన పూరి పద్మ హనుమకొండలో స్థానికంగా నివాసం ఉంటూ బ్రాహ్మణవాడలోని క్యాటరింగ్ నిర్వహించే రమణ అనే వ్యక్తి వద్ద రోజువారి కూలిగా పనిచేసేది. కొన్ని సంవత్సరాలు పాటు నిందితురాలు రమణ వద్ద పనిచేయగా వీరి ఇరువురి మధ్య ఆర్థికపరమైన గొడవలు కారణంగా నిందితురాలు తన స్వగ్రామానికి తిరిగి వెళ్ళిపోయింది. రమణ నుండి నిందితురాలికి డబ్బులు రావాల్సి ఉందని, తన డబ్బులు తనకు తిరిగి రావాలంటే రమణ వద్ద ఉండే అతని దగ్గర బంధువు మైనర్ బాలుడిని కిడ్నాప్ చేయడం ద్వారా తన డబ్బులు తిరిగి వస్తాయని తన కుమారులైన రాజు, శ్రీకాంత్‌తో పాటు మరో నిందితురాలు జ్యోతికి వివరించడంతో, ఈ నలుగురు నిందితులు మైనర్ బాలుడిని కిడ్నాప్ చేసేందుకు పథకం వేసుకున్నారు. ఇందులో భాగంగా ఈ నెల నాలుగవ తేదీన మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై బయటకి వచ్చిన క్రమంలో ఈ ముఠా సభ్యులు మైనర్ బాలుడుని నయీమ్ నగర్ ప్రాంతంలో బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని ములుగు మార్గం మీదుగా అశ్వాపురంకి చేరుకున్న నిందితులు కిడ్నాప్ గురైన బాలుడితో అతని తల్లికి ఫోన్ చేయించి బాలుడి వరసకు మామ అయిన రమణ నుండి 12 లక్షల రూ పాయలు ఇస్తే బాలుడిని విడుదల చేస్తామని బాలుడి ద్వారా రమణ తోపాటు బాలుడు తల్లిని బెదిరించారు. బాలుడ్ని కిడ్నాప్ చేసిన ఈ ముఠా సభ్యులు బాలుడితో కలిసి అశ్వారావుపేట కొత్తగూడెం, కర్కగూడెంతో పాటు మంగపేట ప్రాంతాల్లోని పరిచయస్తుల ఇండ్లలో బాలుని రహస్యంగా ఉంచారు. ఇదే సమయంలో నింది తులు తమ వద్ద ఉన్న కర్రలతో మైనర్ బాలుడిని కొ డుతూ పెట్రోల్ పోసి చంపుతామని కత్తితో బెదిరించడం జరిగింది. ఇలా చేస్తున్నా కూడా కిడ్నాప్ కి గురైన బాదితుడి కుటుంబ సభ్యుల నుండి ఎలాంటి స్పందన రాకపో వడంతో డబ్బులు ఇవ్వవలసిన రమణని కూడా కిడ్నాప్ చేస్తే తమ డబ్బులు తిరిగి వస్తాయని అనుకున్న నింది తులు ఆదివారం ఉదయం ములుగు రోడ్డు మీదు గా అవుటర్ రింగ్ రోడ్డులో ఆటోలో ప్రయాణిస్తుండగా, అదే సమయంలో హన్మకొండ పోలీసులు యాదవనగర్ పెట్రోల్ పుంపు వద్ద రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చూసి భయపడిన నిందితులు ఆటోని వదిలి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా పట్టుబడిన ముగ్గురు నిందితులను పోలీసులను అదుపులో తీసుకొని విచారించగా మైనర్ బాలుడుని కిడ్నాప్ చేసినట్లుగా నిందితులు అంగీకరించారు. నిందితులని పట్టుకోవడం లో ప్రతిభ కనబరిచిన హన్మకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్, ఎస్ఐ కిషోర్, ఏఏఓసల్మాన్‌పాషా, కా నిస్టేబుల్ వి. అశోక్, డి. కరుణాకర్, బి. సతీష్, వినూష, కారుణ్య, హెచ్‌జిరవి,యుగేందర్‌లనుఎసిపి అభినందించారు.

# క్రీడ

## బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలపై ఉత్కంఠ..!

### త్రిసభ్య కమిటీ ఏర్పాటు



భారత బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలపై నెలకొన్న అనిశ్చితికి త్వరలోనే తెరపడనుంది. కార్యవర్గం పదవీ కాలం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నా.. ఎన్నికలు జరగకపోవడంపై ఆగ్రహించిన ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్షన్ నిర్వహణకు ఆటంకంగా మారిన అంశాలను నిగ్గు తేల్చడం కోసం ఆదివారం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. 'ప్రస్తుతం కార్యనిర్వాహక మండలిలో ఉన్న సభ్యుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ముగిసింది. అయినా సరే ఇప్పటివరకూ కొత్త కార్యవర్గం కోసం ఎన్నికలు మాత్రం జరుగలేదు. దాంతో, దేశంలో బాక్సింగ్ పోటీల నిర్వహణ, బీఎఫ్ఐ పనితీరుపై ప్రభావం పడుతోంది. అందుకే.. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశాం. వారం రోజుల్లో ఈ కమిటీ నివేదిక సమర్పించనుంది' అని ఉష తెలిపింది.

ఐఓఏ చీఫ్ ఉష ఏర్పాటు చేసిన కమిటీలో కోశాధికారి సహదేవ్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల్లో ఒకరైన భూపేందర్ సింగ్ భజ్వా, న్యాయవాది పాయల్ కక్రాలు సభ్యులు. డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు నిర్వహణ గురించి,కాల వ్యవధి ముగిన వెంటనే ప్రక్రియను చేపట్టడం గురించి పలు సూచనలు చేయనుంది. బాక్సింగ్ సమాఖ్య ఎన్నికల నిర్వహణలో చొరవ తీసుకోవాలని క్రీడా మంత్రిత్వ శాఖ జూలై 5న ఉషకు లేఖ రాసింది. సో.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా కమిటీ ఏర్పాటుతో సమస్యను పరిష్కరించడానికి సిద్ధమైంది ఐఓఏ చీఫ్.

## మళ్లీ టెస్టులు ఆడాలని ఉంది.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి

### అజింక్యా రహానే




ఆస్ట్రేలియా పర్యటనలో సారథిగా చిరస్మరణీయ విజయాలు అందించిన అజింక్యా రహానే జట్టుకు దూరమై రెండేళ్లు కావొస్తుంది. అతడు చివరిసారిగా వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో వైట్ జెర్సీ వేసుకున్నాడు. దేశవాళీ టోర్నీలు, ఐపీఎల్‌లో అదిరిపోయే బ్యాటింగ్‌తో చెలరేగుతున్న ఈ మాజీ కెప్టెన్ మరోసారి టెస్టుల్లో ఆడాలనుకుంటున్నాడట. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వీడ్కోలుతో తనకు అవకాశం ఇవ్వాలని సెలెక్టర్లను కోరుతున్నాడు రహానే. ఇంగ్లాండ్ పర్యటనతో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా ఎంపికవ్వడంతో పునరాగమనంపై ఆశలు పెంచుకుంటున్నాడు రహానే. తనకు ఒక్క ఛాన్స్ ఇస్తే చాలు సుదీర్ఘ ఫార్మాట్‌లో మెరుపులు మెరిపిస్తానంటున్నాడీ 37 ఏళ్ల క్రికెటర్. ఈమధ్యే స్కై స్పోర్ట్స్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నాకు టెస్టు క్రికెట్ ఆడాలని ఉంది. ఇప్పటికీ నాకు సుదీర్ఘ ఫార్మాట్ అంటే చాలా ఇష్టం. అందుకే.. సెలెక్టర్లతో మాట్లాడేందుకు ప్రయత్నించాను. కానీ, వాళ్ల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. కమ్ బ్యాక్ కోసం చూస్తున్న నాకు తలుపులు మూసేశారు' అని ఈ ముంబై సారథి వాపోయాడు.

## రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ ఆలౌట్

**భారత్ లక్ష్యం 193**




స్వల్ప ఛేదనలో భారత జట్టుకు రెండో ఓవర్లోనే షాక్ తగిలింది. విధ్వంసక ఓపెనర్ యశస్వీ జైస్వాల్(0)ను ఆర్చర్ డకౌట్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అతడి ఓవర్లోనే వెనుదిరిగిన యశస్వీ.. ఈసారి షార్ట్ పిచ్ బంతికి పెద్ద షాట్ ఆడబోయి వికెట్ కీపర్ స్మిత్ చేతికి దొరికాడు. దాంతో, 5 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ప్రస్తుతం కేఎల్ రాహుల్(5), కరుణ్ నాయర్(2)లు జాగ్రత్తగా ఆడుతూ భాగస్వామ్యం నిర్మించే పనిలో ఉన్నారు. ఇంకా గిల్ సేన విజయానికి 186 రన్స్ కావాలి.

బర్మింగ్‌హమ్‌లో సంచలన విజయంతో సిరీస్ సమం చేసిన భారత జట్టు లార్డ్స్‌లోనూ గెలుపు వాకిట నిలిచింది. నాలుగో రోజు బౌలర్ల విజృంభణతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు డగౌట్‌కు క్యూ కట్టారు. తొలి సెషన్‌లో సిరాజ్(231) నిప్పులు చెరిగితే లంచ్ తర్వాత వాషింగ్టన్ సుందర్ (422) ఆతిథ్య జట్టు నడ్డివిరిచాడు. డేంజరస్ జో రూట్(40), బెన్ స్టోక్స్(33), జేమీ స్మిత్(8)లను క్లీన్‌బౌల్డ్ టీ బ్రేక్ అనంతరం జస్ప్రీత్ బుమ్రా(238) వికెట్ల వేట కొనసాగించాడు. బషీర్‌ను సుందర్ బౌల్డ్ చేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో192కే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

## ఫోకస్

### ఆరోగ్యం

# గ్లైఫోసేట్ జీవవిధ్వంసక విషం!

భూమిలో జీవానికి భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును పూర్తిగా నిషేధించని వ్యవస్థలు, వాడకంపై పరిమితిని విధించాయి, కానీ కొన్ని చోట్ల నిషేధం వున్నా, పరిమితులు వున్నా యేథేచ్చగా క్రయ విక్రయాలు, వాడకాలు జరుగుతున్నాయి. భూమి పుడమిలో జీవాన్ని హరించేది కలుపు కాదు, కలుపును చంపుతున్న మానవ చర్యలే. దానికి అధినాయకుడిగా మారినది గ్లైఫోసేట్ అనే నాన్-సెలెక్టివ్ హెర్బిసైడ్ ఇది వాడిన భూమిలో జీవం మిగలదు.




### గడ్డినే కాదు జీవులను చంపే విషపు రసాయనం

ఇది ఉన్న చోట మట్టి శ్వాస తీసుకోలేదు, పంటల మీద పడితే మాడిపోతాయి, అది వాడిన గడ్డిని తినే మూగ జీవాలు మృత్యువాత చెందుతాయి, రైతులు, ప్రజలు తీవ్రమైన అనారోగ్యాల బారిన పడతారు.

**గ్లైఫోసేట్ అంటే ఏమిటి?**

గ్లైఫోసేట్ అనేది ఒక బ్రాడ్‌స్పెక్ట్రం కలుపు నివారణ మందు. దీన్ని అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ మొదటిసారిగా 1970లో 'రౌండప్' అనే బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి తెచ్చింది. ఇది మొక్కలలోని 'ఈపిఎస్‌పిసింతసిసే' అనే ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి మొక్కల పెరుగుదల నిలిపేస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు మొక్కల కోసం వాడతారన్నప్పటికీ, ఇది పంట మొక్కలు, మట్టి జీవులపై కూడ తీవ్రమైన ప్రభావం చూపుతుంది.

**రైతు ఖర్చు తగ్గడానికి మాయదారి – ఆరోగ్యానికి మృత్యుదారి!**

రైతులు కూలీల ఖర్చు తగ్గించేందుకు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కానీ దీని వలన వారు కలుపును చంపుతున్నట్టు కనిపించినా, భవిష్యత్తులో ఆరోగ్య ఖర్చులు, భూమి నష్టాలు, దిగుబడి తగ్గుదల వంటివి మరింత నష్టం తెస్తున్నాయి.

- 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధ్యయన ప్రకారం, గ్లైఫోసేట్ పిచికారి చేయడమే కారణంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్రంగా అనారోగ్యానికి గురవుతున్నారు.
- ఎయిమ్స్ నివేదిక ప్రకారం గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల అభివృద్ధిలో లోపాలు 18% పెరిగాయి.

**పర్యావరణ ప్రభావం – భూతాపానికి మూలం!**

గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మ జీవులు నశించి, హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. దీని వలన వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది. యునైటెడ్ నేషన్స్ ఐపిపిసి 2022 నివేదికలో స్పష్టం: ఈ హెర్బిసైడ్ వినియోగం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భారతదేశంలో గ్లైఫోసేట్ ప్రస్థానం

భారతదేశంలో గ్లైఫోసేట్ అనధికారికంగా తీవ్రంగా ప్రమాదకరమైన రసాయనంగా గుర్తించబడినా, ఇప్పటికీ ఇది గ్రామీణ ప్రాంతాల్లో స్వేచ్ఛగా లభిస్తోంది. 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం పాక్షిక నిషేధాన్ని ప్రకటించినా, అది కేవలం నామమాత్రమే. వ్యవసాయ శాఖకి చెందిన పలు రాష్ట్ర శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని దానంతటదే ప్రోత్సహిస్తూ కనిపించడం శోచనీయం. — జి.అజయ్ కుమార్

### ప్రపంచ దేశాల గ్లైఫోసేట్ నిషేధాలు – తాత్కాలిక బంధనాలు

**శ్రీలంక:**
2015లో గ్లైఫోసేట్ నిషేధం. సికెడియూ (క్రానిక్ కిడ్నీ డీసీస్ ఆఫ్ అన్నోన్ ఆరిజిన్) పెరగడంతో నిషేధం విధించారు కానీ అది ఎంతో కాలం కొనసాగలేదు.
జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు 2025 లోపే గ్లైఫోసేట్ నిషేధానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి.

**అమెరికా:**
2018లో కాలిఫోర్నియాలో మొదటిసారి కంపెనీపై కేసు నెగ్గిన రైతుకు 289 మిలియన్ డాలర్లు నష్టపరిహారం విధించబడింది. ఇప్పటివరకు 100,000కి పైగా కేసులు దాఖలయ్యాయి.

**కెనడా:**
ఫుడ్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ గ్లైఫోసేట్ అవశేషాలు ఆహార పదార్థాల్లో మించిపోతున్నాయని హెచ్చరికలు జారీ చేసింది.
కానీ ఈ నిషేధాలు అన్నీ ఎంతో కాలం కొనసాగలేదు మళ్ళీ దాని వాడకం ఆయా దేశాల్లో యధేచ్ఛగా పెరిగింది

**తెలుగు రాష్ట్రాల్లో – నిషేధాల మాయా !**
ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో అప్పట్లో 60 రోజుల తాత్కాలిక నిషేధం విధించినా& మార్కెట్లలో బహిరంగంగా గ్లైఫోసేట్ లభిస్తోంది. రాష్ట్రాలకు శాశ్వత నిషేధానికి అధికారం లేకపోవడమే దానికి ప్రధాన కారణం. కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు మాత్రం రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధం అమలు చేయగలిగాయి.

**గ్లైఫోసేట్ మానవ ఆరోగ్యంపై ప్రభావాలు – WHO, IARC నివేదికలు**
WHOకి చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ 2015లో గ్లైఫోసేట్‌ను 'ప్రాబబుల్ హ్యూమన్ కార్సినోజెన్ (గ్రూప్ 2ఏ)'గా ప్రకటించింది.

**ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది:**
– క్యాన్సర్, – గర్భస్థ శిశువుల లోపాలు
– నాడీ వ్యవస్థ లోపాలు
– శ్వాస సమస్యలు
– చర్మ సమస్యలు, అలర్జీలు
– మూత్రపిండాలు, కాలేయ సమస్యలు

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# పేదోడి పక్షాన పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

### ఘనంగా సుజాతనగర్ సిపిఐ మండల మహాసభ




**ప్రజాపక్షం/సుజాతనగర్ :** పేదలు, కార్మికుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని సీతంపేట బంజర్‌లో సుజాతనగర్ సిపిఐ నాలుగో మండల మహాసభ కోమరి హనుమంతరావు, ముక్కెర మురళి, లావుడియా గోపి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముందుగా సిపిఐ సీనియర్ నాయకులు భాగం శేషభూషణం సిపిఐ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీకి వేగుచుక్కల కొత్తగూడెం నియోజకవర్గం ఉందన్నారు, ఆకాశం, నేల ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, 40 సంవత్సరాలుగా ఈప్రాంతంలో సిపిఐ బలోపేతంగా ఉందన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం అన్నారు. సుజాతనగర్ నుంచి ఐదుసార్లు రజబ్‌అలీ ఎమ్మెల్యేగా గెలిచారంటే ఈ ప్రాంత ప్రజలకు సిపిఐపై ఎంత ఆధరణ ఉందో తెలుస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో సిపిఐ ఛాంపియన్‌గా నిలుస్తుందన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలతోనే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రజాసమస్యలపై సిపిఐ పోరాడుతుందని తెలిపారు. ఇందిరమ్మ పథకంలో ఇండ్లు అర్హులకు రాజకీయాలకు అతీతంగా కూనంనేని నాయకత్వంలో అందిస్తున్నామన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీను, సలిగంటి శ్రీను, వాసిరెడ్డి మురళి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్యాదస్రు, కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి పొదిల శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు తాళ్లూరి పాపారావు, ధర్మారావు, మదన్‌సింగ్, ఎఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, మాజీ ఎంటిపిసి గణేష్, సిపిఐ నాయకులు బొడ్డు కేశవరావు, వీర దుర్గ ప్రసాద్, కోమరి కృష్ణ, ఆకుల వెంకన్న, ఎట్టి వెంకటేష్, శశికాంత్, శంకర్, రాజేష్, మండే నాగేశ్వరరావు, భూక్యా శ్రీను, దండు సురేష్, భాగం కృష్ణ, సిపిఐ ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాలుష్యాన్ని నియంత్రించకుంటే పరిశ్రమలను ముట్టడిస్తాం..

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ ప్రాంతంలో పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యాన్ని నియంత్రించకుంటే పరిశ్రమలను ముట్టడిస్తామని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరించారు. చౌటుప్పల్ పట్టణంలోని బిఆర్‌కె కన్వెన్షన్‌హాల్లో ఆదివారం సిపిఐ చౌటుప్పల్ మండల 7వ మహాసభ పిల్లి శంకర్, కడవేరి కౌసల్య అధ్యక్షతన జరిగింది. సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మహాసభల సందర్భంగా సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆవిష్కరించారు. అనంతరం సభలో నెల్లికంటి సత్యం, గోద శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని, స్థానిక పరిశ్రమలో స్థానికులకే 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మల్కాపురం, కైతాపురం, దేవులమ్మ నాగారం, పీపల్ పహాడ్, తంగడపల్లి లక్కారం చౌటుప్ప చెరువులు కృష్ణజలాలతో నింపాలని, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్డు పూర్తిచేయాలని, మండలానికి బస్‌డిపో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఇఎస్‌ఐ హాస్పిటల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు బచ్చన గోని గాలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి జక్క దయాకర్‌రెడ్డి, కలకొండ సంజీవ, ఉడుత రామలింగం, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, కొండూరు వెంకటేష్, ఉడుత రామలింగం, దాసరి అంజయ్య, ఎస్ఎ రెహ్మాన్, దాసరి యాదయ్య, కుంటి పాపయ్య, సింగపంగా బుచ్చయ్య బోయిని యాదయ్య, రొండి నరసింహ, గడ్డం యాదయ్య, దాసరి కృష్ణ పాల్గొన్నారు.




## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదు




### సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఉండవెల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో సురవరం విజ్ఞాన కేంద్రంలో సిపిఐ మహాసభ రవి అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్యఅతిథులుగా సురవరం విజయలక్ష్మి తో పాటు సురవరం కపిల్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో విజయలక్ష్మి మాట్లాడుతూ 100 ఏండ్లుగా సిపిఐ ఈ దేశంలో పేదల కోసం పుట్టి అవి విశ్రాంతి పోరాటాలు సాగిస్తుందన్నారు. దున్నే వాడికి భూమి కావాలని మొట్టమొదట నినదించిన పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ప్రతి గ్రామంలో సిపిఐ ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి పోరాడితే ప్రజలకు మేలు జరుగుతుందని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆగస్టు నాలుగున జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతపు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమ సమాజం కోసం, పీడిత, తాడిత ప్రజల కోసం, వారి సమస్యలపై నిరంతరం నిస్వార్థంగా ప్రశ్నిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆమె కొనియాడారు. ప్రజలకు అందజేయాల్సిన సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వహించడం సరికాదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా చట్టాలను తీసుకురావడం సరైనది కాదని ఆవేదన వ్యక్తపరిచారు. సమస్యల పరిష్కారంలో సిపిఐ శ్రేణులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు.

# ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆంక్షలు దుర్మార్గం

### జిఒ మేరకే కొత్త ఆటోపర్మిట్‌లు ఇవ్వాలి ... లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం

### ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి హెచ్చరిక




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విధించిన ఆంక్షలతో కొత్త ఆటో పర్మిట్‌ల కోసం ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగం రూపుమాపాలనే సఉద్దేశంతో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒఆర్ఆర్ లోపల 60 వేల కొత్త ఆటో పర్మిట్ల జారీకి గైడ్‌లైన్స్‌తో జిఒ జారీ చేసిందని గుర్తుచేశారు. కానీ, అందుకు విరుద్ధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్ర మోహన్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జెఎసి నేతలు ఎం.సలీం (యుటిఎడిడబ్ల్యు), వి.ప్రవీణ్ (టియుసిఐ), ఎస్.రామకిషన్ (బిఆర్‌టియు), పి.యాదగిరి (టిఎన్‌టియుసి)లతో కలిసి వెంకటేశం మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ చర్యలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా కొత్త ఆటోలు కొనుగోలు చేయొచ్చని జిఒలో ఉంటే, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చెప్పిన ఫలానా డీలర్ వద్ద కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడమేమిటని వారు ప్రశ్నించారు. ఉమ్మడి ఏపిలోని డిఎల్‌ఎఫ్ ఆటోలైసెన్‌లు ఇప్పుడు చెల్లవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత జారీ చేసిన లైసెన్స్‌లే చెల్లుతాయని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. రోజుకు 100 ఆటోలు లాగిన్ అని పెట్టడం కూడా సరికాదన్నారు. ప్రభుత్వ జిఒ ప్రకారం రోజుకు 1000 ఆటోలు లాగిన్ చేసి, వెంటనే డెలివరీ చేయాలని, త్రీ వీలర్‌తోపాటు ఫోర్ వీలర్ లైసెన్స్ ఉన్న వారికి ఆటోలు ఎక్కడైనా కొనుగోలుకు అనుమతించాలని వెంకటేశం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆటో జెఎసి నేతలు ఎస్.అశోక్, బి.తిరుమలేశ్‌గౌడ్, ఎం.జనార్దన్‌రెడ్డి, ఎండి.రఫీ, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## విద్యుత్ నిరంతరం వస్తుందా, లేదా అంతరాయం ఉందా?

### రైతును అడిగి తెలుసుకున్న కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:**వ్యవసాయ పనులు సాగేందుకు విద్యుత్ వస్తుందా..అంతరాయం ఉం దా, యూరియా అందుబాటులో ఉందా అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రైతును అడిగి తెలుసుకున్నా రు. ఆదివారం మెదక్ మండలం పేరూరు గ్రా మం లో రైతుల పంట పొలాలను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడు తూ నిరంతర విద్యుత్ సరఫరా గురించి, యూరియా ఇతర పురుగు మందుల సరఫరా, గురించి రైతులను అడిగి తెలుసు కున్నారు .ప్ర భుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పా రు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ డ్రైవింగ్‌పై జిల్లా వ్యాప్తంగా 68 మందికి కౌన్సెలింగ్..



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**నిర్మల్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు గాను,జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు ఈరోజు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 54 మైనర్ డ్రైవింగ్ వాహనాలను సీజ్ చేశారు.అలాగే,మైనర్లు,వారి తల్లిదండ్రులు కలిపి మొత్తం 68 మందికి సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్‌హెచ్‌ఓలు) అక్కడికక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం మైనర్ల వాహన నిర్వహణకు వాహన యజమాని (తల్లిదండ్రుల) దే బాధ్యత అని ఎస్‌హెచ్‌ఒలు స్పష్టం చేశారు.పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలని వారు సూచించారు.గతంలో 70 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు కాగా,మైనర్లు,వారి తల్లిదండ్రులు కలిపి 107 మందికి కౌన్సెలింగ్ ఇవ్వబడింది.ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు,అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే హరీష్ బాబు తొలి బోనం సమర్పణ



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్:**కాగజ్‌నగర్ పట్టణంలో సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు తమ నివాసం నుంచి బోనం ఎత్తుకుని సర్సిల్క్ లోని మహంకాళి అమ్మవారి మందిరానికి వెళ్లి తొలి బోనం సమర్పించారు. దీంతో కాగజ్‌నగర్‌లో బోనాల ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ అమ్మవారి కృపతో సిర్పూర్ నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబును, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యురాలు పాల్వాయి రాజ్యలక్ష్మి, ఎస్‌పిఎం జిఎం రమేష్ రావు, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, మాజీ కౌన్సిలర్ దెబ్బటి రూప, మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి, మాజీ ఎంపిపి కొప్పుల శంకర్, ఎస్‌సి మోర్చా పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**ఆపదలో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సిఎంఆర్‌ఎఫ్ ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో సహాయం అందేలా చూస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాసరలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..



**ప్రజాపక్షం/బైంసా:**బాసర గోదావరి నది మొదటి ఘాట్ వద్ద ఆదివారం ఓ గుర్తు తలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బాసర ఎస్ఐ తెలిపారు.ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని,ఎవరికైనా ఆచూకీ తెలిస్తే బా సర పోలీస్ స్టేషన్‌కు తెలపాలని అన్నారు.బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.కేసునమోదుచేసి దర్యాపు జరుపుతున్నా రు.

## బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :**ఖానాపూర్ పట్టణం కొమరం భీం చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దురు యువకులు మృతి చెందారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇంధన్ పెల్లి గ్రామానికి చెందిన చొప్పదండి గంగన్న కుమారుడు లక్ష్మ ణ్ మురిమడుగు గ్రామానికి చెందిన తన స్నేహితుడు జస్వంత్‌తో కలిసి 18వ తారీఖున లక్ష్మ ణ్ తన పెండ్లి ఉండడంతో ఆదివారం రోజున నిర్మల్‌లో ఉన బంధువులకు పెళ్లి ప్రతికలు పంచడానికి పల్సర్ బైక్‌పై బయలుదేరారు.ఈ క్రమంలో ఖానాపూర్ కొమురం భీమ్ చౌరస్తా మెయిన్ రోడ్ పక్కన ఉన్న కల్వర్టుకు బైక్ అదుపుతప్పి,ఢీకొట్టడంతో వారిద్దరు పక్కనే ఉన్న చెట్ల పొదలలో పడిపోయారు.బైక్ బలంగా కల్వర్ట్ ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ విషయం తెలిసి ఖానాపూర్ పోలీసులు అక్కడికి చేరుకొని మృత దేహాలను ముండ్ల పొదల నుంచి బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు.లక్ష్మ ణ్,జస్వంత్ చనిపోయిన విషయాన్ని వారి బంధువులకు సమాచారం అందించారు.మృతుల బంధువులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం చేసి మృత దేహాలను వారికి అప్పగిస్తామని పోలీస్ వారు తెలిపారు.

## మంత్రిని కలిసిన పివిఆర్

**ప్రజాపక్షం/ఆర్మూర్ :**తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్టు పివిఆర్ తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





**ప్రజల కోసమే ప్రతీరూపాయి ఖర్చు**
**విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట**
**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/దండేపల్లి :**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆదివారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ఆరోగ్య మంత్రి దామోదర రాజనరసింహ, ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ లక్షెట్టిపేటలో 8 కోట్లు 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మించామని తెలిపారు. మెరుగైన వైద్య సేవల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణ జరుగుతోందని చెప్పారు. మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సిఎస్‌ఆర్, డిఎంఎఫ్‌టి నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి, తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించామని చెప్పారు. ఉపాధ్యాయుల నియామకం ద్వారా నాణ్యమైన విద్య అందించనున్నామని చెప్పారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దండేపల్లి మండలంలో 3 కోట్ల రూపాయలతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నామని చెప్పారు. రోజుకు 4,500 నుంచి 5,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంవత్సరానికి 51 లక్షల రూపాయల ఆదాయం లభిస్తుందని చెప్పారు. నర్సింగాపూర్ గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో 900 మీటర్ల సి.సి రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో 4 గ్రామపంచాయతీ భవనాలు, 4 అంగన్వాడి భవనాలను నిర్మించామన్నారు. లక్ష్మీ పూర్ గ్రామంలో 1 కోటి రూపాయలతో ఎస్‌సిఎస్‌డిఎఫ్ నిధులతో రోడ్లు, మురుగు కాలువలు నిర్మించామని, చిన్న గోపాలపూర్, ర్యాలీ గ్రామాలలో 2 కోట్ల 50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. హాజీపూర్ మండలం వేంపల్లిలో 212 ఎకరాలలో 30 కోట్ల రూపాయలతో ఐటి, ఇండస్ట్రియల్ పార్క్ నిర్మిస్తామని, ఈ పార్క్ ద్వారా 2 వేల మందికి ఉపాధి కల్పిస్తామని అన్నారు. పాలు, పెట్రోలు బంకులు, క్యాంటీన్ల నిర్వహణకు మహిళలకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టు తిరిగి ప్రారంభిస్తున్నామని, నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా చేయూత అందిస్తున్నామని తెలిపారు. సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసి 6 లక్షల 70 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నామని తెలిపారు. ఈ నెల 12 నుంచి 20 వరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ జరుగుతుందని, పేద విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాల యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, కార్పొరేట్ స్థాయిలో ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల ప్రారంభంతో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయిందని అన్నారు. హాజీపూర్ మండలంలో భూ సేకరణ పూర్తై ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని తెలిపారు. రుణ బీమా కింద 73 లక్షల 37 వేల రూపాయలు 83 మంది సభ్యులకు అందించామని, 8 వేల 750 మందికి వడ్డీ లేని రుణాలుగా 17 కోట్ల 78 లక్షల రూపాయలు పంపిణీ చేశామని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రైతుల ఆత్మహత్యాయత్నం

### పంట నష్టంతో ఆవేదనకు గురైన పత్తి రైతులు
### పోలీసుల జోక్యం, ఎమ్మెల్యే వినోద్ హామీతో ఆందోళన విరమణ



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నెన్నెల మండలానికి చెందిన పత్తి రైతులు కాసిపాక రాజు, గంగారామ్‌లు పెట్రోల్ పోసుకొని, పురుగు మందుల డబ్బాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం, విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అక్కడకు వెళ్లి బాధితులతో మాట్లాడారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యేతమకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ, నెన్నెల మండలానికి చెందిన తాము గత 20 సంవత్సరాలుగా సర్వే నంబర్లు 671, 672లలో తమ పట్టా భూముల్లో దాదాపు 40 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నామని వివరించారు. అయితే, ఈ నెల 11వ తేదీ శుక్రవారం కుషనపల్లి అటవీ రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీ నారాయణ, బీట్ అధికారులు తొంగల గోపి, మహేష్‌లు వచ్చి తమ భూమిని అటవీ భూమిగా పేర్కొంటూ 20 ఎకరాల్లో వేసిన పత్తి పంటను ధ్వంసం చేశారని వాపోయారు. దీనివల్ల లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. దళితులైన తమపై అటవీ అధికారులు దౌర్జన్యం చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

## ఇకపై కార్పొరేట్ స్థాయిలో వైద్యం లక్షెట్టిపేటలోనే

### రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



**ప్రజాపక్షం/లక్షెట్టిపేట్:**ఇప్పటి నుండి కార్పొరేట్ వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం లక్షెట్టిపేట పట్టణంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించడానికి వచ్చిన ఆయన, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని వసతులతో ప్రయివేటు ఆసుపత్రులకు దీటుగా లక్షెట్టిపేట లోనే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. ఇకపై వైద్యం కోసం మంచిర్యాల, కరీంనగర్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుకు స్థానిక శాసన సభ్యుడు కొక్కిరాల ప్రేమసాగర్ రావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు బట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు, దుద్దిల్ల శ్రీధర్ బాబు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు పాల్గొన్నారు. రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రి అన్వేషణ చేశారు. "శభాష్ ప్రేమన్న చాలా బాగుంది" అంటూ మంత్రి బట్టి విక్రమార్క ప్రేమసాగర్ రావును ప్రశంసించారు. అనంతరం మంత్రులు కొత్తగా ప్రారంభించిన ప్రభుత్వ పాఠశాల, కళాశాలలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సురేఖ, మండల, జిల్లా పార్టీ నాయకులు చెల్లా నాగభూషణం, చింత అశోక్, ఆరిఫ్, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్‌లో యువకుడి హల్‌చల్

### విద్యుత్ అంతరాయంపై సిబ్బందిపై దాడి



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్పహాడ్ గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం మంగళ్‌పహాడ్ సబ్ స్టేషన్‌లో హల్‌చల్ సృష్టించాడు. నెలవారి మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు చేస్తున్న సిబ్బందిపై దాడికి పాల్పడటంతో సబ్ స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతినెల రెండో శనివారం మెరుగైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు చేపట్టడం సాధారణ ప్రక్రియ, ఇందులో భాగంగానే శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసి మంగళ్‌పహాడ్ సబ్ స్టేషన్‌లో సిబ్బంది మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అయితే సాయంత్రం ఐదున్నర వరకు మరమ్మతులు కొనసాగుతుండటం వలన విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతోమంగళ్‌పహాడ్ గ్రామానికి చెందిన బండారి అఖిల్ అనే యువకుడు సబ్ స్టేషన్‌కు వచ్చి గొడవకు దిగాడు. విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపి వేశారని ప్రశ్నిస్తూ.., సిబ్బందిపై దుర్భాషలాడుతూ నానా హంగామా చేశాడు. మరమ్మత్తులు కొనసాగుతున్నాయని సిబ్బంది వివరించినప్పటికీ వినకుండా అక్కడ పని చేస్తున్న వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడితో ఆగ్రహించిన విద్యుత్ సిబ్బంది వెంటనే ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించి, దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లయన్స్ ఇన్‌స్పెక్టర్ ఆవులూరి సత్యనారాయణ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి





**ప్రజాపక్షం / మందమర్రి :**వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ విన్నవించారు. ఆదివారం మందమర్రి మున్సిపాలిటీలోని సుభాష్ నగర్లో తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో నాయకులు, స్థానిక ప్రజలు కాలనీలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. ప్రజా సమస్యలను తెలుసుకున్న మంత్రి స్పందిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు,శాఖ కార్యదర్శి గుమాస్ మల్లేష్, ప్రజాసంఘాల నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

**గాంధారి ఖిల్లా మైసమ్మను దర్శించుకున్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి**

మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలో గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర నిర్వహించారు. ఈ జాతరలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదివారం పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసి నాయక్ పోడ్ సేవా సంఘం, పరిరక్షణ సంఘం సభ్యులు మంత్రిని సన్మానించి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నాయక్ పోడ్ వంశస్థులు మాట్లాడుతూ ఆదివాసీల ఆరాధ్యదైవమైన మైసమ్మ తల్లికి ప్రతి ఏటా ఆషాఢ మాసంలో జాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆలయానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సదుపాయం లేక భక్తులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు విద్యుత్ ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు.భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జాతరలో పదిహేను లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని, ప్రస్తుతం రెండు లక్షల రూపాయల పైబడిన నిధులు వస్తున్నాయని చెప్పారు. ఆలయాన్ని ఎండోమెంట్‌లో చేర్చి కమిటీలో ఆదివాసులకు, బొక్కలగుట్ట, పులుమడుగు, క్యాతనపల్లి ప్రాంతాల వారికి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ జాతరలో ఆదివాసి వంశస్థులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు సకాలంలో అందేలా చర్యలు

### కలెక్టర్ రాహుల్ రాజ్




**ప్రజాపక్షం/పాపన్నపేట:**రైతులకు ఎరువులు సకాలంలో అందేలా పటిష్ట చర్యలు చేపట్టామని, ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా పొడిచన్ పల్లిలో విద్యుత్ ఉప కేంద్రంను పరిశీలించి విద్యుత్ వినియోగం, దానికి తగ్గట్లు శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలని సూచించారు. అనంతరం పక్కనే ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్య సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం లక్ష్మీ నగర్ లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాన్ని పరిశీలించారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, ఈ పాస్ యంత్రంలో నమోదు వివరాలు, దుకాణం, గోదాంలోని ఎరువులు, పురుగుమందుల నిలువలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ అందుబాటులో ఉన్నాయని, వాటికి ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 4675.89 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలను ఎరువుల విక్రయ కేంద్రాలకు మ్యాపింగ్ చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు :ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బైంసా:**రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని,పేదవాడికి ఆర్థిక సహాయం అందాలన్న ఉద్యేశంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. ఆదివారం బైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో 135 మందికి 42 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రజలు తనకు సేవ చేసే అవకాశాన్ని ఐదు సంవత్సరాలపాటు కల్పించాలని,నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు నా బంధుమిత్రులేనని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రావాలన్నా.సిఎంఆర్‌ఎఫ్ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించడం జరిగిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఒక శాసనసభ్యుడిగా నియోజకవర్గంలో ప్రజలకు ఆర్థిక సాయం అందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నట్లు చెప్పారు.

**ప్రజా తీర్పును మాజీ ఎమ్మెల్యేలు గౌరవించాలి..**

ప్రజలు ఎన్నికల్లో తమ నేత ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్‌కు పట్టం కట్టారని,ప్రజా తీర్పును గౌరవించాల్సిన అవసరం మాజీ ఎమ్మెల్యేలపై ఉందని బిజెపి మండలాల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి,నవీన్,సుష్మారెడ్డి,బెల్ తరోడా మాజీ సర్పంచ్ సాయినాథ్,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేష్,నాయకులు ,నియోగకవర్గ కో కన్వీనర్ సుమన్ అన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి వైఖరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.రోజుకు 18 గంటల పాటు ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యేని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల బిజెపి నాయకులు,అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## శాంతి భద్రతలకు భంగం కల్గించే వారిపై కఠిన చర్యలు

ఎస్‌పి కాంతిలాల్ పాటిల్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కల్గించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే ఎవరినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అలాంటి వారిని గుర్తించి, అవసరమైతే పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నేరాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజల రక్షణ, భద్రత పోలీసుల బాధ్యత అని, నేరాల నిర్మూలన కోసం ప్రజల సహకారం అవసరమని తెలిపారు. అలాంటి సంఘటనలు ఏవైనా చోటుచేసుకుంటే వెంటనే డయల్ 100కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి..



**ప్రజాపక్షం/బెజ్జంకి:** వాహనాదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పని సరిగా పాటించాలని స్థానిక ఎస్ఐ బి.సౌజన్య అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టారు.ఈ సంధర్భంగా ధృవపత్రాలు లేని వాహనాలకు చలాన్లను విధించారు.అనంతరం వారు మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సును కలిగి ఉండాలని,హెల్మెంట్‌ను తప్పని సరి ధరించాలని,త్రిబుల్ రైడింగ్ చేయరాదని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని మద్యం సేవించి వాహనాలను నడపరాదని అన్నారు.రోడ్డు నియమాలను పాటించి క్షేమంగా గమ్యం చేరాలని సూచించారు.

## విద్యుత్ అంతరాయాన్ని ఆక్షేపిస్తూ దాడి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్పహాడ్ గ్రామానికి చెందిన ఓ యువకుడు శనివారం మంగళ్పహాడ్ సబ్ స్టేషన్‌లో హల్‌చల్ సృష్టించాడు. నెలవారి మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసి పనులు చేస్తున్న సిబ్బందిపై దాడికి పాల్పడటంతో సబ్ స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతినెల రెండో శనివారం మెరుగైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపట్టడం సాధారణ పక్రియ, ఇందులో భాగంగానే శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసి మంగళ్పాహడ్ సబ్ స్టేషన్‌లో సిబ్బంది మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అయితే సాయంత్రం ఐదున్నర వరకు మరమ్మతులు కొనసాగుతుండటం వలన విద్యుత్ సరఫరా పునరుద్ధరించక పోవడంతో మంగళ్పహాడ్ గ్రామానికి చెందిన బండారి అఖిల్ అనే యువకుడు సబ్ స్టేషన్‌కు వచ్చి గొడవకు దిగాడు. విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపి వేశారని ప్రశ్నిస్తూ.., సిబ్బందిపై దుర్భాషలాడుతూ నానా హంగామా చేశాడు. మరమ్మత్తులు కొనసాగుతున్నాయని సిబ్బంది వివరించినప్పటికీ వినకుండా అక్కడ పని చేస్తున్న వారిపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడితో ఆగ్రహించిన విద్యుత్ సిబ్బంది వెంటనే ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించి, దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లయన్స్ ఇన్‌స్పెక్టర్ ఆవులూరి సత్యనారాయణ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు విద్యుత్ సిబ్బంది విధులకు సహకరించాలని, సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకరావాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది.

## కొనసాగుతున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో గల రైల్వే వంతెన గత నాలుగైదు సంవత్సరాల క్రితం అధిక వర్షాలు పడటంతో గ్రామంలోని అతిపెద్ద చెరువు అయిన ముసలమ్మ చెరువు, అలాగే గ్రామంలోని కుంటలు, అధిక వర్షపాతానికి నిండి అలుగులు పారడం వల్ల చెరువు కుంటల నుంచి వచ్చిన నీరు మొండి వాగు గుండా ప్రవహిస్తుంది. ఆ మొండి వాగు నీటి ప్రవాహానికి రైల్వే వంతెన గత నాలుగైదు సంవత్సరాల క్రితం వంతెన కొట్టుకపోయింది. దీంతో స్థానిక ప్రజలు, ఎంటిబిఎఫ్ నాయకుడు మూన్ నివాసి మాల, గత నాలుగైదు సంవత్సరాల నుంచి ఎన్నోసార్లు హైదరాబాద్‌లోని రైల్వే అధికారులకు, నాయకులకు, మోర్తాడ్‌లోని రైల్వే వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ఇక్కడ రైల్వే వంతెన నిర్మించడం కొరకు 90లక్షల రూపాయాలు మంజూరు చేయడంతో రైల్వే అధికారులు మొండి వాగులో పైపులు వేసి రైల్వే వంతెన నిర్మించడం పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రైల్వే వంతెన పనులు కొనసాగడంతో ఇక్కడికి పరిసరా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ వర్షాలు లేనందున వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేస్తే పనులు తొందరగా పూర్తి అవుతాయని ప్రజాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రైల్వే వంతెన తెగిపోయి రైల్వే స్టేషన్‌కు రైల్వే ప్రయాణికులు వెళ్లేందుకు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ రైల్వే వంతెన త్వరలో పూర్తి చేసి ఇక్కడ స్టేషన్‌లో ప్రయాణికులకు కావాల్సిన ఏర్పాట్లు చేసి ఇక్కడ రైల్వే స్టేషన్ నుంచి ముంబాయి లాంటి సుధీర ప్రాంతాలకు ప్రజలు ప్రయాణించేందుకు సౌకర్యం కలుగచేయాలని ఎంటిబీఎఫ్ నాయకుడు మూన్ నివాసి మాల అన్నారు. ఏది ఏమైన ఇక్కడ రైల్వే వంతెన నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రైల్వే వంతెన నిర్మించడం పట్ల ఇక్కడ ప్రాంత ప్రజలు, ప్రభుత్వానికి నాయకులకు రైల్వే అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని లక్ష్మీ పూర్ గ్రామంలోని దళితుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను డప్పు చప్పుళ్ళతో పుర వీధుల గుండా ఘనంగా నిర్వహించారు.ఈ సంధర్భంగా భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# న్యాయ వ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం కోల్పోకుండా కృషి

రాష్ట్ర హై కోర్టు జడ్జి , పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మ ణ్





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సంరక్షించే దిశగా మనమంతా కృషి చేయాలని రాష్ట్ర హై కోర్టు జడ్జి & పెద్దపెల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మ ణ్ అన్నారు.ఆదివారం ఓదెల మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవిష్కరించేందుకు రాష్ట్ర హై కోర్టు జడ్జి & పెద్దపెల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మ ణ్, హై కోర్టు జడ్జిలు ఎన్.వి. శ్రావణ్ కుమార్, ఈ.వి.వేణు గోపాల్ , జే. శ్రీనివాస్ రావు లతో కలిసి విచ్చేశారు. రాష్ట్ర హైకోర్టు జడ్జిలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా, సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతి రెడ్డిలు స్వాగతం పలకగా, పండితులు వేద మంత్రాల మధ్య పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర హైకోర్టు జడ్జి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించి సర్వ మత ప్రార్థనలు నిర్వహించారు.రాష్ట్ర హై కోర్టు జడ్జి & పెద్దపెల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మ ణ్ మాట్లాడుతూ ఓదెల మండలంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పడటం చారిత్రాత్మక అంశమని, దీని వల్ల ప్రజల సమీపంలో న్యాయం అందే అవకాశాలు మెరుగవుతాయని అన్నారు.పెద్దపల్లి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో అనేక కేసులు పెండింగ్ లో ఉన్నాయని, న్యాయవ్యవస్థలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి మౌలిక వసతుల మెరుగుదల, నూతన కోర్టుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నామని, న్యాయవాదులు, ప్రజలు సైతం సహకరించాలని ఆయన కోరారు. న్యాయ వ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని, సమాజంలోని ప్రతి పౌరునికి, వెనుకబడిన వర్గాల ప్రజలకు సమాంతరంగా న్యాయ సేవలు తప్పనిసరిగా అందాలని తెలిపారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా మనమంతా సమిష్టిగా పనిచేయాలని, కోర్టులో న్యాయవాదులు, జడ్జిల ప్రవర్తన మార్గదర్శకాలు మేరకు మర్యాద పూర్వకంగా ఉండాలని ఆయన సూచించారు.*ఓదెల మండలంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని తయారు చేసేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రానికి హై కోర్టు జడ్జి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు, హైకోర్టు జడ్జిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అందరూ న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, జిల్లాలోని అందరు బార్ అసోసియేషన్ సభ్యులు, డిసిపి కరుణాకర్, ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్ ధీరజ్, ప్రజా ప్రతినిధులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ

**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మెట్‌పల్లి పట్టణంలోని సిరి పిల్లల ఆసుపత్రి వైద్యులు చిలుక చైతన్య ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. కాగా ఈ వైద్య శిబిరంలో సుమారు 100కు పైగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ వాతావరణం మార్పుల వల్ల అనారోగ్యం బారిన పడుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకమని ప్రజా ప్రతినిధులు సిరి ఆసుపత్రి వైద్యులు చైతన్యను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, మాజీ జెడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి మండల శాఖ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు దశరథం, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సంఘ గంగారాజం, నాయకులు శరత్ గౌడ్, లవంగ శివ, శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్, సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది ఆర్ఎంపిలు ఉన్నారు.

## బైంసా డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/బైంసా:** కుబీర్ మండలంలోని పార్డి(బి) గ్రామంలో రాజరాజేశ్వరి టెంపుల్‌లో బైంసా డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రామారావు పటేల్ ఉచిత శిబిరాన్ని ప్రారంభించారు.అధ్యక్షుడు డాక్టర్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ చెడు అలవాట్లను,మత్తుమందును దూరంగా ఉండాలని చెప్పడం జరిగింది డాక్టర్ కాశీనాథ్ పరిసర శుభ్రత పాటించి రోగాలను రాకుండా చూసుకోవాలని చాలా జాగ్రత్త తీసుకోవాలని చెప్పడం జరిగింది.సెక్రెటరీ డాక్టర్ కుమార్ యాదవ్ రోగులపైన అహోగాన,బీపీ,షుగర్ మందులను వేసుకోవాల్సిందని దాని వల్ల జరిగే ప్రమాదాలను తెలియజేయడం జరిగింది.చిన్న పిల్లల డాక్టర్లు చక్రధర్ పిల్లలను సరైన ట్రీట్మెంట్,పోషక ఆహార పదార్థాలు,ఇలా ఆరోగ్యానికి కాపాడుకోవాలని అవగాహన ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బైంసా డాక్టర్లు నాగేష్,ముత్తం రెడ్డి,వనజ,ప్రీతం,మహిపాల్,రామకృష్ణ గౌడ్,సందీప్ జాదవ్ పాల్గొనడం జరిగింది. కొత్తూరు శంకర్,ప్రవీణ్ కార్యక్రమానికి విజయవంతం చేయడం వారికి అదరూ అభినందించడం జరిగింది.మోగా క్యాంప్ లో 500 పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది.

## 17న పెద్దపల్లి జిల్లా సిపిఐ మహాసభలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ)పెద్దపల్లి జిల్లా మహాసభలు జూలై 17 న జిల్లా కేంద్రంలోని ఎన్.ఎస్ గార్డెన్ లో జరుగుతాయని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్ తెలిపారు. ఆదివారం 8వ కాలనీలో కమాన్ పూర్ మండల సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ మహాసభలు నిర్వహించి నూతన నాయకత్వాన్ని ఎన్నుకుని భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ జాతీయ సమితి నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 17 న జరిగే జిల్లా మహాసభల్లో కమాన్ పూర్ మండల సిపిఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఇట్టి మహాసభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు ముఖ్య అతిథిగా హాజరౌతారని ఆయన అన్నారు. సిపిఐ కమాన్ పూర్ మండల కార్యదర్శి కామ్రేడ్ కందుకూరి రాజారత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎల్.ప్రకాష్, ఏఐటియుసి ఆర్జీ టూ బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ జీగురు రవిందర్, సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ బుర్ర తిరుపతి, నాయకులు కొంద్ర సత్యనారాయణ, కొంకటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిసిల 'కృతజ్ఞత సభకు' తరలిరావాలి



**ప్రజాపక్షం/ధర్మపురి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించనున్న కృతజ్ఞత సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ నాయకులు మీడియా సమావేశం ద్వారా పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ధర్మపురి మండల పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసి చైర్మన్లు బుర్ర రాములు గౌడ్, బీమ సంతోష్, బుగ్గారం మండల అధ్యక్షుడు సుభాష్ తదితరుల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల రాజేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం బీసిలకు 42శాతం రిజర్వేషన్ల కల్పనకు ఆర్డినెన్స్ జారీ చేయడంతో పాటు రాష్ట్రంలో కుల గణన పగడ్బందీగా అమలు చేసి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలుపుతూ 17న నిర్వహించే ధర్మపురి సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి పార్టీ బిసి సామాజిక వర్గం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, ప్రవీణ్ గౌడ్, తిరుపతి, వెంకటేష్, గౌతం, రాజ్ కుమార్, సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది: మీసం



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నందుకు చిన్నకోడూరు మండల కేంద్రంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ ఆధ్వర్యంలో మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా నియామకం అయిన మండల అధ్యక్షుడు బత్తిని గణేష్‌తో కలిసి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో రాజకీయంగా బీసీలకు మహర్దశ రానుందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ నలభై రెండు శాతం రిజర్వేషన్‌లోను ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ సామాజిక న్యాయం దిశగా పాలన చేస్తూ అన్ని వర్గాలకు పెద్ద పీట వేస్తూ సమన్యాయం జరిగేలా నిర్ణయాలే తీసుకుంటూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ లోకమంతా ఋణపడి ఉంటామన్నారు.గత ఎన్నికల సమయంలో, భారత జోడో యాత్రలో భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ కులగన చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం కులగణన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో చేసినట్లు దేశ మొత్తం కులగన చేసే విధంగా పోరాటం చేస్తామన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి కల్లూరు నరసింహులు, అనంతగిరి చంద్రశేఖర్, మందపల్లి సంపత్,శేఖర్, ఫిషర్మెన్ కమిటీ గుండు వెంకట్, మండల పార్టీ కొరిమిరాజు, మండల నాయకులు జక్కుల నాగరాజు, బర్ల స్వామి, కొలను బాబు, మేకల దేవయ్య, పంజా రాజు, దేవరాయ శేఖర్, గుడిమల్ల మల్లేశం, నవీన్, రాజు, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్ జారీపై హర్షం

జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరామ్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో బీసీలకు రాజకీయాల్లో ,ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడం చారిత్రాత్మక నిర్ణయం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరాం అన్నారు.ఆదివారంజగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న పంచాయతీరాజ్ చట్టం 2018 ను సవరించి ఆర్డినెన్స్ ను తేవడం ద్వారా ఈ రిజర్వేషన్లను అమలు చేయనుందని తెలిపారు .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ముఖ్యమంత్రి బీసీ సమాజాన్ని అగ్ర భాగంలో నిలబెట్టాలని పట్టుదలతో ఉండి పట్టు వదలని విక్రమార్కుడిలా బీసీల కోసం విజృంభిస్తున్న మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేయడం బీసీ సంక్షేమ సంఘం తరఫున హర్షం ప్రకటిస్తున్నాం అని అన్నారు.బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తేవడం బీసీ సమాజం గర్విస్తున్నదని బీసీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రిజర్వేషన్లు కల్పించి బీసీ సమాజం ఈనాడు ఉన్నత స్థాయిలో ఉందంటే అది ఎన్టీ రామారావు కృషి పట్టుదలే కారణం ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని బీసీలు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా జెడ్పిటిసిలుగా ఎంపీపీలుగా ఎంపిటీసీలుగా సర్పంచ్లుగా ఎన్నికవుతున్నారంటే ఆనాడు ఎన్టీ రామారావు తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పు బీసీ రిజర్వేషన్లు అని కొనియాడారు.ఈనాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బీసీలను అన్ని రంగాలలో రాజకీయ పదవులలో సమున్నతమైన స్థానంలో బీసీలను నిలబెట్టాలని కృతనిశ్చయంతో ఉన్నారు. బీసీల రిజర్వేషన్లని కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు.

## ఊర పండగ శోభాయాత్ర బందోబస్తు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ ప్రజలందరికి ఊరపండగ శుభాకాంక్షలు అని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. ఆదివారం నిజామాబాద్ పట్టనంలో నిర్వహించిన ఊరపండుగ శోభాయాత్రను పర్యవేక్షించారు. ఊరపండుగ శోభాయాత్ర రఘునాథ ఆలయం ఖిల్లా చౌరస్తా నుంచి ప్రారంభమై వివేకానంద చౌరస్తా, లక్ష్మి మెడికల్, గాజుల్‌పేట్, పెద్ద బజార్, గోల్‌హనుమాన్, పూలాంగ్ చౌరస్తా, ఆర్యనగర్, వినాయక్‌నగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఊర పండగ శోభాయాత్ర ప్రారంభం నుండి చివరి వరకు పటిష్టమైన నిఘా వ్యవస్త ఏర్పాటు చేసి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించడం జరిగిందని, ప్రత్యేకంగా సరి తీసుకుని వెళ్లేటటువంటి ప్రత్యేక ప్రాంతాల్లో చుట్టుపక్కల గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, రూట్ మ్యాప్ ప్రకారంగా శోబాయాత్ర నిర్వాహకులు, ప్రజలు పోలీసు బందోబస్తుకు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సిఐలు, ఎస్ఐలు, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైడ్‌డ్రైన్ ఆక్రమణ.. ముందుకు కదలని మురుగు నీరు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో కొందరు వారి ఇండ్ల ముందు ఉన్న సైడ్ డ్రైన్లను ఆక్రమించారు. సైడ్ డ్రైన్ ను కూల్చివేసి అందులో మట్టి పోసి చదును చేశారు. దీంతో ఆ సైడ్ డ్రైన్ గుండా మురుగు నీరు ముందు కదలడం లేదు. దీంతో ఈగలు, దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడం, సీజనల్ వ్యాధులు ప్రబలే అ వకాశం ఉన్న నేపథ్యంలో ఇలా సైడ్ డ్రైన్ ఆక్రమించి మురుగు నీరు ముందుకు కదలకుండా చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు నీరు ముందుకు కదలకుండా ఉండటంతో దుర్వాసన వెదజల్లుతుందని సమీప ఇండ్ల పజలు ఆవేదన వ్యక్తం చేశారు. సైడ్ డ్రైవ్ ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనిపై అధికారులు ఇప్పటికైనా స్పందించి సైడ్ డ్రైన్లు ఆక్రమించి చదును చేసిన వారిపై చర్యలు తీసుకొని, మట్టిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

రీల్

'డబ్బు ఖర్చు.. సబ్బు ఖర్చు.. నీళ్ల ఖర్చు' అనే డైలాగ్‌తో గుర్తొచ్చే లక్ష్మీపతి పాత్ర కోట నటనకు ఒక మైలురాయి. 'అహ నా పెళ్ళంట' సినిమాలో ఆయన పోషించిన పిసినారి పాత్ర ఇప్పటికీ తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పంచుతోంది. ఇవన్నీ సోషల్ మీడియాలో ఇప్పటికీ వైరల్ అవుతూనే ఉంటాయి.



# కళామతల్లి సేవలో ముగిసిన కోట శకం

## కోట శ్రీనివాసరావుకు సినీ ప్రముఖుల నివాళి

### మలయాళంలో వర్క్ అంటే ఎంతో భయపడ్డా



శిల్పా శెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి కీలక పాత్రలో నటించిన చిత్రం 'కేడీ: ది డెవిల్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కొచ్చిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శిల్పాశెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటివరకూ వివిధ భాషా చిత్రాల్లో నటించానని చెప్పిన ఆమె.. మలయాళ చిత్ర పరిశ్రమలో వర్క్ చేయాలంటే మాత్రం భయపడ్డానని అన్నారు. అందుకు గల కారణాన్ని కూడా వెల్లడించారు. "కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకూ వివిధ భాషల్లో యాక్ట్ చేశాను. హిందీతోపాటు తెలుగు, తమిళం, కన్నడలో విభిన్నమైన చిత్రాల్లో నటించాను. అయితే, మలయాళ చిత్ర పరిశ్రమలో పనిచేయడానికి మాత్రం నేనెంతో భయపడ్డా. అందుకే ఆ పరిశ్రమ నుంచి ఎన్నో అవకాశాలు వచ్చినా వాటిని అంగీకరించలేకపోయా. వ్యక్తిగతంగా నాకు మలయాళ చిత్ర పరిశ్రమ అంటే గౌరవం ఉంది. మలయాళీ చిత్రాలు చూస్తుంటా. భావోద్వేగాలను ఎంతో చక్కగా స్క్రీన్ మీదకు తీసుకువస్తారు. అక్కడి వారి వర్క్ చూసి ఎన్నోసార్లు ఆశ్చర్యపోయా. ఆ పరిశ్రమలో ఏదైనా సినిమా అంగీకరిస్తే.. నా పాత్రకు సరైన న్యాయం చేయలేనేమోననిపిస్తుంది. అందుకే ఇప్పటివరకూ అక్కడ సినిమా అంగీకరించలేదు. భవిష్యత్తులోనైనా ధైర్యం తెచ్చుకుని యాక్ట్ చేస్తానేమో చూడాలి. జీవితంలో తప్పకుండా ఒక్క మలయాళ సినిమా అయినా చేస్తా'' అని ఆమె తెలిపారు.

ఆ చిత్రపరిశ్రమకు సంబంధించి అగ్ర నటుడు మోహన్‌లాల్ అంటే తనకెంతో ఇష్టమని ఆమె చెప్పారు. ''భారతీయ చలన చిత్రపరిశ్రమలో ఉన్న గొప్ప నటుల్లో మోహన్‌లాల్ ఒకరు. ఆయన అద్భుతంగా నటిస్తారు. ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఉంది. అవకాశం వస్తే తప్పకుండా వర్క్ చేస్తా'' అని తెలిపారు.

### కోట శ్రీనివాసరావుకు బాబు నివాళి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోట శ్రీనివాసరావు పార్థీవ దేహానికి నివాళులర్పించారు. చిత్రసీమకు కోట లేకపోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. అత్యంత సామాన్య కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.

### దేశం గొప్ప నటుడ్ని కోల్పోయింది: బ్రహ్మానందం

కోట శ్రీనివాసరావు పార్థీవ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించిన హాస్య నటుడు బ్రహ్మానందం కన్నీరు మున్నీరయ్యారు. కోట శ్రీనివాసరావు మరణించారన్న విషయాన్ని నమ్మలేకపోతున్నాను అని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం గొప్ప నటుడిని కోల్పోయింది అని బ్రహ్మానందం వ్యాఖ్యానించారు. ఇంత గొప్ప నటుడు తెలుగు తెరపై పుట్టడం తెలుగు సినిమా చేసుకున్న అదృష్టం అని అన్నారు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని బ్రహ్మానందం పేర్కొన్నారు.

### ఎన్నో పాత్రలకు జీవం పోశారు : బాలకృష్ణ

ప్రముఖ సినీ నటులు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు సినీ నటులు నందమూరి బాలకృష్ణ సంతాపం తెలియజేశారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని తెలిపారు.

### మా ఇద్దరి నట ప్రస్థానం ఒకే సినిమాతో ప్రారంభమైంది: చిరంజీవి



కోట శ్రీనివాసరావు,తన నట ప్రస్థానం ఒకే సినిమాతో ప్రారంభమైంది అని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. తెరమీద కోటా శ్రీనివాస్ నటన అద్భుతం. వ్యక్తిగతంగా ఆయన హాస్య చమత్కారం కూడా అద్భుతం.ఆయనతో ఎంతో అనుబంధం పెనవేసుకొని ఉంది.ఆయన అన్ని యాసలు, మాండలికాలు అవలీలగా మాట్లాడగలరు. ఆయన మృతి పరిశ్రమకు, ఆయన కుటుంబానికి తీరని లోటు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను..

### కోట లేని లోటు ఎవరూ తీర్చలేనిది : నాగార్జున

కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని హీరో అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. కోట మరణం వార్త విని దిగ్భ్రాంతికి లోనయ్యానని అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కోట లేని లోపం ఎవరూ తీర్చలేనిదని చెప్పారు.

### తెలుగు భాష.. యాస తెలిసిన నటుడు: పవన్‌కల్యాణ్

''తెలుగు చిత్ర పరిశ్రమలో విలక్షణమైన నటునకు చిరునామాగా నిలిచిన కోట శ్రీనివాసరావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తెలుగు తెరపై ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్నమైన పాత్రలు పోషించారు. తెలుగు భాష.. యాసలపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఓ పిసినారిగా, ఓ క్రూరమైన విలన్‌గా, ఓ మధ్య తరగతి తండ్రిగా, ఓ అల్లరి తాతయ్యగా.. ప్రతి పాత్రలో ఒదిగిపోయారు. నా మొదటి చిత్రం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..'లో ఆయన ముఖ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించారు. ఆ తర్వాత పలు సినిమాల్లో కలిసి నటించాం. కోట శ్రీనివాసరావు డైలాగ్ చెప్పే విధానం, హావభావాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను''

### మాటల్లో చెప్పలేని దుఃఖాన్ని కలిగించింది : మోహన్ బాబు

ప్రముఖ నటుడు, నిర్మాత పద్మశ్రీ డా. ఎం. మోహన్ బాబు కోట శ్రీనివాసరావుకు సోషల్ మీడియాలో ప్రగాఢ సంతాపం తెలిపారు. మోహన్ బాబు తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఇలా పేర్కొన్నారు.

### కోట లాంటి నటుడు దొరకడు : వెంకటేష్

కోట శ్రీనివాసరావు లాంటి నటుడు భారతీయ సినిమాకు మళ్లీ దొరికాడు అని హీరో వెంకటేష్ అన్నారు. కోట పార్థీవ దేహానికి నివాళులర్పించిన వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ కోట నుంచి తాను ఎంతో నేర్చుకున్నాను అని అన్నారు. కోట లేని లోటు ఎవరూ తీర్చలేదని చెప్పారు.

### కోటకు రాణా నివాళి

కోటా శ్రీనివాస్ మరణం యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. విషయం తెలిసిన వారంతా సామాజిక మాధ్యమాల్లో కోటా మృతి పట్ల సంతాప సందేశాలు ప్రకటించగా... మరికొంత మంది సినీ, రాజకీయ ప్రముఖులు ఫిల్మ్ నగర్ లోని కోట శ్రీనివాసరావు నివాసానికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కోటాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రహ్మానందం, బాబుమోహన్, అలీ లాంటి అత్యంత సన్నిహితులైన హాస్యనటులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు నిర్వహించారు. ఫిల్మ్‌నగర్‌లోని కోట నివాసం నుంచి.. మహాప్రస్థానం వరకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు పార్థీవ దేహానికి నటుడు రాణా నివాళులర్పించారు. ప్రకాష్ రాజ్ కూడా కోటకు నివాళులర్పించారు. మాజీ ఎంపి జితేందర్ రెడ్డి కూడా కోటకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కోటతో పని చేసిన అనేక మంది సాంకేతిక నిపుణులు కూడా ఫిలిం నగర్ లోని ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు.

### కోట లేని లోటు ఎవరూ పూడ్చలేరు: తనికెళ్ళ భరణి

సినిమా బతికి ఉన్నంత కాలం కోట శ్రీనివాసరావు నటన బతికే ఉంటారని తనికెళ్ళ భరణి అన్నారు. కోట మరణ వార్త విన్న వెంటనే ఫిలిం నగర్ లోని ఆయన నివాసానికి వచ్చిన భరణి కోట పార్థివదేహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కోట శ్రీనివాసరావు తాను కలిసి ఎన్నో సినిమాలు చేశామన్నారు. వందులు, వేల జ్ఞాపకాలు మిగిల్చి కోట వెళ్లిపోయారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### తనదైన శైలితో పాత్రకు ప్రాణం పోసే నటుడు : ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో కోట మ్రుతికి సంతాపం ప్రకటించారు. తెలుగు తెరపై తనదైన శైలితో ప్రతి పాత్రకు ప్రాణం పోశారని పేర్కొన్నారు. ఆయనతో నా సినిమా షూటింగ్ సమయంలో పంచుకునన్ క్షణాలు మరచిపోలేనని అన్నారు. కోట ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తానని అన్నారం. కోట కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

### నిబద్ధత గల నటుడు కోట : మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పట్టుదల, క్రుషి, నిబద్ధత కలగలిపిన నటుడు కోట శ్రీనివాసరావు అని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఫిలిం నగర్ లోని కోట శ్రీనివాసరావు నివాసానికి వచ్చిన వెంకయ్య నాయుడు కోట చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారని ఆయన అన్నారు. కోటను చూసి నేర్చుకోవలసింది ఎంతో ఉందని అన్నారు. రాజకీయాల్లో కూడా ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### కోటకు గవర్నర్ దత్తాత్రేయ నివాళి



ప్రముఖ నటుడు మాజీ శాసనసభ్యులు కోట శ్రీనివాసరావు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. కోట శ్రీనివాసరావు మృతిచెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు బండారు దత్తాత్రేయ తెలిపారు. కోట శ్రీనివాసరావు జాతీయత, దేశ భక్తి నిబద్ధతకు ప్రతిరూపమని, ప్రజలతో చక్కగా మమేకమై పనిచేసిన నాయకులని వారి సేవలను కొనియాడారు. కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికే కాకుండా జాతీయ భావాలు కలిగిన సంస్థలకు తీరని లోటు అని దత్తాత్రేయ పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపట్ల తన ప్రగాఢ సంతాపాయాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని, ఈ కష్ట సమయాన ఈ బాధను తట్టుకోవడానికి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలిపారు.

## సమగ్ర సవరణ

**(మొదటి పేజీ తరువాయి)**

జాబితా సమగ్ర సవరణ జరగబోతోంది.

**జులై 28 తర్వాతే తుది నిర్ణయం**

ఓటరు జాబితా సమగ్ర సవరణను ఇసి చేపట్టడం అనేది రాజ్యాంగబద్ధమైన అంశమేనని, బిహార్‌లో ఆ ప్రక్రియను నిర్వహించొచ్చని గతవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే దేశవ్యాప్తంగా ఈ డ్రైవ్‌ను చేపట్టే అంశంపై జులై 28 తర్వాతే కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) తుది నిర్ణయాన్ని తీసుకుంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే అకస్మాత్తుగా బిహార్‌లో ఎస్ఐఆర్ డ్రైవ్‌ను నిర్వహించడం వల్ల ఎంతోమంది ఓటుహక్కును కోల్పోతారంటూ దాఖలైన పిటిషన్లపై ఆ తేదీన మరోసారి దేశ సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు జరగనున్నాయి. జన్మస్థలం ఆధారంగా విదేశాలకు చెందిన అక్రమ వలసదారుల పేర్లను దేశంలోని ఓటరు జాబితాల నుంచి తొలగిస్తామని కేంద్రం ఎన్నికల సంఘం అంటోంది. ప్రత్యేకించి వివిధ రాష్ట్రాల్లో బంగ్లాదేశ్, మయన్మార్ వలసదారులు ఓటు హక్కు పొందారని అంటున్నారు. అలాంటి వారి పేర్లను ఓటరు లిస్టుల నుంచి తొలగించనున్నారు. కాగా, ఈ ఏడాది చివర్లో బిహార్‌లో, వచ్చే సంవత్సరం అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## కాలిఫోర్నియా పొలాల్లో వలస అధికారుల తనిఖీ

### ఘర్షణలో వ్యవసాయ కార్మికుడు మృతి



**ఆస్టిన్ :** అమెరికాలో అక్రమ వలస కార్మికులను గుర్తించే కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్న అధికారులు ప్రభుత్వ గుర్తింపు పొందిన గంజాయి సాగు పొలంలో తనిఖీ దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలూ లేని 200మంది వలస కార్మికులను అరెస్టు చేశారు. ఉద్రిక్తతలు పెరిగిపోవడంతో వలస కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. అధికారులకు కార్మికులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కార్మికుడు ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించాడు. లాస్ ఏంజెల్స్‌కు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంటూరా కౌంటీలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ ఘర్షణలు జరిగాయి. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వలస ప్రజల అణచివేత చర్యల్లో భాగంగా దేశాధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు చాలా కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. వలస కార్మికులను మాతృదేశానికి కాకుండా వారికి తెలియని దేశాలకు తరలించి అక్కడే ఉంచేస్తున్నారు. ఈ విషయాలు ముందుగానే తెలుకున్న కార్మికులు భయపడి పారిపోతున్నారు. ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతి చర్యల్లో వ్యవసాయ కార్మికుడు మరణించాడు. ఈ రైతు కార్మికుడి కుటుంబం మెక్సికోలో ఉన్న తమ కుటుంబాలకు సహాయం చేసేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ''గో ఫండ్ మీ'' అనే ఒక ఫండ్ రైజింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. ఈ ఘర్షణ జరిగాక కార్మికుడి మరణం గురించి ఆ వేదిక ద్వారా ఆ కుటుంబం ఈ విషాద ఘటన గురించి అందరికీ తెలియజేసింది. ముఖ్యంగా మెక్సికో నుండి లక్షలాదిమంది వలస ప్రజలు తమ బతుకులు బాగు చేసుకోవడంకోసం అమెరికా వచ్చి చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇప్పుడు మెక్సికో సరిహద్దులను ట్రంప్ చాలా కట్టడి చేశారు. భారీ ఎత్తున అదనపు బలగాలను వందలమందిని నిఘా పెట్టారు.

## ప్రపంచ స్థాయిలో బంగారు పథకాలు సాధించే దిశగా ప్రభుత్వం కృషి

### రాష్ట క్రీడ శాఖ చైర్మన్ శివసేనా రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రపంచ స్థాయిలో బంగారు పథకాలు సాధించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట క్రీడ శాఖ చైర్మన్ శివసేనా రెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల క్రీడ మైదానంలో గత 15 రోజులుగా మండల స్థాయి ఎస్‌పిఎల్ 3 క్రికెట్ క్రీడలను ఎఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ అభిరామ్, జిల్లా గ్రంథాయల శాఖ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డిలు నిర్వహించారు. ఈ క్రీడలో గెలుపొందిన క్రీడకారులకు బహుమతులు ప్రధానం చేయడానికి ముఖ్య అథితులుగా క్రీడ శాఖ చైర్మన్ శివసేన రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గురు సంప్రదాయకులు మల్లిఖార్జున అప్పాజీ పాల్గొని బహుమతులు అందజేశారు. విన్నర్ టీంకు రూ.100000, రన్నర్ టీంకు రూ.50,000, మిగిత క్రిడాల్లో పాల్గొన్ని ప్రతిభ కనబరించిన టీంలకు రూ.25 వేలు, 15 వేలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడ శాఖ చైర్మెన్ మాట్లాడుతూ.. రాష్టం అంతా లేని ఆస్టేలియా బంగారు పథకాలు సాధిస్తే 140కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఒక బంగారు పథకం లేకపోవడం దేశానికే అవమానం అని వివరించారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు దృష్టి సాధించిన్నపుడే దేశానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. దేశంలోనే తెలంగాణ రాష్టం అత్యధికంగా బంగారు పథకాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరంచారు. క్రీడాభివృద్ధి కోసం రెండేళ్లలో రూ.850 కోట్లు ఖర్చు చేసిందన్నారు. చేవెళ్ల నియోజక వర్గంలో మొయినాబాద్ దగ్గర 10 ఎకరాల పొలంలో పెద్ద క్రీడ మైదానం అభివృద్ధి చేస్తామని హమీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హమీలు దశల వారికిగా అమలు చేస్తున్న రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. యువతకు క్రీడల్లో రాణించేందుకు కృషి చేస్తున్న ఎఎంఆర్ ట్రస్ట్ చైర్మెన్ అభిరామ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్, మండల మహిళ అధ్యక్షురాలు అశ్వీని, మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్ మాజీ సర్పంచులు ఎలుగంటి ప్రతాప్ రెడ్డి, తమ్మళి రవీందర్, మహేందర్ గౌడ్, శ్రీనివాసగౌడ్, నాయకులు దండురాహుల్, షాబాద్ దర్శన్, పార్టీనాయకులు తదితరులు ఉన్నారు.

## తెగ బుక్కేస్తున్నారు(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలలో కూడా ప్రతి వ్యక్తీ రోజుకు 5.6 గ్రాముల ఉప్పు తింటున్నారు. ఇదంతా ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సులకు విరుద్ధం. సోడియం క్లోరైడ్‌కు ప్రత్యామ్నాయంగా పోటాషియం లేదా మెగ్నీషియం సాల్ట్‌ను ఉపయోగించవచ్చునని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియోలొజీలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శరణ్ మురళి చెప్పారు. ఈ అధ్యయన నివేదికను తయారుచేసిన బృందానికి శరన్ మురళీ నాయకత్వం వహించారు. ''తక్కువగా సోడియంను తింటే రక్తపోటు సమస్యలు ఉండవు, మొత్తంగా శరీర ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది'' అని ఆయన చెప్పారు. సోడియం చాలా తక్కువగా ప్రత్యామ్నాయ ఉప్పు వాడే పద్ధతులకు అలవాటు పడితే మొత్తం శరీర ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడుతుందని ఆయన అన్నారు. తక్కువ సోడియంను ఉపయోగించే అలవాటు చేయడం కోసం ఐసిఎంఆర్ మద్దతుతో తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాలలో మూడు సంవత్సరాలపాటు అమలు చేసేవిధంగా ఒక ప్రాజెక్టును ఎన్ ఐ ఇ చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద నిర్మాణాత్మక వ్యవస్థలైన ఆరోగ్య కార్యకర్తలకు, వెల్‌నెస్ సెంటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యక్తులలో ఉప్పు వాడకాన్ని ఏ విధంగా తగ్గించాలనే విషయాలను ఎలా తెలియజేయాలో తర్ఫీదు ఇస్తారని ఎన్ఐఇలో మరో సీనియర్ సైంటిస్టు డాక్టర్ గణేశ్ కుమార్ చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రారంభించి మొదటి ఏడాది జరుగుతోందన్నారు. పునాదిస్థాయిలో సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సంస్థలకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు కావాల్సిన పూర్తి వనరులను ఇంకా ఖరారు చేయలేదు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రజలు ఉప్పు తినే అలవాటులో జోక్యం చేసుకునేందుకు, వారి అనుభవాలను, వారి సలహాలను మేళవించి ఒక ప్యాకేజీని తయారు చేస్తున్నాం, అంటే వ్యక్తులకు ఆరోగ్య విషయాల గురించి విద్యాబోధనలు చేయడం మాత్రమే కాదు, వారు జాగ్రత్తగా విని అర్థం చేసుకుని ఆచరించడానికి వీలుగా ఒక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని డాక్టర్ మురళీ చెప్పారు. లో సోడియం సాల్ట్ (ఎల్ ఎస్ ఎస్) ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి తమిళనాడులోని 300 రిటైల్ ఔట్‌లెట్స్‌లో మార్కెట్ సర్వే చేశామని చెప్పారు. ఐతే ఈ ఎల్ ఎస్ ఎస్ కేవలం 28 శాతం దుకాణాలలో మాత్రమే వినియోగదారులకు అందుబాటులో ఉందని, 52 శాతం సూపర్ మార్కెట్లలోనే ఈ ఎల్ ఎస్ ఎస్ అందుబాటులో ఉందని, పాయింట్ నాలుగూశాతం మాత్రమే చిన్న చిన్న దుకాణాలలో ఎల్ ఎస్ ఎస్ ఉండటాన్ని గుర్తించామని చెప్పారు. 100 గ్రాముల ఎల్ ఎస్ ఎస్ ధర రూ.5.6 రూపాయలకు, సాధారణ సోడియం 100 గ్రాములు రూ.2.7లకు లభిస్తోందని చెప్పారు.

## సర్వం సిద్ధం

**(మొదటి పేజీ తరువాయి)**

సందర్భంగా నిర్వహించే సభకు జనసమీకరణపై జిల్లా కాంగ్రెస్ నాయకులు సమీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల 58,187 నూతన కార్డులను జారీ చేయనుండగా, 11,11,223 మందికి లబ్ధిచేకూరనుంది. దీంతో రాష్ట్రంలో మొత్తం రేషన్‌కార్డులు 95,56,625 లక్షలకు చేరినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండురోజుల క్రితమే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఇదిలా ఉండగా సూర్యాపేట జిల్లాలో నూతన రేషన్‌కార్డుల కోసం 34,225 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు నేటి వరకు 25,362 కార్డులు మంజూరు చేశారు. 840 దరఖాస్తులను రిజక్ట్ చేయగా, 8,026 దరఖాస్తులు వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నూతన రేషన్‌కార్డుల జారీతో 76,723 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 3,24,165 రేషన్‌కార్డులుండగా, ఇందులో అంత్యోదయ కార్డులు 19,830, అన్నపూర్ణ కార్డులు 36 ఉన్నాయి. ఇప్పటి వరకు లబ్ధిదారులకు 5.943.192 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తుండగా నూతన కార్డుల జారీతో 46,338 క్వింటాళ్లు బియ్యాన్ని ప్రభుత్వం అదనంగా పంపిణీ చేయాల్సి ఉంది.

### 80వేల మందితో భారీ బహిరంగ సభ

నూతన రేషన్‌కార్డుల పంపిణీ సందర్భంగా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో నిర్వహించే సిఎం సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున జనసమీకరణ చేస్తుంది. 80వేల మందిని సభకు తరలించేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో పర్యటించి జనసమీకరణపై స్థానిక మండల, గ్రామ శాఖ నాయకులను సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి ఒకటి నుండి మండలానికి రెండు చొప్పున వాహనాల్లో జనాన్ని తరలించాలంటూ సూచించారు. ఈ సభకు మహిళలను అధిక సంఖ్యలో తరలించేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఖరీఫ్ సాగు

**(మొదటి పేజీ తరువాయి)**

లోటు(వర్షాబావం)గా పరిగణిస్తారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు మహబూబాబాద్ జిల్లాలో సాధారణ పాతం 211.1 మి.మీ. కాగా, 182.8 మి.మీ. వర్షం (లోటు 13 శాతం) కురిసింది. వరంగల్ జిల్లాలో 2928 మి.మీ. సాధారణ వర్షపాతం కాగా, 1919 మి.మీ. పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షం 233.7 మి.మీ. కాగా, 159.6 మి.మీ. (లోటు 37శాతం), హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షపాతం 220 మి.మీ. కాగా, వాస్తవంగా 171.3 మి.మీ. (లోటు 22 శాతం), జనగామ జిల్లాలో సాధారణ వర్షపాతం 142 మి.మీ. కాగా, అతి తక్కు వగా 107.8 మి.మీ. (లోటు 41 శాతం), ములుగు జిల్లాలో సాధారణ వర్షపాతం 302.1 మి.మీ. కాగా 230.2 మి. మీ.(లోటు 24 శాతం) వర్షపాతం రికార్డు అయింది. రానున్న రోజులలో సాదారణం కన్నా మించి వర్షం కురిస్తేనే ఈ లోటు భర్తీ కాగాలదని చెబుతున్నారు.

### ముందస్తు వర్షాలకు మురిసి.. ఇప్పుడు దిగులు

ఉమ్మడి జిల్లా రైతులకు ఈ వానాకాలం అను కూలించడం లేదు. గతేడాది ఇదే సమయంలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గోదావరి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కానీ, ఈ సీజన్ లో రైతులకు ఆ పరిస్థితి లేదు. ముందస్తు వర్షాలకు మురిసిన రైతులు ఇప్పుడు దిగులు పడుతున్నారు. మే నెలలో కురిసిన వర్షాలకు కొం దరు దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలను వేస్తే.. మరికొందరు పొలాలు సిద్ధం చేసుకుని నారు పోసు కున్నారు. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు లేక చాలా వరకు పత్తి, మొక్కజొన్న విత్తనాలు భూమిలో ఎండిపోగా.. పొలాలు దున్నిన రైతులు సైతం ఇప్పటికీ వేచిచూసే ధోరణిలోనే ఉన్నారు. వానాకాలం మొదలై రెండు మాసాలు నడుస్తున్నా.. ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. దీంతో జలాశ యాలు, చెరువులకు నీరు చేరక.. పెరిగిన భూగర్భజలాలు కూడా అంతంతే కావడంతో రైతులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

### అదును దాటుతున్నా సాగు 35 శాతమే..

మే 28, 30 తేదీల్లో ముందస్తుగానే వర్షాలు పడడంతో సాగు విస్తీర్ణం అంచనాలు దాటుతుందని ఆందరూ భావించినా.. ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గతేడాది వానాకాలంలో 14.15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని భావించగా, 15.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. గత సాగును దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్లో ఉమ్మడి వరంగల్ లో 15,82,755 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు వేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి సాగు ముందుకు కదలడం లేదు. గతేడాది ఇదే సమయానికి 74 శాతం వరకు పంటలు వేయగా.. అదును దాటుతున్నా ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో 5,46,150 (35 శాతం) ఎకరాల్లోనే సాగు చేశారు. ముందస్తుగా ఒకటి రెండు వర్షాలు పడినా.. ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాకపో వడం వల్ల ఈసారి ఆశించిన మేరకు సాగు పెరగలేదని, అయితే ఇంకా సమయం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

### కష్టకాలంలోనూ పత్తినే ఎంచుకున్న రైతులు

ఈ నేపథ్యంలో గతంతో పోలిస్తే సాగు తగ్గినా.. రైతులు కష్టకాలంలోనూ వర్షాధార పంటగా పత్తిని ఎంచుకున్నారు. 5,76,863 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 4,07,554 (70.28 శా తం) ఎకరాల్లో వేశారు. కాగా 8,78,376 ఎకరాల వ రిసాగు అంచనాకు కేవలం 56,155 (6.88 శాతం) ఎకరాల్లోనే వరి పంటలు వేయడం ఈసారి ప్రతికూల పరిస్థితులకు అద్దం పడుతోంది.రుతుపవనాల కదలిక మందగించడంతో అడపాదడపా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తున్నాయే తప్ప.. భారీ వర్షాలు ఎక్కడా పడడం లేదు. ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు 15 రోజుల వరకు వర్షాలు లేకపోయినా తడి తగిలినా మొలకెత్తుతాయనే ఆశతో ఉన్నారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే నెలన్నర కాలం పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు సంతృప్తికంగా పడకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని సుమారు 1800కుపైగా చెరువులు నీళ్ల లేక వెలవెలబోతున్నాయి.

### ఎండిపోతున్న మొక్కలు

వరుణుడు కరుణించకపోవడంతో మొలకెత్తిన మొక్కలు ఎండు ముఖం పడుతున్నాయి. విత్తనాలు నాటి నెలరోజులు దాటినా పంటలకు సరిపడా ఒక్క భారీ వర్షం కురకపోవడంతో రైతులు ఆవేదన చెంతున్నారు. మరో వారం, పది రోజులకు కూడా సరి. పోను భారీ వర్షాలు కురకపోతే ప్రస్తుతం మొలకెత్తిన పంటలన్నీ ఎండిపోయే ప్రమాదం ఉందని కలవరపడుతున్నారు. వారం రోజులుగా ప్రతీ రోజు మేఘాలు కమ్ముకుంటూ వర్షం వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. అడపాదపా ఓ మోస్తరు వర్షం మాత్రమే పడుతోంది. లోటు వర్షం పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పలు కీలక సూచలు చేశారు. వర్షాధార పంటలైన పత్తి, సోయాబిన్, మొక్కజొన్న, కందులు, పెసర్లు వేయాలనుకుంటున్న రైతులు భూమి 15 20 సెంటిమీటర్ల లోతు తడిస్తేనే నాట్లు వేయాలని సూచించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com